

# సన్న్యాసుల స్వాతంత్ర్యసమరములు

## 1763-1775



954.0317
99554

# సన్యాసుల స్వాతంత్ర్య-
# -సమరములు

With best regards to
★ Mr K S R Murty
[signature]
19.3.71

రచన:

దిగవల్లి వేంకటశివరావు, బి. ఏ. బియల్

నవోదయ పబ్లిషర్సు
విజయవాడ-2.

ప్రచురణ నెం. 21
ప్రథమ ముద్రణ
డిశెంబరు'57

954.0317
C 1719

వెల: 0.75

సుందరయ్య గ్రంథాలయము
ACC No. 99554
హైదరాబాద్ - 500032

ముద్రణ
ఆంధ్రా ప్రింటర్సు
విజయవాడ-2.

# 1

ఆంగ్లేయు లీదేశమును తమ బాహుబలపరాక్రమశక్తిచేత నొక్కసారిగ జయించి బహిరంగముగా తమ రాజ్యాధిపత్యమును స్థాపించలేదు. వారు చాలా కాలమువఱకు మన దేశపు రాజులకు, నవాబులకు అణగి మణగి యుండి, వారు కేవలము వర్తకము చేసికొని లాభము లార్జించువారే కాని రాజ్యకాంక్ష కలవారు కారనుభావము కలుగునట్లుగా ప్రవర్తించిరి తమ రక్షణ కొరకని యుంచుకొనిన సైనిక బలములను రాజులకు నవాబులకు సహాయముగా పంపి వారి శత్రువుల నోడించి తాము కొంతకాలము తెరవెనుక భాగవతము నాడి తరువాత అధికారముచేత జిక్కించుకొని బలవంతులై తుదకు రాజాధిరాజులైరి. తామవలంబించిన కుటిల రాజ్యతంత్రమువలన దేశములో నెన్ని యన్యాయములు జరిగినను ఎంతటి యధర్మము ప్రబలినను ప్రజలకెంత బాధ కలిగినను ఆంగ్లేయులు లెక్కచేయక తమ యక్రమ పద్ధతులను సాగించుచునే యుండిరి.

ఆంగ్లేయు లిట్లు దేశాక్రమణము చేయుచుండగా మన రాజులు నవాబులు ప్రజలు చూచుచు నూరకుండలేదు. ఆంగ్ల రాజ్యాధిపత్యమునకు అంకురారోపణము జరిగిన సంవత్సరమగు 1757 నుండి 1857 వఱకును వీలైనప్పుడెల్ల మనవారాంగ్లేయుల యధికారమును ధిక్కరించి పోరాడుచునే యుండిరి. భారతీయులు మరల తల యెత్తలేకుండ అణచివేసి తమ రాజ్యాధిపత్యమును స్థాపించుటకు ఆంగ్లేయులకు నూరేండ్లు పట్టినది.

మొట్టమొదట ఇంగ్లీషువారిని ధిక్కరించి వారితో యుద్ధము చేసినవారు మన దేశములోని సన్యాసులే. ఈ విజాతీయులను పారదోలి ధర్మ

సంస్థాపనము చేయుటకై వారు చేసినయుద్ధమే ప్రథమ స్వాతంత్ర్య యుద్ధమని చెప్పవచ్చును.

ఐరోపా ఖండమునుండి భారతదేశమునకు వచ్చి వ్యాపారము చేయుటకు ప్రారంభించిన తెల్లజాతి వారిలో పోర్చుగీసువారు మొదటి వారు. వారి వేషభాషలు, ఆచార వ్యవహారములు, ఈ దేశములోని హిందువులకును మహమ్మదీయులకున్ను వింతగా నుండుటయేగాక వారు మనవారి కసహ్యకరములైన గొడ్డుమాంసమును పందిమాంసమును దినుచు ఘాటైన సారాయములను త్రాగుచు శౌచవిధులను పాటింపక క్రూరులుగను అవినీతిపరులుగ నుండి ప్రజలతో చేయు వ్యవహారము లందు న్యాయముగా ప్రవర్తింపకుండిరి. గోవానగరమున స్థాపింపబడిన రోమనుక్యాతలిక్కు క్రైస్తవ పీఠాధిపతులును వారి పాదరీలును నల్లని దుస్తులు ధరించి తక్కినవారివలెనే ఆహార విహారములు చేయుచుండుట వలన ఈ కిరస్తానీ మతమునకు నీతిధర్మములు లేవని హిందువులు మహమ్మదీయులు తలచిరి. పోర్చుగీసువారిని పరంగిలని, కిరస్తానీ మతమును పరంగిల మతమని మన దేశీయులు పిలువసాగిరి. తరువాత మన దేశమునకు వచ్చిన వివిధ పాశ్చాత్య జాతులవారినందరిని మనవారు పరంగీలని నీచార్థములో వ్యవహరింపసాగిరి. * నిన్ను మోసగించుటకు నేను కిరస్తానీవాడ ననుకొంటివా ? యని దేశీయు లొకరితోనొకరను చుండిరని ఆనాటి ఆంగ్లేయ మత బోధకుడొకడు వ్రాసినాడు*

వంగదేశములో వర్తకము చేయుటకు వచ్చిన కలకత్తా దగ్గర ఫ్యాక్టరీ స్థాపించిన ఆంగ్లేయుల ప్రవర్తనమును వారి చర్యలను చూచి దేశీయులలోని అన్ని వర్గములవారును అసహ్యించుకొన సాగిరి. •

---

* The life of Roberto de Nobili in The Aravidu Dynasty-Professor Heras;

జగద్గురు తత్వబోధకస్వామి. కథలు-గాథలు. దిగవల్లి శివరావు.

• The English in Western India Rev. Philip Anderson P 20, 32 Rise of Christian Power. B D.Basu.

ఇంగ్లీషు కుంపిణీవారి రికార్డులవలన సన్యాసులు మొదట 1763లో ఢాకానగరములోని ఇంగ్లీషు ఫ్యాక్టరీపైన దండయాత్ర చేసినట్లును, 1767 నుండి 1775 వ సంవత్సరమువరకు ప్రతి యేటను ఇంగ్లీషువారి యధీనమున గల గ్రామముల పైన దండయాత్రలు చేయుచుండిరనియు తెలియుచున్నను బ్రిటిష్ ఇండియా చరిత్రలను రచించిన ఆంగ్లేయ చరిత్రకారులు 1771 నుండి వంగదేశమున గవర్నరుగాను, 1774 నుండి గవర్నరు జనరలుగాను పనిచేసిన వారన్ హేస్టింగ్సు యొక్క మొదటి ప్రభుత్వకాలమున సన్యాసుల మూకలు వచ్చినది వంగదేశమున కొన్ని ప్రాంతములందు దౌర్జన్యములు చేసెననియు, వానిని కుంపిణీ యధికారులు అరికట్టిరనియు వ్రాయుచుందురు. కొందరు దానిని సన్యాసుల తిరుగుబాటు (The Sannyasi Rebellion) అని పేర్కొందురు.

1935 లో భారతదేశమున బ్రిటిష్ పరిపాలన చరిత్రను రచించిన థాంప్సన్, గెర్రాట్టుగార్లు ఈ సంఘటనను చాలా విచిత్రమైనదనియు ఇది నిగూఢమైన విషయముగా నున్నదనియు, దీనిని గూర్చి భారతీయులెవ్వరైనను పరిశోధించి యొక వ్యాసమును వ్రాసినచో బాగుండుననియు సూచించిరి. "ఆనందమఠ"మను సుప్రసిద్ధ బంగాళీ నవలను రచించిన బంకించంద్ర ఛటర్జీగారు, సన్యాసుల యుద్ధమును గూర్చి వివరించి ఈ ఈ దుండగీడు నాయకులలో దేశాభిమానమును, మతాభిమానమును సమ్మిశ్రితములై యుండెనని వ్రాసిరి. పూర్వము మొగలు చక్రవర్తియైన అక్బరు కాలమునను, వారన్ హేస్టింగ్సు కాలమునను ఇటీవల మన కాలమునను కూడా వంగదేశమునందు ముఖ్యముగా తూర్పు భాగమున ప్రజల మనోభావములు బహుముఖములై ప్రవర్తించిన నిదర్శనములు కనబడుచున్నవని, ఈ సందర్భమునందా చరిత్రకారులు చెప్పియున్నారు. వారీ సూచన చేసి ఇరువదేండ్లు దాటినను మన చరిత్రకారు రెవ్వరు నీ పనికి పూనుకొనలేదు.

ఈ సన్యాసుల దండయాత్రలను గూర్చి చరిత్రకారు లెవరికి తోచినట్లు వారు వ్రాసిరి. వీరు వేలకొలదిగా ఆయుధపాణులై వచ్చి పడుచుందురనియు, గ్రామస్థులనుండి బలవంతముగా సొమ్ము లాగికొని

దోపిడి చేయుచుందురనియు, వీరు ఆతతాయిమూకలనియు కొందరు వ్రాసిరి. అయితే ఆనాడు గవర్నరుగానుండి అన్ని సంగతులను ఎఱిగి యున్న వారన్ హేస్టింగ్సు, ఈ సన్యాసులు వివిధమత సంప్రదాయము లకు చెందిన పరివ్రాజకులనియు, దేశములో హిమాలయ పర్వత పంక్తు లలో గోగ్రానది మొదలు బ్రహ్మపుత్రానది వఱకును వీరు నిరంతరముగా సంచరించుచుందురనియు వీరిలో చాలామంది వ్యాపారము చేయుచుండి రనియు, వీరందరును తీర్థవాసులై యున్నందువలన ప్రజలు వీరిని పూజింతురనియు, వీరి రాకపోకలను గూర్చి ప్రజలవలన తెలిసికొనుట గాని వీరికి వ్యతిరేకముగా ప్రజలసహాయమును పొందుటగాని సాధ్యము కాదనియు, అందువలన సీ సన్యాసుల దండయాత్రలను అరికట్టుట చాలా కష్టముగా నున్నదనియు వారన్ హేస్టింగ్సు 1773 లో వ్రాసిన లేఖలలోను రహస్య వివరణములలోను చెప్పియున్నారు. *

ఈ సన్యాసు లనువారెవ్వరో తరువాత చూతము. దేశములో తిరుగుచుండు సన్యాసులు, బైరాగులు మొదలైనవారు సాధారణముగా నెవ్వరితోను విరోధము పెట్టుకొనరు. అందరితోను మంచిగానే యుందురు. ఇట్టిస్థితిలో కేవలము విజాతీయులై తమకెట్టి సంబంధమును లేని ఇంగ్లీషువారి పైన వీరు కత్తిపహించి వారి గ్రామములపైన దండ యాత్ర చేయుచు వారి సైనికోద్యోగుల నెదుర్కొని యుద్ధము చేయుచు కుంపిణీ వారి ఖజానాలను పట్టుకొనుచు వారి గ్రామములనుండి కుంపిణీ వారికి రావలసినశిస్తులను తామే ముందుగా వసూలు చేసికొనిపోవుచుండి రనినచోనిందులకేదో బలవత్తరమైన కారణము లుండితీరవలెను. ఇంతే కాదు; ఈసన్యాసు లిట్లేదో యొక్కటిరెండుమారులుగాక వరుసగా కొన్ని సంవత్సరములు ప్రతి యేటను దండయాత్రలు చేయుచు నిరంతర యుద్ధము లందలి బాధలనుభవించుట గూడా ముఖ్యముగా గమనింపతగిన విషయము. 1767 నుండి 1775 వరకు వీరిట్లు కొన్ని యేండ్లపాటు

---

* Secret Consultations 21-1-1773 No, 5 and 6, Gleig's Memoirs of Warren Hastings. Letter dated 9-3-1773

యుద్ధము చేసినట్లు ఆ కాలమునాటి కుంపిణీవారి రికార్డుల వలననే తెలియుచున్నది. ఆ రికార్డులు చాలా కాలము అప్రకటితములుగనే యుండగా అందలి ముఖ్య భాగములను బ్రజేంద్రనాధ బెనర్జీగారు కలకత్తాలోని మోడరన్‌రివ్యూ పత్రికలో 1926 వ సంవత్సరము సెప్టెంబరు అక్టోబరు నెలల సంచికలలో ప్రకటించి రెండు వ్యాసములను వ్రాసియున్నారు. * అయితే వారుకూడా సన్యాసుల యుద్ధములయొక్క నిజ స్వభావమును గ్రహింపలేక పోయిరి. ఇంగ్లీషు కలెక్టరులు చెప్పిన వివరములను బట్టియే కొన్ని సంగతులు స్పష్టపడుచున్నవి. గ్రామస్థులు సన్యాసులను శత్రువులుగ పరిగణింపక వీరిని మిత్రులుగనే యెంచి వీరికి సహాయము చేయుచుండిరి. వారిపైన యుద్ధము చేయుటకు వచ్చిన ఇంగ్లీషు సైనికోద్యోగులను, సిపాయిలను వారికి పట్టి యిచ్చుచుండిరి. దండయాత్రలు సాగుచుండిన కాలమునకూడా వంగదేశములోని ఢాకా కలకత్తా మొదలగు గొప్ప పట్టణములందు గోసాయీలు మొదలైన సన్యాసులు వందలకొలదిగా వ్యాపారము నితర వృత్తులను చేసికొనుచు సామాన్య జనులతోపాటు జీవించుచునే యుండిరి దండయాత్రలు చేయు సన్యాసులతో వీరికి, సంబంధమున్నట్లు, ఆంగ్లేయాధికారుల నుమానించుచునే యుండిరి కాని ప్రత్యేక నిదర్శనములు దొరకనందున నేమియు చేయలేకపోయిరి ఒకవంక సన్యాసులిట్లు యుద్ధములు చేయుచునే శత్రువుల మధ్యనున్న తీర్థములను సేవించుచు పుణ్యనదులందు స్నానములు చేయుచు తమ మత ధర్మములను ఆచారములను యధావిధిగా జరుపుకొనుచునే యుండిరి. ప్రజలు వీరి కాతిథ్యమిచ్చి గౌరవించుచునే యుండిరి. ఆ సమయమున ఇంగ్లీషు అధికారులు దేశములో శాంతి భద్రతలను కాపాడుటకు వివిధ పరగణాలలో ఫౌజుదారుల క్రిందనుండిన దేశీయ సిపాయిలను ఇంగ్లీషు కెప్టెనుల నాయకత్వముక్రింద సన్యాసులను నిరోధించుటకై పంపిరి. అయితే ఈ సిపాయిలు తమ కర్తవ్యము

---

The Sannyasi Rebellion based upon Un-published records- Brajendranath Banerjee; Modern Review September and October, 1926

లను సరిగా నిర్వహించుట లేదనియు వీరు సిపాయిలతో సంభాషించుచుందురనియు. క్రమశిక్షణ లేకుండా ప్రవర్తించుచుందురనియు, తమ తుపాకులను అనవసరముగా కాల్చుచు మందుగుండు సామానులను వ్యర్థపరచుచుండిరనియు, తుపాకులకు మందుగుండు సామగ్రి అయిపోవగనే సన్యాసులు వచ్చి వీరిని ముట్టడించుచుండిరనియు అందువలన నింగ్లీషువారీ యుద్ధములందు పరాజయము నొందుచుండిరనియు, ఇంగ్లీషు సైనికాధికారులును కలెక్టరులును పై యధికారులకు వ్రాయుచుండిరి. ఈ విషయమై కలకత్తాలోని ఇంగ్లీషు దొరతనమువారు మిద్నపూరులోని ఇంగ్లీషురెసిడెంటును హెచ్చరించి జాగ్రత్త తీసికొనమనిరి*. ఈ పరిస్థితులనుబట్టి చూడగా ఆ కాలములోని హిందూ మహమ్మదీయ ప్రజలలోని అన్ని తరగతులవారికిని ఇంగ్లీషు కుంపిణీవారల పట్ల గౌరవము లేకుండెననియు, వారిని ప్రతిఘటించుచుండిన సన్యాసులపైననే గౌరవముండెననియు స్పష్టపడుచున్నది.

హిందూమతములోని వివిధ శాఖలకు సంప్రదాయములకు చెందిన సన్యాసులిట్లు దండయాత్రలు చేయుచుండగా మహమ్మదీయులు దీనికి హర్షించి యూరకొనిరనినచో ఈ సన్యాసుల యుద్ధములు కేవలము హిందువుల క్షేమలాభముల కొరకే గాక దేశములోని ప్రజలందరిక్షేమము కొరకే జరిగినట్లు ఎంచవలసి యున్నది.

అన్నిటికన్న ముఖ్యముగా గమనింపతగిన విషయమొకటి యున్నది. ఈసన్యాసులు ఇంగ్లీషువారియొక్క అధికారమునుపలుకుబడియు గల ప్రాంతములోని గ్రామములపైననే ఇట్లుదండయాత్రలుచేసిరిగాని ఇతర దేశీయరాజుల యొక్క రాజ్యములపైన గాని నవాబుల దేశములపైనగాని దండయాత్రలు చేయలేదు. కుంపిణీవారి ఇంగ్లీషు కెప్టెనులను తెల్ల సైనికోద్యోగులను వారు పరిమార్చుచుండిరి. సాధారణముగా పరగణా సిపాయిలు కొంతతడవు పోరాడి పారిపోవుచుండిరి. మూర్ఖముగా సన్యాసుల నెదిరించినవారు మాత్రము వారిచే వధింపబడుచుండిరి.

---

* Secret Proceedings, 10 March, 1773; Nos 10-11

కుంపిణీవా రాయీ గ్రామములనుండి వసూలుచేయు శిస్తు వారికి రాకుండా సన్యాసులు ముందుగనే యీ గ్రామములనుండి యీ మొత్తము లను బలవంతముగా తీసికొని పోవుచుండిరి. కుంపిణీవారిక్రింది జమీందారులయొక్క యుద్యోగులను, దొరల నాశ్రయించి తిరుగు వర్తకు లను గ్రామస్థులను కొందఱిని పట్టుకొని తాము కోరినసొమ్ము నిచ్చువరకు నిర్బంధించి యుంచి తరువాత వదలివేయుచుండిరి. అంతేగాని ఈ సన్యాసు లితరుల నెవ్వరిని పట్టుకొని నిర్బంధించినట్లుగాని బాధించినట్లు గాని నిదర్శనములు లేవు. అప్పుడప్పుడు సన్యాసుల దండయాత్రలందు కొన్ని దౌర్జన్యములు జరిగినను అవి సన్యాసులు జరిగించినవికాక ఆశతో చేరిన ఆతతాయిజనము చేసిన వేయని చెప్పవచ్చును. ఏది యెట్లున్నను తరువాత కొన్ని సంవత్సరముల కాంగ్లేయ రాజ్యకాలముననే పిండారీలను దోపిడిమూకలు చేసినట్లుగా స్త్రీ పురుషులను పిల్లలను చిత్రవధలు చేయుటగాని, స్త్రీలను మానభంగము చేయుటగాని, ఇండ్లను తగుల బెట్టుట మొదలైన రాక్షస కృత్యములుగాని సన్యాసుల యుద్ధములందు జరుగలేదు. ఏ చరిత్రకారులు నిట్టివి జరిగినట్లు వ్రాయలేదు. సన్యాసులు వచ్చుచున్నారని తెలియగానే గ్రామస్థులు ఇండ్లు వాకిండ్లు వదలి పారి పోవుచుండిరని కొందఱు దొరలు వ్రాసిరి. ఆమాట నిజమే; కాని దానికి కారణము వేరు. తామక్కడ నున్నచో నింగ్లీషు సైనికోద్యోగులు తమకు సహాయము చేయవలసినదని నిర్బంధింతురనియే వీరిట్లు పారిపోయిరి. గ్రామస్థులు సన్యాసులకు కావలసిన వస్తువుల నిచ్చి సహాయము చేయు చుండిరి. కొందరు జమీందారులుకూడా వారికి సహాయము చేయుచుండి రనియు వారిపైన చర్య తీసుకొందుమనియు వారన్‌హేస్టింగ్సు 31-3-1773 వ తేదీన వ్రాసిన లేఖలో కలదు. సన్యాసు లాయుధపాణులై యుండుటనుగూర్చి యాక్షేపించుచు వారు సన్యాసులు కారనియు ఆత తాయి జనమనియు కొందరు చరిత్రకారులనిరి దేశములో అరాజకము వ్యాపించి బందిపోటులు జరుగుచుండగా ప్రభుత్వమువారు ప్రయాణీకు లకు రక్షణము కలిగింపలేకపోయినందువలన దేశప్రజలందరు నాకాల మున నేదో యొక ఆయుధమును ధరించి పోవుచుండిరి. ప్రయాణము

లందు ఆయుధపాణుల సహాయమును పొందుచుండిరి. ఆ కాలమున సన్యాసులుకూడా స్వసంరక్షణము కొఱకు తమ దండములు త్రిశూలములు గాక ఇతర ఆయుధములనుకూడా ధరించుటలో నాశ్చర్యములేదు.

ఇక ఈ సన్యాసులు గ్రామములను దోచుకొనుచున్నారని గ్రామస్థుల నుండియు, వర్తకులనుండియు బలవంతముగా సొమ్ము వసూలు చేయు చున్నారనియు ఆంగ్లేయులు వీరిని నిందించిరి. ఆ కాలమున ఆంగ్లేయులు కూడా శత్రు నగరములను పట్టుకొన్నప్పుడు దోచుకొని, దోపిడిసొమ్మును పంచుకొనుచుండిరి. దోపిడివలన తమకింత సొమ్ము రాగలదని అంచనా వేసి ఆమొత్తమును శత్రురాజులవలన బలవంతముగా పుచ్చుకొనుచుండిరి. ఈ దోపిడి సొమ్ములో కుంపిణీవారి వాటాలను కుంపిణీవారు నియమించిన సైనికుల వాటాలను ఇంగ్లండు రాజుగారు కుంపిణీవారికి సహాయము చేయుటకై పంపిన సైనికోద్యోగుల వాటాలను గూర్చి కుంపిణీవారు ఇంగ్లండు రాజువలన పొందిన పట్టాలోకూడా వ్రాయించుకొని దోపిడిని క్రమబద్ధము చేసిరి. ఇట్లు దోపిడి శాస్త్ర సమ్మతమైన ఆచారముగా జేసిన ఆంగ్లేయులు సన్యాసులను నిందించుట హాస్యాస్పదమైన విషయముగా నున్నది. ఆంగ్లేయులు ప్లాసీయుద్ధానంతరము మూర్షిదాబాదును, టిప్పు యుద్ధానంతరము శ్రీరంగపట్టణమును దోచుకొనుటయేగాక 1857లో సిపా యిల విప్లవానంతరము ఢిల్లీ, లక్నో, ఝాన్సీ, మొదలగు మహానగరము లను దోచుకొని లెక్కలేనంత విలువగల ధనకనక వస్తువాహనములను పట్టుకొనిపోయిరి. చేతికి దొరికినదెల్లవిజేతలకు హక్కుగలదే యను సూత్రముతో వర్తించిరి. * సన్యాసుల నెదుర్కొనుటకు మొట్టమొదట పంపబడిన ఇంగ్లీషు సైనికోద్యోగులు తాము సన్యాసులవలన ఓడింపబడి పరాభవింపబడినను తామెంతో ధైర్య సాహసములతో యుద్ధములు చేసిరి మరియు, సన్యాసులలోకొందఱు యుద్ధభూమిపైన మరణించిరనియు మిగి

---

* The Nabobs of Madras- Henry Dodwell. p 65
The Empire of the Nabobs-Lester Hutchinson P. 75
Eighteen Fifty seven

లివవారు పారిపోయిరనియు అబద్ధపు సంగతులతో పై యధికారులకు రిపోర్టులు పంపుచుండిరి. క్రమక్రమముగా యుద్ధము తీవ్రములై వేల కొలది సన్యాసిదళములు వచ్చిపడి. సిపాయిలేగాక కొందఱు ఇంగ్లీషు సైనికోద్యోగులుకూడా హతులుకాగా యదార్థ పరిస్థితులు బయల్పడెను. సన్యాసులు తమ సేనాధిపతులను ఓడించి వధించిరనియు, తాను గట్టి చర్య తీసుకొందుననియు వారన్ హేస్టింగ్సు రహస్య లేఖలందు వ్రాసెను.

సన్యాసులు ఆంగ్లేయులకుగాని వారిచేతిలోని కీలుబొమ్మలైన వంగదేశపు నవాబులకుగాని లోబడిన ప్రజలు కారు. అందువలన వారు చేసిన దండయాత్రలు. యుద్ధములేగాని ఇంగ్లీషు చరిత్రకారులు వ్రాసి నట్లు తిరుగుబాటు కానేరవు. బ్రిటీషు రాజ్యాధికారమును ధిక్కరించుచు భారతీయులు చేసిన యుద్ధములనెల్ల ఇంగ్లీషు చరిత్రకారులు పితూరీలనియు తిరుబాటులనియు వ్రాసి లోకము కన్ను గప్ప జూచిరి.

## 2

సన్యాసులనగా నెవ్వరు ? వారి యాశ్రమధర్మము లెట్టివి ? అను విషయములు తెలిసికొనినగాని సన్యాసుల యుద్ధముయొక్క స్వభావ మును అర్థము చేసికొనుట కష్టము.

ధర్మార్థకామమోక్షము లను చతుర్విధ పురుషార్థములను సాధించు ట కేర్పడిన బ్రహ్మచర్య. గార్హస్థ్య. వానప్రస్థ సన్యాసాశ్రమములో సన్యాసము నాలుగవది. దీనికి బ్రాహ్మణులే అధికారులని మను వచనము. బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులను మూడు వర్ణములవారు నీ యాశ్రమమును స్వీకరించుచుండిరి. సన్యాసాశ్రమము స్వీకరించుటకు ధర్మశాస్త్రములందు కొంతతంతు విధింపబడియున్నది. సన్యాసాశ్రమములను స్వీకరించినవాడు పుత్రేషణ. విత్తేషణ. లోకేషణలను త్యజింపవలెను. సన్యాసియగు

వారు కౌపీనమాత్రధారులై, తలనున్నగ క్షురకర్మ చేయించుకొనిగాని తల
వెండ్రుకలను జడలుగా పెంచుకొని గాని, ఏకదండమును గ్రహించి,
భిక్షార్థియైనప్పుడు మాత్రమే గ్రామములోనికి ప్రవేశించుచు తక్కినవేళలనే
దేవాలయములోనో, చెట్టుక్రిందనో వసింపవలెను. ఇంద్రియములను
నిగ్రహించి సంయమనము కలిగి వర్షకాలము నాలుగు నెలలుతప్ప
మిగిలిన కాలములందు ఒక రాత్రి గడిపిన గ్రామమునం దింకొక రాత్రి
యుండక నగరమునందైనచో నైదు రాత్రులుమాత్రముండి సదా తిరుగు
చుండవలెను. పుణ్యక్షేత్రమునందు మాత్ర మీ నియమములేదు. సన్యాసి
ఆహారము కొఱకు ధాన్యమును దంపకూడదు. అతడు భూతముల విష
యమున సంభవించు హింసానుగ్రహములందు సమభావము కలిగియుండ
వలెను ఐహికాముష్మిక ఫలితములను గోరి కార్యముల నారంభింప
రాదు. భిక్షాటనము, జపము, స్నానము, ధ్యానము, శౌచము, దేవతార్చనము
కర్తవ్యములు. మంచముపైన పండుకొనుట, తెల్లని వస్త్రములను
ధరించుట, స్త్రీల సంగతి వినుట, వస్తువులయందు లోలతయు, సన్యాసిని
పాడుచేయును. మఱియు వృధా సంభాషణము, పాత్రాదులందు లోభము
ద్రవ్యమును సంపాదించుటయు శిష్యసంగ్రహమును. హవ్యకవ్యముల
వాని యన్నము నెప్పుడును వర్జింపవలెను. యతికి మృణ్మయముతోను
వెదురుతోను చేసినది, కర్రతో చేసినవి. యాబతుంబులు (సొరకాయ
బుర్రలు) మొదలైనపాత్రలుండవలెను ఎల్లప్పుడును తీర్థవాసమును, దీర్ఘ
కాల ముపవాసమును, వేదార్థముల తప్ప ఇతర గ్రంధముల చదువుట
గాని చెప్పుటగాని కూడదు. యతిధర్మములన్నియు ధర్మశాస్త్రములందు.
వివరింపబడి యున్నవి.

కామ్యకర్మలను విడుచుటయే సన్యాసము. సన్యాసి యోగము
నభ్యసించి యోగి యగును. యోగి అరిషడ్వర్గములను వీడవలయును.
సత్యము, దయ, క్షమ. ధృతి మితాహారము, నను పది యమములను.
తపము, సంతోషము, ఆస్తికత్వము దానము, భగవద్దర్శనము, వేదాంత
శ్రవణము, లజ్జ, మతి, జపము, వ్రతము అను పది నియమములను
యథావిధిగా పాటింపవలెను. సన్యాసియగువాడు కామ్యకర్మలను విడువ

వలయునే గాని కర్మలనే యాచరింప నక్కరలేదనుట సరికాదు. ఇట్లే ప్రపంచమునందా సక్తిని విడువవలయునేగాని ప్రపంచముతో సంబంధ మునే విడువవలయునదియు కాదు. ఈ పుణ్యభూమియైన ఆర్యావర్తము నందు జన్మించిన ప్రతివ్యక్తియు వర్ణాశ్రమ ధర్మమునకు బద్ధుడై, పురు షార్థ సాధనకై వేదశాస్త్రములందు విధింపబడు స్వధర్మము ననుష్ఠింప వలెను. అంతటితో నూరకొనుటకును వీలులేదు. చతుస్సాగర పర్యం తముగల భూభాగమునందు గోవు మొదలు బ్రాహ్మణునివఱకు గల సమస్త జీవులకును శుభమొనగూడునట్లు ప్రయత్నింపవలెను పురుషార్థ సాధనకొరకేర్పడిన ధర్మమునకు భంగము కలిగినప్పుడు అధర్మమును తొలగించి ధర్మసంస్థాపనము చేయుటకును పాటుపడవలెను. వేదములను ధర్మమును కాపాడవలెను. పురాణేతిహాసప్రసిద్ధులగు సన్యాసులందరు నిట్లు చేసిరి. ఉపనీతుడై బ్రహ్మచారియై వేదశాస్త్రము లభ్యసించి, క్రమప్రకా రముగృహస్థవానప్రస్థాశ్రమములనుగడపి సన్యాసాశ్రమమును స్వీకరించిన బ్రాహ్మణులలోనే చాలామంది ఈ సన్యాసాశ్రమును యథావిధిగా నాచ రింపలేకపోయిరి. బ్రాహ్మణున కొక్కనికే సన్యాసాశ్రమమును స్వీకరింప వీలుకలదని మనువు చెప్పినను బ్రాహ్మణ క్షత్రియ వైశ్యకులములవారు సన్యాసాశ్రమమును స్వీకరించుచుండిరని కూర్మపురాణము చెప్పుచున్నది. అందువలన నీమూడు కులములవారును సన్యాసాశ్రమమును స్వీకరించిరి.

భారతదేశమునందు వన, రణ, గిరి, పర్వత, సాగర భారతి, పురి సరస్వతి, తీర్థ, ఆశ్రమ, అను పది సంప్రదాయముల సన్యాసులున్నారు.

బ్రాహ్మణులైనను ఇతరులైనను సన్యాసాశ్రమమును స్వీకరింప గనే వర్ణమును విడిచిన వారగుదురు. వారు శిరములను నున్నగా క్షౌరము చేయించుకొని దండకమండలములు ధరించి కాషాయపురంగు కౌపీన మునో వస్త్రమునో ధరింతురు.

భారతదేశమునందు అసేతు హిమాచల పర్యంతము వివిధ సంప్ర దాయములకు చెందిన సన్యాసాశ్రమ పీఠములును మఠములును కలవు. ఈ పీఠాధిపతులైన జగద్గురువులును మఠాధిపతులైన మహంతులును సంఘ

రములను ఆయా సంప్రదాయములకు చెందిన సన్యాసులకు గురువులై మతధర్మ ప్రవర్తకులై, గౌరవము పొందుచుందురు. రాజాధిరాజు లీ పీఠములను పోషించుచుండిరి. ధనవంతులు వీరికి ధనము నొసగుచుండిరి. ఇప్పటికిని ఇట్టి పీఠములు మఠములు నున్నవి. వీనికి చెందిన సన్యాసులు దేశములో భిక్షాటనము చేయుచు తీర్థయాత్రలు చేయుచు ఆయా సంప్రదాయములకు చెందిన ధర్మములను ప్రచారము చేయుచుందురు.

సన్యాసాశ్రమమును స్వీకరించినవారిలో కొందఱు మాత్రమే యిందలి కఠిన నియమములను యథావిధిగా ననుష్ఠింప గలుగుచుండిరి. కొందరు యథాశక్తిగా నాచరించుచుండిరి. అందువలన సన్యాసాశ్రమము స్వీకరించినవారిలో ఆచారభేదములు బయలు దేరినవి.

కొందఱు మహానుభావులైన సన్యాసు లేపీఠమునకును చెందక కఠోరములైన నియమముల నవలంబించి జనసంచారములేని మహారణ్యముల మధ్య తపమొనరించుచుందురు. ధర్మాత్ములెవ్వరైన వీరియందు భక్తి కలిగి వీరికాహారమిడినచో భుజింతురు లేనిచో అడవులలోని కందమూలములను ఆకులలములను భక్షింతురు. అవియు కఱవైనప్పుడు నీటిని ద్రావియుండి తుదకు ప్రాణములను బాయుదురు. ఇంతేగాక వారా యడవులలోని క్రూరమృగముల కెఱయగుచుందురు. ఆంగ్లేయు లీ దేశమున రాజ్యాధిపత్యము వహించుచున్న కాలమున నిట్టివారుండినట్లు ఆనాటి గ్రంథకర్తలు కొందరు వ్రాసిరి. "గడచిన మూడునెలలలో సాగరద్వీపము నందొక నిర్మానుష్య ప్రదేశమునందు ఇట్టి యోగులను ఆరుగురను పెద్దపులులు నోట కరచుకొని పోయినట్లు" తనకు తెలిసినదని "వార్డు" అను ఆంగ్లేయ గ్రంథకర్త వ్రాసినాడు. *

---

*Mr. Ward on the Hindus Vol III P. 342. History of India-Hindu and Muslim period-Mount stuart Elphinstone (1841) P. 58

సన్యాసాశ్రమమును స్వీకరించిన పంచగౌడ బ్రాహ్మణులలో చాలా మంది ఆశ్రమ విధులను యథావిధిగా పాటింప నేరక జీవితములు గడిపి నట్లును వారును వారి శిష్యులును సన్యాసులుగానే పరిగణింపబడినను క్రమక్రమముగా ఆ యాశ్రమమునకు విరుద్ధములైన ఆచారములను కలిగి యున్నట్లును చరిత్రవలన తెలియవచ్చినది. ఉత్తర హిందుస్థానములోని గోసాయి లనువా రిట్టివారే. వీరు పైన చెప్పిన పది సంప్రదాయములకు చెందినవారైనప్పటికి సన్యాసాశ్రమ స్వీకారమునందు శాస్త్రప్రకారము జరుప వలసిన కర్మకాండను యథావిధిగా జరుపరు. గోసాయీలలో కొంతమంది వివాహము చేసికొందురు. చాలామంది యుంపుడుకత్తెల నుంచుకొందురు. వీరు శూద్రులకును స్త్రీలకునుగూడా సన్యాసము నొసగుట ప్రారంభించిరి. వీరిలో చాలామంది వర్తక వ్యాపారములను ఇతర వృత్తులను చేసికొని జీవింతురు.

తూర్పు ఇండియా వర్తక కంపెనీవారి పరిపాలనము సందు మొదటి దినములలో వారి న్యాయస్థానముల యెదుట విచారణకు వచ్చిన తగవులను పరిష్కరించుటలో వారి న్యాయాధిపతులు గోసాయీల ఆచారములను గూర్చి విచారించి పండితుల సహాయముతో కొన్ని నిర్ణయములను చేసియుండిరి. ఆ సందర్భమునందు సన్యాసుల సంప్రదాయమునకు సంబంధించిన ధర్మశాస్త్ర విధులను కొన్నిటిని వీరికి వర్తింపజేసిరి. మఱి కొన్నిటిని వర్తింపజేయుటకు నిరాకరించిరి.

గోసాయీలును బైరాగులును, శూద్రులు మొదలైన తక్కువ తరగతికి చెందిన సన్యాసులుగా పరిగణింపబడిరి. వీరికి యాచారములే ధర్మప్రమాణము లైనవి గురువు శిష్యునికి మంత్రోపదేశము చేసి కొంత తంతు జరిపి శిష్యస్వీకారము చేయును. వానప్రస్థులలోను బ్రహ్మచారులలోను, పది సంప్రదాయములకు చెందిన సన్యాసులలోను వారసత్వము శిష్యులకే యుండెను. గోసాయీలును బైరాగులునుకూడా ఈ యాచారమునే పాటించు చుండిరి.

సన్యాసియైన ఒక గోసాయీ గురువు తన జీవిత కాలములోనే యొక శిష్యుని తనయనంతర కర్తగా నియమింప వచ్చును. అప్పు డా శిష్యుడు ఆ గురువుయొక్క ధన ఋణముల కధికారియై వారసుడగును.*

ఆ చుట్టుపట్టుల నా గురువు యొక్క సంప్రదాయమునకు చెందిన మహంతు లాయన ఉత్తరక్రియలను జరిగించుటకు సమావేశమై అతడు చేసిన నియామకమును స్థిరపరచి యా శిష్యుని చేతనే ఆయన యుత్తర క్రియలను జరిపింతురు. అతడట్టి నియామకము చేసియుండనిచో వారే యాయనశిష్యులలో నొకనిని ఆయన యనంతర వారసునిగానియమింతురు. ఈ విషయము పూర్వము కుంపిణీవారి నదరు దివానీ అదాలత్తు అను న్యాయస్థానమువారు పండితుల సహాయముతో నిర్ణయించిరి.

గోసాయీలలోను సన్యాసులలోను గురువు పతితుడైనచో నతనికి శిష్యుని పరిగ్రహించు నధికారముండదు. పంచమహాపాతకములు చేసిన వారు పతితు లనబడిరి బ్రాహ్మణుని చంపుట, మద్యపానము చేయుట, పరదారాగమనము చేయుట, ఇల్లు తగులబెట్టుట, విషప్రయోగము చేసి మనుష్యుని చంపుట, మొదలైన ఘోర పాపములు పంచమహాపాతకము లలో చేరియుండెను. గోవును, బ్రాహ్మణుని స్త్రీని, గురువును, శిశువును చంపినవారిని పరస్త్రీలతో వ్యభిచరించిన వారిని సన్యాసులు వెలివేయు చుండిరి. *

---

* Law of Caste: Steele; Appendix B. Clauses 14, 24, 29 & 42.

• A Digest of Hindu Law West and Buhler Pp 553 554.

* Law of Caste: Steele Appendix B. Para 30. A Digestof Hindu Law West and Buhler 553.

తనకన్న తక్కువకులములోని వారివలనకూడా విద్య నేర్చుకొనుటకు శాస్త్ర మంగీకరించును. అందువలన ఉన్నత కులములవారికి తక్కువ కులములవారు గురువులైరి. ఆస్తికి కర్తకాగల శిష్యుడు లేనిచో గోసాయీల బైరాగులయొక్క ఆస్తులలో వారి యుత్తర క్రియలకైన వ్యయము పోను మిగిలినది ప్రభుత్వమునకే చెందునని కుంపిణీవారి న్యాయస్థానములు తీర్మానించెను. ఉత్తర హిందుస్థానమునందును మధ్య రాష్ట్రములందును బొంబాయి పరగణాలోను గోసాయీ మతములకు చెందిన సన్యాసులు లక్షల కొలదిగా నున్నారు. వీరికాయా ప్రాంతములందలి మఠాధిపతులైన మహంతులే గురువులు. కొందరు మఠముల నాశ్రయించుకొని యుందురు. చాలామంది దేశములో భిక్షాటనము చేయుచు తిరుగుదురు. మఱికొందరు వర్తక వ్యాపారములను ఇతర వృత్తులను వడ్డీ వ్యాపారమును చేయుచు మహాజనులనియు సాహుకారులనియు వ్యవహరింప బడుచున్నారు. వీరిలో వజ్రములు మొదలైన అమూల్య వస్తువులను క్రయవిక్రయములు చేయుచు అమిత ధనము నార్జించినవారు నున్నారు గోసాయీ మఠాధిపతులైన మహంతులు మహాధనవంతులై భోగులై యున్నారు. వీ రన్నికులముల వారిని శిష్యులుగా స్వీకరించుచున్నారు.

గోసాయిలుగాక ఉత్తర హిందు స్థానమునందు జోగులు లేక యోగులు, బైరాగులు, నాగసన్యాసులు మొదలైనవారున్నారు. వీరిలో పైనచెప్పిన పది సంప్రదాయములకు చెందిన సన్యాసులే గాక వివిధ గురు పరంపరలకు చెంది వివిధ ఆచారములు కలవారు నున్నారు. అయితే సన్యాసు లందఱకును ఏవో కొన్ని నియమములు మాత్ర ముండితీరును. వారు వానిని తప్పక పాటింతురు. వీరిలో శైవ వైష్ణవ శాక్తేయ మతశాఖలకు చెందినవారును, కొందఱు దక్షిణాచారులును మఱి కొందఱు వామాచారులు నున్నారు. కొందఱు తామస పూజలు చేయుదురు. కొందఱు నీచదైవముల నారాధింతురు. కొందఱు మంత్రతంత్రములు జరుపుదురు. కొందఱు మహారణ్యములలోను కొండలపైనను వసింతురు. కొందఱు నిరంతర దేశసంచారులై యుందురు. చాలామంది కాషాయాంబరములను కౌపీనములను ధరింతురు. కొందఱు కేవలము దిగం

బయలై తిరుగుదురు. ఎవ్వ రెక్కడ తిరుగుచున్నను పుణ్యతీర్థములందు జరుగు కుంభమేల మొదలైన మహాపర్వ సమయములందు మాత్రము వచ్చి చేరుచుందురు. వర్షకాలములో మాత్ర మెక్కడనో యొక్కచోట చాతుర్మాస్య వ్రతమును జరుపుదురు

సన్యాసులలో సకల విద్యాపారంగతులు, మహాయోగులు మహాజ్ఞానులు మహాభక్తులును మహానుభావులు నున్నారు. వారితోపాటు మూర్ఖులును అవినీతిపరులు నున్నారు. కొందఱు యోగాభ్యాసము వలన అణిమాది సిద్ధులను పొందినవారున్నారు. వీరినిచూచి కొందఱు హఠయోగ మభ్యసించి యోగాసనములను ప్రదర్శించియు, ఇంద్రజాలమువంటి మాయలను చేసియు ప్రజలను నమ్మించి ధనము లాగికొని గంజాయి భంగుల కొఱకు వినియోగించుకొనువారు నున్నారు. కొందఱు జ్యోతిషము సాముద్రికము వశి కేరళముల సహాయమున ప్రజల నాకర్షింతురు. మఱికొందరు వనమూలికలుతెచ్చి వైద్యము చేయుదురు. కొందఱు మంత్రతంత్రములు భూతవైద్యము చేయుదురు. కొందఱు బంగారము చేయుదుమని ప్రజలను మోసగింతురు సన్యాసులలో కొందరు నిజమైన శక్తిసామర్థ్యములు కలవారున్నను హెచ్చుమంది జీవనము నిమిత్తమే ఇట్లు చేయుదురు. ఆంగ్లప్రభుత్వమునందు నాగరకత వ్యాపించి అన్ని పదార్థములకు ధరలు పెరిగి జీవనమే కష్టతరమై సన్యాసులను పోషించువారు తగ్గిపోయిరి. నిజమైన సన్యాసులను ప్రజలుచేయు గౌరవమును చూచి మోసగాండ్రు బయలుదేరిరి.

సన్యాసుల యందిన్ని సంప్రదాయముల వారు విన్ని తరగతుల వారు ఇన్ని కులములవారు చిత్తవృత్తుల వారున్నను ఉత్తర హిందూదేశమునందు సన్యాసుల నందఱిని కలిపి గోసాయీలని వ్యవహరించుట ప్రజలకు పరిపాటియైనది. * దక్షిణ దేశమునందు అందరిని బైరాగు లనుచుందురు. సన్యాసులు సాధారణముగా దండకమండలములను ధరింతురు.

---

* History of India-Mount Stuart Elphinstone Pp. 57-61.

దండము లనేకవిధము లైనవిగ నుండును. సన్యాసులు మంత్ర ప్రభావముచే దండమును ప్రయోగించి స్వసంరక్షణముకొఱ కాయుధముగా చేసికొనిరని, అధర్మమును తొలగించుటకును దుష్టులను శిక్షించుటకును అస్త్రముగానుపయోగించు చుండిరని, పురాణేతిహాసములందు వర్ణింపబడినది. అయితే చరిత్రలో మాత్రము సన్యాసులు స్వసంరక్షణము కొఱకు ఇనుపపొన్నుగల పెద్ద దండములను ఇనుపయీచల త్రిశూలములను, గండ్రగొడ్డళ్ళతో కూడిన దండములను ఇంక ననేక విధములైన ఆయుధములను ధరించుచున్నట్లు కనపడుచున్నది. నాగ సన్యాసులనేక విధములైన ఆయుధములనుధరింతురు. ముఖ్యముగా ఔరంగజేబు అనంతరము దేశములో వ్యాపించిన అరాజకమునందు శాంతి భద్రతలు లేక దేశములో సన్నిప్రాంతములందును బందిపోటు దొంగలు కత్తులు కఠారులు పుచ్చుకొని తిరుగుచు దారిలో కనబడిన వర్తకులను సాధుజనులను సన్యాసులనుకూడా చంపుచుండగా దేశములో ఆయుధపాణుల సహాయము లేనిది ప్రయాణము చేయుటయే దుస్తరమయ్యెను. అందువలన సన్యాసులుకూడ ఆయుధపాణులై తిరుగసాగిరి.

సన్యాసులలో కూడా ఆయుధములు ధరించిన బలాఢ్యులైన క్రూరజాతులవారుండిరి. అందులో నాగసన్యాసులుముఖ్యులు. సన్యాసులలో బందిపోటులు చేయు భోజపురీయులతోను, బక్సారీయుల తోను సన్నిహిత సంబంధము కలిగిన వారు నుండిరి. గిరి సంప్రదాయమునకు చెందిన శైవమహంతుల శిష్యులుగానుండు సన్యాసులును నాగసన్యాసులును ఆంగ్లయుగారంభ కాలము నందును తరువాత కాలమునను కూడా ఆయుధపాణులై తిరుగుచు ప్రతిజిల్లాలోను దౌర్జన్యములు చేయుచు అక్కడి పోలీసువారిని త్రిప్పటలు పెట్టుచుండిరి పశ్చిమ భారతదేశమునను, ఢిల్లీ పరిసరము లందును ఆయుధపాణులైన గోసాయిలు జీతబత్తెము లిచ్చి యాకాలము నందెవఱు రమ్మనినను పోయి వారి కొలువులో యుద్ధములు చేయు సిపాయిలుగా జేరి జీవించు చుండిరనియు, ఇంగ్లీషువారు మహారాష్ట్రులతో చేసిన యుద్ధములందు 1817 వఱకు నిట్టి గోసాయి సిపాయిల నుపయోగించి రనియు బ్రజేంద్రనాథ బెనర్జీగారు 1926లో మోడరన్

రివ్యూలో వ్రాసిన వ్యాసమునందు చెప్పిరి. అయితే ఆయుధపాణులైన సన్యాసు లందరును దోపిడి గాండ్రేయనుటయు "సన్యాసుల" యుద్ధమునందు పాల్గొనిన వారట్టివారే యనుటయు సరికాదు.

నాగసన్యాసులొక ప్రత్యేకతరగతికి చెందినవారు. వీరు చాలా బలాఢ్యులు, క్రూరులు, శూరులు, వీరనేకాయుధములను ధరించి దిగంబరులై తిరుగుచుందురు. వీరు సాధారణముగా నొక్కొక నాయకుని క్రింద పెద్ద సైనికదళమువలె నుండి తమ పర్యటనములం దెవరిపైన నైన ఆగ్రహము కలిగినచో వారితో యుద్ధములు చేయుదురు. తమకాహారము దొరకనిచో గ్రామములపైనబడి దోపిళ్ళు చేయుదురు. వీరు నిరంతరముగా తిరుగుచు గంగా బ్రహ్మపుత్రానదీ తీరమునగల గొప్పతీర్థములకు వచ్చుచుందురు. అప్పుడు వీరికే మాత్రము ఆగ్రహకారణము కలిగినను దౌర్జన్యములు చేయుదురు. ఇటీవలకూడా యిటువంటి సంఘటనలు జరిగిన సంగతి అందఱు నెఱుగుదురు. నాగజాతి వారు మన స్వతంత్రభారత ప్రభుత్వము పైన తిరుగుబాటు గావించి వారిని పెట్టుచున్న చిక్కులు నందరికిని తెలిసిన విషయమే. నాగ సన్యాసులలో కూడా సంప్రదాయ భేదములున్నవి. వీరిలో వీరికి తగవులు వచ్చినప్పుడు యుద్ధములే జరుగుచుండును. 1760లో హరిద్వారమున జరిగిన మహాకుంభమేలలో నాగసన్యాసులు పోరాడు కొనిరి. అప్పుడు పదునెనిమిది వేలమంది యుద్ధభూమిపైన మరణించిరని ఆ కాలమునాటి వారు చెప్పినను కొన్నివేల మంది మరణించిన సంగతి నిజమేయని ఇంగ్లీషు చరిత్రకారులు వ్రాసిరి. హిందూదేశములో నింగ్లీషు వారి రాజ్యముపైన సన్యాసులు చాలాసారులు దండయాత్రలు చేసినారని ఎల్ఫిన్స్టన్ 1841లో ప్రకటింప బడిన తన హిందూదేశచరిత్రలో వ్రాసినాడు. కాని వాని వివరముల నొసగలేదు. *

పైన చెప్పినట్లు వివిధ సంప్రదాయములకు చెందిన గోసాయిలు సన్యాసులు నేకమై ఆంగ్లేయులతో నంతకాలము యుద్ధములు చేయుచు

---

*History of India Mount stuart Elphinstone,p 59.

అందువలన కష్టములను అనుభవించి రవినచో దానికి తగిన కారణ ముండి తీరవలెను. ఆ కాలమునాటి ఆంగ్లేయుల గ్రంథములను జాగ్రత్తగా పరిశీలించినచో ఏ కారణములు తెలియగలవు.

సన్యాసుల యుద్ధములందు పాల్గొనిన వారేవైన కొన్ని యక్రమములను జరిగించి యుండవచ్చును. కాని ఆయుద్యమము మాత్రము ధర్మసంస్థాపనము కొరకు జరిగినదే యనుటకు సందేహము లేదు. వారు చేసిన యుద్ధవిధానమును పరిశీలించినచో నిది స్పష్ట పడగలదు.

లోక సంగ్రహము కొఱకును మతధర్మములను రక్షించుటకును మ్లేచ్ఛులను ప్రతిఘటించుటలోను, ధర్మరాజ్యస్థాపనము చేయుటలోను మహానుభావులైన సన్యాసులు రాజులకు తోడ్పడినట్లును రాజకీయములందు అధ్వర్యము వహించినట్లును చరిత్రలో కొన్ని గొప్ప యుదాహరణములు కనబడుచున్నవి. దక్షిణ హిందూదేశమున మహమ్మదీయులు విజృంభించి మతధర్మములనునాశనము చేయుటకు ప్రయత్నించుచుండగా విద్యారణ్యులవారు సంగమ రాజపుత్రులకు తోడ్పడి విద్యానగర రాజ్య నిర్మాణముగావించి దేశము నుద్ధరించిన సంగతి చరిత్ర ప్రసిద్ధమై యున్నది ఔరంగజేబు చక్రవర్తి కాలమున భారతదేశమున మహమ్మదీయ ప్రభుత్వమునందు హిందువులు తమ మతధర్మములను ఆచరించుకొని సుఖముగా జీవించుటకు వీలులేకపోగా శివాజీమహారాజు ధర్మసంస్థాపనముకొఱకు భవానీఖడ్గము చేతబూని వీరవిహారము చేసి మహారాష్ట్రులనేకముచేసి మహమ్మదీయులను ప్రతిఘటించి "హైందవీ స్వరాజ్యము" స్థాపించుటలో రామదాసస్వామి వారాయనకు తోడునీడమై యుండెను.

అక్బరుచక్రవర్తి కాలమున ఆయుధపాణులైన మహమ్మదీయ ఫకీరులు నిరాయుధులైన హిందూసన్యాసులను బాధించి వధించుచుండగా మధుసూదన సరస్వతిస్వామివారు చక్రవర్తికి విన్నవించినను న్యాయము కలుగలేదు. అంతట ఆయన ధర్మసంస్థాపనము కొఱకై కొందఱు క్షత్రియుల నాహ్వానించి వారికి సన్యాసదీక్షనొసగి మతధర్మములను రక్షించు

భారమువారిపైనుంచిరి. సన్యాసాశ్రమములోని సదిసంప్రదాయములలో తీర్థ ఆశ్రమ, సరస్వతి, అనునవి తప్ప తక్కినయేదు సంప్రదాయములందును సన్యాసదీక్ష పొందిన యీ క్షత్రియ సన్యాసవీరు లంతట ఆయుధములు చేతబూని మహమ్మదీయ ఫకీరులను ప్రతిఘటించి హిందూ సన్యాసులను మత ధర్మములను రక్షించిరి. మొగలు ప్రభుత్వ కాలమునందు స్వధర్మ రక్షణకై హిందూసన్యాసయోధులిట్లు మహమ్మదీయ ఫకీరులతో పోరాడిన యుదాహరణము లింకను చాలా కనబడుచున్నవి. క్రీ. శ 1757 నుండి 1774వఱకును మధ్యగల హిందూదేశ చరిత్రనుపరిశీలించినచో ఆ కాలమున నింగ్లీషు తూర్పుఇండియా వర్తకసంఘమువారు స్వార్థపరులై దేశమును అరాజకములో నుంచి తాము లాభముపొందుచుండిరనియు ఆకాలమున ప్రజల ధనమునకు మానములకు ప్రాణములకు రక్షణలేక అధర్మము వ్యాపించి యుండెననియు ప్రజలు నోరులేక బాధపడుచుండగా ఈ అధర్మమును ప్రతిఘటించుటకై భారతీయ సన్యాసులందఱును నడుము గట్టి దీనికంతకు కారకులైన ఇంగ్లీషు వారితో యుద్ధము చేయగా ఇంగ్లీషువారు కన్నుతెరచి ప్రభుత్వభారమును బాధ్యతను వహించి దేశములో మరల న్యాయము ధర్మము స్థాపించవలసిన వారైరనియు తెలియగలదు.

## 3

భారతదేశమున మొగలాయి సామ్రాజ్యమునందు వివిధ ప్రాంతములలో వర్తకము చేసికొనుటకు ఔరంగజేబు చక్రవర్తి వలన అనుజ్ఞను పొందిన ఇంగ్లీషు వర్తకులు, తమతో పోటీచేయు ఇతర పాశ్చాత్య వర్తకులను ఓడదొంగలను పట్టుకొనుచు హుగ్లీనదిదగ్గర దౌర్జన్యములు చేయుచు చక్రవర్తిగారి పోలీసులను కూడా ధిక్కరించుటకు సాహసింపగా ఆయన ఆగ్రహించి వారి ఫ్యాక్టరీలను పట్టుకొనవలసినదని తన సేనాధిపతుల కుత్తరువు చేసెను. అంతట వా రాయనకు పాదాక్రాంతులైరి.

ఔరంగజేబు చక్రవర్తి తరువాత మొగలు సింహాసనము నధిష్ఠించిన ఫరుక్ షయ్యరు నాశ్రయించి ఇంగ్లీషు కంపెనీవారు ఎగుమతి దిగుమతులుచేయు సరకులపైన సుంకములు లేకుండా వర్తకము చేసికొనుటకును కలకత్తాదగ్గర కొన్ని గ్రామములను విక్రయము పొందుటకును తమ ఫ్యాక్టరీ రక్షణ కొఱకు ఆవరణ చుట్టును కోట గోడలు నిర్మించుకొనుటకును. తమ ఫ్యాక్టరీలో పనిచేయువారికి ఆశ్రయ మిచ్చుటకును వారిని రక్షించుటకును తమ ఫ్యాక్టరీలలో నేరములు చేయువారిని తమపట్లను. ఆశ్రితుల పట్లను నేరము చేయువారిని పట్టుకొని శిక్షించుటకును 1717 లో అధికారమును పొందిరి. ఆ కాలమున చక్రవర్తిగారి రాష్ట్రపరిపాలకుల దయ సంపాదించినగాని ఏ యధికారములు సమలు జరుగవు. వంగదేశ నవాబైన మూర్షిదు కులీఖాన్‌గారు బలవంతుడు. వీరు కలకత్తా దగ్గర క్రొత్తగ్రామములు కొనకుండా ఆటంకపరిచెను గాని వ్యాపారపు సౌకర్యము లొసగెను. వీరి ఫ్యాక్టరీలలో పనిచేయు నౌకరులు మొదలైనవారిని వీరురక్షించుటకు వీరికధికార మిచ్చెను. కొంతకాలమువఱకు వీరు భయభక్తులతో వ్యవహరించిరి. 1756 నాటికి ఆంగ్లేయులకు కొంతబలము చేకూరెను. పడమటి సముద్రమునందు జరిగిన నౌకాయుద్ధమున దేశీయ నౌకాధిపతియైన ఆంగ్రియా నోడించిరి. దక్షిణమున కర్నాటక నవాబుగారి వారసత్వ వ్యవహారములందు ప్రవేశించి ఫ్రెంచివారితో యుద్ధములు చేయసాగిరి. అందువలన వీరికి కొంత ధైర్యము కలిగి వంగదేశమునందు తమకొసగబడిన సౌకర్యములను అధికారములను తృణీకరించి హద్దుమీరి ప్రవర్తింపసాగిరి. తమ ఫ్యాక్టరీలలో తమకు సంబంధములేని వారికిని నవాబుపట్ల ద్రోహము చేసినవారికిని ఆశ్రయమిచ్చి రక్షింపసాగిరి. తమ ఫ్యాక్టరీచుట్టును పెరిగిన బస్తీలలో నివసించు దేశీయులపైనను ఇతరులపైనను అధికారములు చెలాయించుచు తమకుగిట్టని వారిపైన లేనిపోని నేరములు మోపి పట్టుకొని శిక్షింపసాగిరి. తమకుపకారము చేసిన నవాబుగారి రాజ్యమునుండి తమ బస్తీల ద్వారా రవాణాయగు సరుకులపైన ఇంగ్లీషువారు సుంకములు విధించి వసూలు చేయసాగిరి. తమ ఆదాయమును వృద్ధి చేసికొనుటకు తమ

బ స్త్రీలలో పెండ్లిండ్లపైనను, ఆస్తి మార్పిడులపైనను పన్నులు విధించిరి. ఇంకను అనేకవిధములైన పన్నులను విధించుట ప్రారంభించిరి. ఇంగ్లీషు వర్తకకంపెనీ వారి కొవగబడిన సౌకర్యములను పురస్కరించు కొని వారి కొలువులో పనిచేయు దొరలు తమ స్వంత వ్యాపారమునకు సంబంధించిన సరకులపైన కూడా సుంకములు చెల్లింపక తప్పించుకొని దొంగవ్యాపారము చేయుచుండిరి. ఈ యక్రమములు వంగదేశ నవాబైన అల్లావర్దీఖానుగారికి తెలిసెను, అయితే ఆంగ్లేయులకు సముద్రముపైన నౌకాబల ముండుటవలన వీరితో విరోధము పెట్టుకొనుట మంచిదికాదని తలచి ఆయన చూచియు చూడనట్లూరకొనిరి. అల్లావర్దీఖాను 1756 లో చనిపోవగా నాయన మనుమడైన సురాజ్ ఉద్దౌలా నవాబయ్యెను. ఇంగ్లీషు వారాయనకు వ్యతిరేకముగా ప్రవర్తించి ఆయన యాగ్రహమునకు పాత్రులైరి. వారాయనతో రాయబారములు జరుపుచు నాతని దర్బారులోని వారితో కుట్రచేసిరి. సురాజ్ ఉద్దౌలా బంధుగుడగు సేనాధిపతియు నగు మీర్జాఫ రాంగ్లేయులతోచేరి ద్రోహము చేయగా ప్లాసీ దగ్గరచేరిన సేనలో 60 మంది ఇంగ్లీషు సైనికులు 500 మంది నవాబు సైనికులు మరణించు టతో నవాబు సైన్యము చెల్లాచెదరయ్యెను సురాజ్ ఉద్దౌలా వధింప బడెను. మీర్జాఫరు సింహాసనము నధిష్ఠించి తన స్నేహితులైన ఆంగ్లే యుల చేతులలో కీలుబొమ్మ యయ్యెను.

నిజమునకు ప్లాసీయుద్ధమొక గొప్పయుద్ధము కాదు. ఇదియొక సంకుల సమరమని చెప్పవచ్చును. ఇందులో క్లయివు చూపిన శౌర్యప్రతాపములును లేవు. దానిఫలితముగా మీర్జాఫరు నవాబై ఇంగ్లీషు వారికి రాజ్యాధికారములు కలిగినందువలననే ప్లాసీ యుద్ధమునకు ప్రాము ఖ్యత కలిగినది.

మీర్జాఫరు రాజ్యకాలమునందు ఇంగ్లీషు కుంపిణీవారి యుద్యోగులు నౌకరులు తామే వంగరాష్ట్రమునకు పరిపాలకులైనట్లు ప్రవర్తింప సాగిరి. కుంపినీవారి సరకులనేగాక తమ స్వంత సరకులనుకూడా సుంక ములు చెల్లించకుండా తీసికొని పోవసాగిరి. అనుమతి పత్రముల నిరర

వర్తకులకు విక్రయించి లాభము పొందుచుండిరి. మీర్జాఫరు ఆంగ్లేయుల కెంతో ధనమిచ్చెను. వారికెన్నో సౌకర్యముల నొసగెను. కుంపినీవారికి 880చ॥ మైళ్ళ వైశాల్యముగల ఇరువదినాలుగుపరగణా లను దేశభాగమును జాగీరుగా నిచ్చెను. ఎంతచేసినను వారికి తృప్తి లేకపోయెను. 1760 లో వారాయనను తొలగించి ఆయన అల్లుడైన మీర్ఖాసీమునునవాబుగా చేసిరి. అతని వలనకూడా కుంపినీ వారి యుద్యోగులు బహుమతులు పొందిరి. కుంపినీవారి కతడు బర్ద్వాను, మిద్నపూరు, చిటగాంగు జిల్లాలను జాగీరుగా నిచ్చెను. దేశములో దోపిళ్ళు లేకుండా శాంతి భద్రతను కాపాడుటకు కుంపినీవారు సిపాయిల నుంచుట కంగీకరించెను. కుంపెనీ దొరల లాభము కొరకు దేశీయ గుమస్తాలు వ్యాపారముచేయుట ప్రారంభించిరి. వారివలన ఘాటీ సుంకములు వసూలు చేయుటకు నవాబుగారు ప్రయత్నించిరి. అయితే వారి నాటంకపరచిన యుద్యోగులపైన కంపెనీ దొరలు దౌర్జన్యములు చేయసాగిరి. నదిపైన పోవు ప్రతి పడవపైనను కుంపెనీ జెండా నెత్తి సుంకములు చెల్లించకుండా తప్పించుకొనుచుండిరి. కుంపెనీవారి యేజంట్లు వారి యుద్యోగులక్రింద పనిచేయు దేశీయ గుమాస్తాలు, ఉప్పు, పోకచెక్కలు, నెయ్యి, బియ్యము. గడ్డి, వెదుళ్ళు, చేపలు, గోనెలు, కొంరి, పంచదార, పొగాకు, నల్లమందు ఇంకను అనేక వస్తువులను పరగణాలలో క్రయవిక్రయములు చేయుచు విరివిగా వ్యాపారము చేయుచుండిరి. రైతులను, వర్తకులను బలవంతము చేసి సరుకుయొక్క విలువలో నాలుగవ వంతుకే దానిని విక్రయించునట్లు నిర్బంధించిరి. తమ సరకులకు ఒక రూపాయి విలువగల దానికైదు రూపాయ లిచ్చునట్లు బలవంతము చేసిరి. కుంపినీవారు ఓడలపైన దేశాంతరములతో చేయు ఎగుమతి దిగుమతి వ్యాపారములోనే సుంకములు చెల్లించనక్కరలేదని చక్రవర్తి ఫర్మానా ఇచ్చెనుగాని దేశములో చేయు వ్యాపారమున కది వర్తింపదని నవాబుగారు అభ్యంతరము చెప్పినను కుంపినీవారు వినిపించుకొనక దేశములో చలామణియగు అన్ని సరకులపైనను కుంపినీవారు సుంకములు చెల్లించకుండా క్రయవిక్రయములు చేయుచుండిరి. వారి నౌకర్లు స్వంత వ్యాపారము చేసి

లాభములు పొందసాగిరి. ఇదివరకు బీదవారు వ్యాపారము చేసికొని జీవించు ఉప్పు, వక్కలు, పొగాకు, దినుసులలో కుంపెనీవారు క్రయ విక్రయములు జరుపరాదని నవాబుగారు చెప్పియున్నను కుంపెనివారా నిషేధమును తృణీకరించి ఆ సరకులకు సుంకములు చెల్లించకుండా పోటీ వ్యాపారము చేయుచు సుంకము చెల్లించు బీద వర్తకులకన్న తక్కువకు అమ్మి వారి జీవనమును పడగొట్టిరి. నవాబుగారి యుద్యోగు లెవరైన ఆటంకపరచినచో కుంపినీ దొరలు వారిని కొట్టి హింసింప సాగిరి.

దేశములో బందిపోట్లు జరగకుండా శాంతి భద్రతలను కాపాడుట కని వంగదేశ భాషరాని 'తెలింగి'సిపాయిలను తెచ్చి ఇంగ్లీషువారు తమ జాగీరు భూములపైన శిస్తులను వసూలుచేయుటలో రైతులపైన జమీం దారులపైనకూడా దౌర్జన్యములు చేయించుట కుపయోగించిరి. ఇంతే కాదు. తమకు సరుకులను తయారుచేసి యిచ్చుటకు ఒడంబడిక పత్రము లను వ్రాసిన పారిశ్రామికులపైనకూడా ఈసిపాయిలను ప్రయోగించి దౌర్జ న్యములు చేయించిరి. ఇంగ్లీషువారు చేయు అన్యాయములనుగూర్చిమీర్కా సీముమందలింపగా ఇంగ్లీషువారు 1763లోమీర్కాసీమునుతొలగించిమఱల మీర్జాఫరునునవాబుగాచేసిరి ఇంగ్లీషుకంపెనీవారిపద్ధతులుచాలావిపరీతముగా నుండెను.ఆంగ్లేయకంపెనీ దొరలతరపున నొక గుమాస్తా బయలుదేరితన వ్యాపారములోనెవ్వరినైనను బలవంతము చేయుటకు తనకు అధికారము కలిగియున్నట్లు ప్రవర్తించును. తాను చెప్పిన మాట వినని యాసామిని కొట్టినిర్బంధించును. వాడు క్రయవిక్రయములు చేయుట కంగీకరించినను వానికి బాధలు తప్పవు. ఇంగ్లీషువారు వ్యాపారము చేయు సరకులలో నితరు లెవ్వరును క్రయవిక్రయములు జరుపకుండా ఈ గుమాస్తా బందో బస్తు చేయును. తన యాజ్ఞను మీరిన వారిని హింసించి బాధించును. ఈ బాధలు పడలేక రైతులు పారిశ్రామికులు ఇళ్ళు విడిచి దూరదేశములకు పారిపోవసాగిరి. సంతలు, బజారులు నిర్మానుష్యములగు చుండెను. గుమాస్తాలు బంట్రోతులు దేశీయులపైన దౌర్జన్యములు చేయుచుండిరి. వీరిని మందలించుటకు జమీందారు ప్రయత్నించినచో వారినికూడా

దండించెదమని బెదిరించిరి. పూర్వము న్యాయవిచారణ బహిరంగముగా నొక రచ్చ చావడిలో జరుగుచుండెను ఇప్పుడు ప్రతి గుమస్తాయు తాను బసచేసిన ప్రదేశము నొక కచ్చేరిగా చేసి రైతులను పారిశ్రామికులను మాత్రమేగాక జమీందారులనుకూడా శిక్షించుట ప్రారంభించెను. తమ జవానులతో కలహించెననియో, లేదా ఏదో సరుకును దొంగిలించెననియో అబద్ధపు నేరమును ఆరోపించి పట్టుకొని నష్టపరిహారము క్రింద వారిదగ్గరనుండి సొమ్ము లాగికొనును.

ఇంగ్లీషు కుంపినీ గుమస్తాలు బయలుదేరిపోయి ప్రతి గ్రామములోను తయారగు ప్రతివస్తువుకు బజారావ్యాపారపు పద్ధతి నేర్పరచి, ఆ సరుకు నెంతెంత ధరకు తయారుచేసి నప్పగించవలెనో తామే నిర్ణయింతురు. ఈ గుమాస్తా తన 'పైకార్లను', జవానులను పంపి దళారీలను పైకారులను, నేతగాండ్రను పిలిపించి, వారికిష్టము లేకపోయినను వారిచేత బలవంతముగా పత్రములు వ్రాయించి వారి పేర్లను తన పుస్తకములో నెక్కించును. వారితరుల కెవ్వరికిని పనిచేయకుండా నొకశాశ్వతపు బానిసత్వపు విధానమునకు లోబరచును. అమాయకులను మోసగించును. ఎదురు తిరిగినవారిపైన నేరములు మోపి శిక్షించును. ఈ ముచ్చిలకాలను పురస్కరించుకొని, రైతుల యిండ్లలోని సామానులను పారిశ్రామికుల ఇండ్లవాకిండ్లను అమి ంచును ఈ ఘోర పరిస్థితుల వలన దేశములోని పారిశ్రామికులు ఇండ్లు వాకిండ్లు వదలి పారిపోవసాగిరి. దేశములోని పరిశ్రమలును, వృత్తులును నాశనములయ్యెను.

ఇంగ్లీషు కుంపిణీవారి యుద్యోగులును నౌకరులును, నవాబుగారు యుద్యోగులను నౌకరులను ధిక్కరించి భూముల నాక్రమించి కవుళ్ళ కిచ్చి బలవంతముగా శిస్తులను వసూలుచేయుచు నవాబుగారికి చెల్లించవలసిన పన్నులను చెల్లింపకుండిరి· వారు అడవుల నాక్రమించి రైతులను కట్టెను కంపను నరుకనివ్వక, వారివలన తాము పుల్లరి పన్ను వసూలు చేయుచు నవాబుగారికొక పైసయినను చెల్లింపకుండిరి. పూర్వపు నవాబులు కట్టించిన ముసాఫరు ఖానాలను సరాయిలను ఇంగ్లీషువారి ఏజంట్లు గుమాస్తాలు ఆక్రమించి బాటసారులను రానివ్వకపోవుటయే గాక నవాబు

గారి బంధుజనమునుకూడా రానివ్వకుండిరి. తమ కాటంకములు కలిగించినవారిపైన లేనిపోని నేరములుమోపి పట్టుకొని శిక్షించి నిర్బంధించుచుండిరి.

1765 లో ఇంగ్లీషు కుంపినీవారు వంగదేశమునకు, బీహారు ఒరిస్సా పరగణాలలోను ప్రభుత్వాదాయమును వసూలుచేయు దివానుగిరి యధికారమును మొగలు చక్రవర్తివలన పొందిరి. అంతట వారు చేయు దుర్మార్గములను మరింత మితిమీరెను. తాము ప్రభుత్వ భారమునుగాని బాధ్యతలనుగాని వహింపక తాము వెనుకనేయుండి, అన్ని వ్యవహారములను నవాబుగారి యుద్యోగులద్వారా జరిపింపసాగిరి. ఏ వ్యవహారమునందుగాని నవాబుగారి యుద్యోగులు స్వబుద్ధిని వినియోగించి పనిచేయుటకు వీలులేదు. తామెవ్వరికి నెట్టి యుపకారము చేయుటకు వీలులేదు. దొరలకు కోపము వచ్చునని వారు దేశీయులతో చెప్పుచు కాఠిన్యము వహించిరి. ఆ కాలమున కుంపినీవారు నవాబుగారి టంకసాలలో చౌకగా నాణెములను ముద్రించుటకు పొందిన సౌకర్యము ననుసరించి కుంపినీ వారి నౌకరు లందరుకూడా వెండిబంగారులను తెచ్చి చౌకగాముద్రింపించుకొని లాభమును పొందసాగిరి.

వంగదేశమున మొగలు చక్రవర్తి పేరుననే పరిపాలనయంతయు జరుగుచుండెను. దేశాదాయమును వసూలుచేయు దివానీ యధికారమునందు సివిలు న్యాయవిచారణాధికారము కూడా చేరియుండెను దేశరక్షణమునకు సంబంధించిన "నిజామత్" అధికారమునందు నేరములను విచారించు క్రిమినల్ న్యాయపరిపాలనము చేరియుండెను దివానీ యధికారము 'నిజామత్' అధికారమునకు లోబడియుండెను రాజధాని నగరమునందు వంగదేశ నవాబుగారును వారి యుద్యోగులును సివిలు క్రిమినలు న్యాయ పరిపాలనము జరిగించుచుండిరి. దేశము లోపల జమీందారులే ఆ యధికారములను కలిగియుండిరి. ఇంగ్లీషువారి కొసగబడిన జాగీరు జిల్లాలలో వారి యధికారులైన దొరలే అన్ని వ్యవహారములను జరిగించుచుండిరి. తక్కిన రాజ్యభాగమునందు నవాబుగారి యుద్యోగుల ద్వారానే అన్ని వ్యవహారములను జరిగించుచుండిరి. అయితే అవి

యంతయు ఇంగ్లీషు అధికారుల పెత్తనము క్రిందనే జరుగుచుండెను. మూర్షిదాబాదులోను పట్నానగరము నందును ఇద్దరు నాయిబు దివానులుండిరి. వీరి వ్యవహారనిర్వహణమును కనిపెట్టిచూచుటకు ఇద్దరుఇంగ్లీషు రెసిడెంటులు నియమింపబడిరి. 1769 లో ప్రతి జిల్లాలోను కుంపినీవారి తరపున అన్ని వ్యవహారములను కనిపెట్టి చూచుటకై సూపరువైజరులు నియమింపబడిరి. వీరే తరువాత కలెక్టరులైరి. కుంపినీ యుద్యోగులకు దేశభాషలు రావు. వీరు లంచగొండులై అవినీతిపరులై యుండిరి. వీరు తమ లాభమును చూచుకొనువారేగాని ప్రజల క్షేమమునుగాని కష్టసుఖములుగాని ఆలోచింపరైరి. అందువలననీ ద్వంద్వపరిపాలనమునందు దేశప్రజల ధనమునకు, మానమునకు, ప్రాణములకు రక్షణ లేకుండెను. ప్రజలెంత మొఱలు పెట్టినను ఇంగ్లీషువారు వినిపించుకొనరైరి.

ఆంగ్లేయు లీ దేశములో వలకుబడిని అధికారమును సంపాదించుటయేగాక దక్షిణమున కర్నాటక నవాబులవలనను ఉత్తరమున వంగదేశ నవాబులవలనను కొన్ని పెద్ద జిల్లాలను జాగీరులుగా పొంది జమీందారులైరి. ఈ విధముగా తమకు లభించిన గ్రామములలో భూములకు తామే యజమానులమైతిమని భావించి తర తరములనుండి ఆ భూములను సాగు చేయుచుండిన రైతులసంగతి ఆలోచించక, ఆభూముల నితరులకు గుత్తకిచ్చి వీలైనంత హెచ్చు మక్తాను రాబట్టి లాభము పొందుచుండిరి. పూర్వమాప్రాంతములం దధికారులుగా నుండిన జమీందారులు తాలూకాదారులు జాగీరుదారులును రైతులవలన శిస్తులను వసూలు చేయుట కధికారము పొందినవారేగాని భూస్వాములు కారు. పూర్వము హిందూరాజుల కాలములో రైతులు పండించిన పంటలో ఆరవవంతు రాజభాగముగా గైకొనబడుచుండెను. మొగలు చక్రవర్తియైన అక్బరు కాలమున మూడవవంతు రాజభాగముగా వసూలు చేయబడెను. ఈ రాజభాగము లేక శిస్తులను వసూలుచేయు హక్కు మొగలు చక్రవర్తులు తరువాత కాలమున యిజారాల కిచ్చిరి. పూర్వపు రాజవంశీయులలో కొందరును, ఇతరులును వంశ పారంపర్యముగా నీ యిజారీలను పొందుచు ఆయా ప్రాంతములందు ప్రభుత్వాధికారములను కూడా కలిగియుండి రాజబిరుదులను రాజ

లాంఛనములను వహించి ఆ గ్రామములకు భూములకు తాము యజమానులైనట్లు నటించుచుండిరి. ఈ రాజులు, జమీందారులు, జాగీరుదారులు ఆయా ప్రాంతముల నేలు నవాబులకు పేష్కషు చెల్లించుచు, ఆ గ్రామములకు యజమానులై రైతులవలన శిస్తులను వసూలు చేసికొని అనుభవించుచుండిరి. సాధారణముగా ఈ జమీందారులను నవాబులును తొలగింపరు. రైతులను జమీందారులును తొలగింపరు. ఈ సంప్రదాయముల నెఱుగని ఇంగ్లీషువారు తమ కొసగబడిన జమిందారీ గ్రామములలోని భూములకు తామే యజమానుల మైతిమని తలచి వానిని వేలము వేసి అందులోని రైతులగతి యాలోచింపక హెచ్చుపాట పాడినవారి కా భూములను స్వాధీన పఱుపసాగిరి. తమ వశమైన జమీందారీ గ్రామములలోని భూములను కొంత సంవత్సరముల గుత్త తీసుకొను హక్కును వేలము వేయు పద్ధతిని ఇంగ్లీషువారు 1762 లో ప్రవేశపెట్టిరి. సోరులేని రైతులు చేయునది లేక తమ తండ్రితాతలనాటినుండి సాగుచేయు భూములను వదలలేక తామే వేలము పాడుటకు నిశ్చయించిరి. అయితే ఈ భూములను స్వాధీనము పొంది రైతులను పీడించి లాభము పొందదలచిన దళారీలు పోటీకివచ్చి చాలా హెచ్చు మొత్తములను పాడిరి. ఆస్తిగాని పరపతిగాని లేని దళారీలిట్లు పెద్ద పాటపెట్టి రైతులను హింసించి క్రూరమైన పద్ధతులతో శిస్తులు వసూలుచేసి మొదటి సంవత్సరము వాయిదా మొత్తము చెల్లించి పరారి యగుచుండిరి. భూములపైన విధింపబడిన విపరీతపు శిస్తులను చెల్లింపలేక రైతు కుటుంబములు నాశన మయ్యెను. వారు భూములను వదలుకొనసాగిరి. వ్యవసాయ మడుగంటెను. క్రూరకృత్యముల కొడిగట్టలేని పూర్వరాజ వంశీయులైన జమీందారులు కుంపినీ వారికి బాకీలుపడి వారివలన బాధింపబడిరి. కొందరు జమీందారులను చెరపెట్టి వారి ఎస్టేటుల నమ్మించిరి. ఇంగ్లీషువా రవలంబించిన ఈ భూమి శిస్తుల విధానమువలన వంగదేశములోని రైతులు భూములను సాగుచేయలేక అడవుల పాలైరి. పంట తగ్గిపోయెను.

1768 వ సంవత్సరములో బంగాళాదేశ మందంతటను పంట నష్టమయ్యెను. అయినప్పటికిని, ఇంగ్లీషువారు కరుణలేక శిస్తులను

పూర్తిగా వసూలుచేసిరి. ధాన్యము ధరలు విపరీతముగా పెరిగిపోయెను. బీదవారు కొనలేకపోయిరి. రైతులకు విత్తనములు లేకపోయెను. 1769లో మద్రాసు మొదలైన ఇతర రాష్ట్రములనుండి వర్తకులు వచ్చి ధాన్యమును హెచ్చుధరలకు కొని రవాణా చేయసాగిరి. ధాన్యమంతయు ఇతర ప్రాంతములకు పోవుటవలన వంగదేశమునకు దుస్థితి కలుగునని ఎఱిగియు ఇంగ్లీషు కుంపిణీదారులు లాభాపేక్షతో నుపేక్ష వహించిరి. ఆ సంవత్సరము కోతలసమయమున అతి వృష్టివలన పంటలు నష్టమయ్యెను. కుంపిణీవారు తమ సైన్యముకొఱకు ధాన్యమును నిలువచేసికొనిరేగాని ప్రజలకొఱకు నిలువ చేయలేదు. అప్పుడుకూడా శిస్తులను కఠినముగ వసూలుచేసిరి. ఈ పరిస్థితులలో 1770 వ సంవత్సరమున వంగదేశములో కనివిని యెరుగని కఱవు తటస్థించెను. ప్రజలు పశులవలె అల్లాడిపోవుచుండగా, ఒక జిల్లాలో ప్రజలు కరువువలన బాధపడుచుండగనే, మన శిస్తులవసూలుకు భయములేదని కుంపిణీదారులు సీమలోని పై యధికారులకు వ్రాసిరి. పూర్వపు రాజులిటువంటి సమయములందు శిస్తులను మాఫు చేయుచుండిరి. లేదా తగ్గించుచుండిరి. కుంపిణీదారలట్లు చేయకపోవుటయే గాక ఆ నాటికానాటికి పదివంతులు చొప్పున హెచ్చుశిస్తు వసూలుచేసిరి. చాలా సుభిక్షమైయుండిన పూర్ణియా జిల్లాలో మూడవవంతు ప్రజలు ఆకటికిమాడి కఱవులో చనిపోయిరి. దేశములో కఱవువచ్చినను శిస్తులను పూర్తిగా వసూలుచేసినామని కుంపిణీ యుద్యోగులు గొప్ప చెప్పుకొనసాగిరి.

ఈ ఘోరమైన కఱవులో వంగదేశ రైతులు దిక్కులేక బాధలనుభవించుచు కొంపగోడులు, పశువులు అమ్ముకొనిరి. విత్తనములు తినివేసిరి. తమ పిల్లలనే అమ్ముకొనిరి. ఆకు అలములను తిని తిండిలేక దేశములో తిరుగుచు వేలకొలది మరణించిరి. దేశములో మశూచి మొదలైన అంటువ్యాధులు వ్యాపించెను. పట్టణములందుకూడా చాలామంది చచ్చిరి. ఈ దుస్థితిలో ప్రజలను కాపాడవలసిన బాధ్యత తమది కాదనియు పూర్వపు రాజవంశీయులైన జమీందారులదేయనియు కుంపిణీవారు తలచిరి. పాపము జమీందారులు తమ శక్తివంచన లేకుండా

తమ సర్వస్వమును వినియోగించి ప్రజలకన్నము పెట్టిరి. కుంపినీకి చెల్లించవలసిన మొత్తములివ్వ లేకపోయిరి. అంతట కుంపిణీవారు శిస్తులను వసూలు చేయుటకు వినియోగింపబడిన దేశీయోద్యోగులను బర్తరపు చేసిరి. శిస్తులు బాకీపడిన జమీందారులను పట్టుకొని ఖైదులో పెట్టిరి. నదియారాజా రాజ షాహిరాణి బీర్భూమియొక్క మైనరు రాజా, బిష్ణుపూరు యొక్క వృద్ధరాజా మొదలైన వారాంగ్లేయులవలన చెర పెట్టబడిరి. కుంపిణీ యుద్యోగులు క్రూరులై నిరంకుశులుగా నుండుటయే గాక అవినీతిపరులై యుండిరి. వారు షాహుకారులతో కలిసి దేశప్రజల కొఱకు దిగుమతి చేయబడిన ధాన్యమునకు దొంగలెక్కలు వ్రాయించి దానిని అమ్ముకొని లాభము పొందసాగిరి. బయటపడిన అక్రమములకు దేశీయోద్యోగులను నిందించిరి. 1771 వ సంవత్సరములో వర్షములు సరిగానే కురిసెను. పంటలును పండెను. కాని భూమిని దున్నువారు లేక వ్యవసాయము అడుగంటెను. కొన్ని గ్రామములందు జనసంచారమే లేకుండెను. పంటలు పండినను లేకున్నను జనులున్నను లేకున్నను జిల్లాకింత సొమ్ము రావలెనని కుంపిణీ యుద్యోగులు నిర్ణయించి కఠినముగా వసూలుచేయుట ప్రారంభించిరి. రెండు సంవత్సరములలోనే కుంపిణీవారి 'కిస్తీబందీ' మొత్తమును ఒకటిన్నర కోట్ల రూపాయిలను పెంపు చేయగలిగిరి। దీనికెంతో కఠినములగు పద్ధతు లవలంభింపబడినవని గవర్నరగు వారన్ హేస్టింగ్సు వ్రాసియున్నాడు. *

ఇంగ్లీషు వర్తక కుంపిణీవారు మనదేశములో పలుకుబడిని రాజ్యాధికారములను సంపాదించగానే పూర్వము మొగలాయి దొరతనములో విధింపబడు పన్నుల కింకను అనేక విధములైన కొత్త పన్నులను చేర్చి వానిని కఠినముగ వసూలు చేయసాగిరి. పూర్వము గ్రామములలోను పట్టణములలోను కొన్ని వృత్తులు వ్యాపారములు చేసికొనువారిపైన 'మోతర్ఫా' అనునొక విధమైన పన్ను విధింపబడుచుండెను. ఇది తూర్పు ఇండియా వర్తక సంఘమువారి దొరతనములో నొకవిధమైన తలపన్నుగా

* Empire in Asia Torrens (శ్రీ మామిడిపూడి? — see note) 

పరిణమించినది. సాలెవారి మగ్గములపైనను, ప్రత్తిరాటముల పైనను, గొర్రెలకాపరుల పైనను, కమ్మరి, కంచరి పద్రంగి, రాతి చెక్కుడు పని వారు తుదకు రాటముమీద నూలు వడుకు ముసలమ్మలపైనను కూడా ఈ పన్ను విధింపసాగిరి

ఏ వృత్తిగాని వ్యాపారముగాని చేసికొని బ్రదుకవలెనన్నను, ఏవస్తువు నైనను అమ్ముకొని జీవింపవలెనన్నను ప్రతి స్త్రీ పురుషుడు ఈ పన్ను చెల్లించి తీరవలెను. దుకాణదారులపైన ప్రత్యేకముగా పన్ను విధించుటయేగాక వీధులప్రక్క చాపలనో, గుడ్డలనో పరచుకొని జీవించు బీద వర్తకులపైనను వీధులలో మూటలు వేసికొనిగాని గంప నెత్తిన పెట్టుకొనిగాని అమ్ముకొను చిల్లర బేరగాళ్ళపైనను కూడా ఈ పన్ను విధించుచుండిరి. చిన్నచిన్న వృత్తులు చేసికొని బ్రతుకువారిపైనను వారు తయారుచేయు వస్తువుల పైనను వారుపయోగించు పనిముట్ల పైనను కూడా ఈపన్ను విధించుచుండిరి ఆ పనిముట్ల విలువకెన్నోరెట్లు సొమ్మును చెల్లించినగాని బీదవారా వృత్తిని చేసుకొన వీలులేకుండెను,

ఈ పన్నును వసూలు చేయుట కుద్యోగుల కివ్వబడిన అధికారము లనుబట్టి వారు తమ చిత్తానుసారముగా నిరంకుశముగా ప్రవర్తించి ప్రజలను బాధించుచుండిరి. నేరములను ఆచోకీ తీయుటకొఱకు పోలీసువారు చేయు జాలమును చేయుచుండిరి. అకస్మికముగా వచ్చి దర్యాప్తు చేసి ఇంటిలో చొరబడి సోదాచేసి పన్ను లివ్వలేనివారికి సంకెళ్ళు వేసి బొండలోపెట్టి చిత్రహింసలు పెట్టి బాధించుచుండిరి. దీనికి భయపడి ప్రజలు వారికి లంచములిచ్చి తృప్తిపరుప సాగిరి. *

ఈ పన్నుకు ఒక నిలకడగాని నిరుకుగాని లేదు. తమ యిష్టము వచ్చినప్పుడెల్ల అధికారులు వీనిని హెచ్చుచేయుచుండిరి. దీనిభారము ధనవంతులపైన కన్న బీదవారిపైన హెచ్చుగా పడుచుండెను. ఈపన్ను చెల్లించుటకును పట్టాలను పొందుటకును బీదవారు చాలాదూరములో నింకొక గ్రామములో కో[illegible]ది కచ్చేరీలకు పోవలసినందున తమ పనులు నష్టపడి తాము చెల్లించు మొత్తపు కన్న హెచ్చుసొమ్మునే నష్టపడుచుండిరి.

* Condition and requirements of Madras John Bruce Narton 1854 Pp 164–5

భూమిని దున్నుకొని బ్రతుకు రైతులుగాక ఇంక నేవృత్తినిగాని ఏ వ్యాపారము చేసుకొన్నను ఈ పన్ను చెల్లించి తీరవలెను. ఒక ముస లమ్మ కూరగాయలు పట్టుకొని ఒక వీధిమూలకు వెళ్ళినగూడా ఈపన్ను లిచ్చుకోవలసినదే. ఒక చిన్న బట్టలమూట వేసుకొని తిరిగే చిల్లరవర్తకు డుకూడ దీనిని చెల్లింపవలెను. అయితే ఈ దేశములో వ్యాపారముగాని ఏ వృత్తినిగాని చేసికొను పాశ్చాత్యులెవ్వరును ఈపన్ను చెల్లింపనక్కర లేదు అని ఈపన్నులను వసూలుచేయు అధికారిగా పనిచేసిన ఒకఆంగ్లేయ దొరగారే చెప్పినారు * ఈ పన్ను ప్రత్యక్షముగా రైతులను బాధించు నట్లు కనబడకపోయినను వృత్తులు చేసుకొను పారిశ్రామికులను, వర్తకు లను బాధించు పన్ను అయినను రైతుల పంటలకు సరియైన రేటు రాకుండాచేయును గనుక అదిరైతులకును నష్టకరముగనే యుండెను. ఈ పన్నులో చాలా భాగము చేనేతమగ్గములపైన పడగా నేతగాండ్ర నష్టపడిరి. ఆ పరిశ్రమతగ్గగా రైతులు పండించు ప్రత్తిధర తగ్గెను. ఈ పన్నువలన దేశీయుల స్థితి దుర్భరమైనది.

## మోతర్ఫా పన్నుల నిరకునామా

గంజాము జిల్లా చికాకోలు పరగణాతోను దాని క్రిందనున్న గ్రామములలోను 1787 నాటికి వివిధ వృత్తులపైనను మగ్గములపైనను విధింపబడు మోతర్ఫాపన్నులు ఈ క్రింద వివరించినట్లుండెను.-

| | |
|---|---|
| 1 చేపలు పట్టువారిపైన నెల 1కి రు 1-8-0 చొప్పున | 237-0-0 |
| 2. గాజులు తయారు చేయువానిపైన నెల 1కి రు 14-0-0 చొ॥ | 140-0-0 |
| 3. కమసాలులపైన ఇంటికొకటింటికి రు 1-0-0 నుండి రు 6-0-0 వరకు | 54-00 |
| 4. కుమ్మరులపైన ఇంటికి నెల 1కి రు 1-0-0 చొ॥ | 116-0-0 |

* Commons First Report 1853. Appendix 7.
Inida in the Victorian age R C Dutt Pp 164-5

| | |
|---|---|
| 5. నూనెగానుగుల తెలికలవారి పైన 0-8-0 నుండి రు. 5-0-0 వరకు | 403-0-0 |
| 6. పాలు అమ్ముకొను గొల్లలపైన 0-8-0 నుండి రు 3-0-0 వరకు | 102-0-0 |
| 7. బాకళ్ళపైన 0-8-0 నుండి రు 30-0-0 ల వరకు | 73-0-0 |
| 8. వడిలివారు లేక కూరలమ్ముకొను వారి పైన రు 1-8-0 నుండి రు 3-0-0 ల వరకు | 34-0-0 |
| 9. సెగ్గి-ఇంటి 1కి రు 1-0-0 చొ॥న | 240-0-0 |
| 10. చెప్పులు కుట్టు మాదిగలపైన రు 0-4-0 చొ॥న | 27-0-0 |
| 11. పడవలలో బియ్యము అమ్ముకొను వారిపైన ఒక్కొక్కరికి రు 2-0-0 చొ॥న | 25-0-0 |
| 12. జాలరుల పైన 0-4-0 చొ॥న | 11-0-0 |
| 13. గొడ్లకాపరులపైన రు 3-0-0 చొ॥న | 10-0-0 |
| 14 రంగిరీజావారు లేక రంగులు వేయు వారిపైన రు 1-8-0 చొ॥న | 10-0-0 |
| 15 జలగదుగుల వారిపైన రు 1-0-0 చొ॥న | 5-0-0 |
| 16. మేదరులపైన రు 1-0-0 చొ॥న | 3-0-0 |
| 17. చికాకోలు దగ్గరనున్న *వారు గ్రామముల పైన | 53-0-0 |
| 18 మగ్గములపైన రు 0-8-0 చొ॥న | 449-8-0 |
| మొత్తము రు. | 1633-0-0 |

వంగరాష్ట్రమునందు కూడా ఈ పన్నులిట్లే విధింపబడుచుండెను. పన్నాసుల దండయాత్రల కిదియొక ముఖ్యకారణముగా నుండెను. వంగ రాష్ట్రమునందు ఈ పన్నులను ఇంగ్లీషువారు 1793 లో రద్దుచేసిరి కాని మద్రాసులో మాత్రము 1853 వఱకు వసూలు చేయుచుండిరి

* The Ganjam District Manual T. J. Maltby 1882, Pp. 214-215

భారతదేశమునుండి తమకు రావలసిన లాభములు సరిగా రాక పోగా అక్కడి కుంపిణీ ప్రభుత్వము అధ్వాన్నముగా నున్నందువలన డైరెక్టరులు తెరవెనుక భాగవతము నాడుట చాలించి కుంపిణీవారు దివానుగిరీ బాధ్యతలను అధికారములను స్వయముగా వహించి అన్ని వ్యవహారములను తమ యుద్యోగులద్వారా జరిగించవలెనని 1771 లో నిర్ణయించిరి. ఆ ప్రకారము 1772 ఏప్రిలులో వారన్ హేస్టింగ్సు వంగదేశ గవర్నరు పదవిని స్వీకరించెను. నాయబు దివాను పదవులను తీసివేసిరి. దేశములోని శిస్తుల నిర్ణయము వసూలు వ్యవహారములను గూర్చి విచారించుటకు ఒక సర్క్యూటు కమిటీని నియమించిరి. ప్రతి జిల్లాలో నున్న సూపర్వైజరులనే కలెక్టరులుగా చేసి వారి యధికారము క్రింద సివిలు దావాలను విచారించుటకు దివానీ అదాలత్తు లను న్యాయస్థానములను స్థాపించిరి. వ్యక్తులకును, వారి ఆస్తికిని సంబంధించిన తగవులును, వారసత్వము, వివాహములు, వర్ణాశ్రమ ధర్మము, కంట్రాక్టులు, శిస్తులబాకీలు, ఇతర బాకీలును, లెక్కలను గూర్చిన తగవులును మొదలైన విషయములను పరిష్కరించుటకే న్యాయస్తానముల కధికార మొసగబడెను. మహమ్మదీయుల ధర్మశాస్త్రమునకు హిందువుల ధర్మశాస్త్రమునకు సంబంధించిన తగవులలో మౌల్వీల యొక్కయు పండితుల యొక్కయు అభిప్రాయములు గైకొనునట్లు నిర్ణయించిరి. జమిందారులకు తాలూకా దారులకు సంబంధించిన వారసత్వపు వివాదములను దాని ఆస్తికి సంబంధించిన తగవులను మాత్రము సభాయుతుడైన గవర్నరే పరిష్కరించునట్లు నిర్ణయించిరి. సివిలు కోర్టులపైన ఒక అప్పీలు కోర్టును సదర్ దివానీ అదాలత్తు అను పేరుతో స్థాపించిరి. నేరముల విచారణలో ప్రతి జిల్లాలోను ఫౌజుదారీ కోర్టు లనబడు న్యాయస్థానములను నియమించి వానిపైన జిల్లా కలెక్టరులకు పై తనిఖీచేయు అధికారమిచ్చి సాక్షి సాధనములను విచారించుట, న్యాయముగా తీర్పుల నిచ్చుట సరిగా జరుగునట్లు కనిపెట్టి చూడవలెననిరి. ఈ న్యాయస్థానముల తీర్పులపైన సదర్ నిజామత్ అదాలత్తు అను కోర్టుకు అప్పీలు అధికారము లొసగబడెను.

వారన్ హేస్టింగ్సు చేసిన సంస్కరణముల వలన కుంపిణీ వారు నియమించిన ఆంగ్లేయ న్యాయాధిపతులును కలెక్టరులును జిల్లాలలో సర్వాధికారులైరి వీరికి దేశభాషలు రావు అందువలన వారు దేశీయో ద్యోగుల పైనను దుబాసీల పైనను ఆధారపడి యుండిరి. ఆ కాలమునాటి దొర లందరివలెనే వీరును లంచగొండులై అవినీతిపరులై ప్రజాపీడకులై యుండిరి. న్యాయస్థానములందు సామాన్యులకు న్యాయము లభించ కుండెను. ధనవంతులును బలవంతులును బీదలను పీడింపగలుగుచుండిరి.

వారన్ హేస్టింగ్సు స్థాపించిన విధానము మొత్తము పైన పదు నెనిమిదేండ్లు అమలు జరిగెను. అతడు చేసిన మార్పులవలన వంగ దేశమునందు కుంపిణీవారు నిరంకుశులై, ప్రజలకు లాభము కలుగక పోగా వారిబాధలు మరింత హెచ్చెను.

దేశపరిస్థితులను విచారించి శిస్తుల నిర్ణయమును చేయుటకు 1772 లో నియమింపబడిన సర్క్యూటు కమిటీవారు చేసిన విచారణవలన వంగదేశములోని దుఃస్థితియు అక్కడ జరుగుచున్న అన్యాయములును ప్రజల బాధలును వెల్లడి యయ్యెను. దేశములో శాంతి భద్రతలు లేవు. బందిపోట్లు విచ్చలవిడిగా జరుగుచుండెను ఆయుధ పాణులు ఎల్లెడల తిరుగుచు దౌర్జన్యములు చేయుచుండిరి. వివిధ పరగణాలలో ఫౌజుదారుల క్రింద మొగలాయి ప్రభుత్వ కాలమునుండి యున్న సిపాయిల దళములు దేశములో శాంతి భద్రతలను కాపాడజాలకుండెను. జమీందారులు ప్రజల ధనమునకు,మానములకు, ప్రాణములకు రక్షణ నొసగజాల కుండిరి. ప్రజ లకు న్యాయము దొరకకుండెను నవాబుగారి యుద్యోగులపైన పెత్తనము వహించిన ఇంగ్లీషు దొరలు లంచగొండులై అవినీతిపరులై స్వార్థ పరులై యుండిరి. ప్రజలపట్ల జరుగు అన్యాయములను విచారించువారే లేరు, ఇంగ్లీషు దొరలు దేశములోని ధనకనక వస్తువాహనములను చేఁజిక్కించుకొని సీమకు తరలించుచుండిరి. దేశమునుండి ధనమిట్లు ప్రవా హముగా పోవుచున్నందువలన డబ్బు కరవై ధరలు పెరిగెను. చెలామ ణిలోనున్న నాణెములలో చాలా భాగము దొంగనాణెములుగ నుండెను, వానిని చాలా హెచ్చువట్టములకు తీసికొనుచున్నందున రైతులకు చాలా

నష్టము కలుగుచుండెను. దేశముయొక్క ఆర్థిక వ్యవస్థ పాడై దుఃస్థిః కలిగెను. పరిశ్రమలు వ్యాపారము నాశనమయ్యెను దేశములో బీః వంతులు బీదల్ని బాధించుచుండిరి. వివిధ పరగణాలలో ఫౌజాదారుః క్రిందనుండిన సిపాయిదళములను తీసివేసి వారన్ హేస్టింగ్సు కుంపిః సిపాయిదళముల్ని నియమించెను ఆయా ప్రాంతములందలి జమీంద రులకు శాంతి భద్రతలను స్థాపించుటకు సహాయము చేయవలెనని శాసించెను వంగదేశమునందు కుంపిణీ వ్రపాలనము కట్టుదిట్టముగా జరుగుటకు వలసిన యేర్పాటులను గావించెను. అతడు చేసిన మార్పుః వలన కంపెనీవారి ఆదాయము వృద్ధిచెందుటకును వారిఖజానాలు భద్ర ముగా నుండుటకును అవకాశము కలిగెను. అదివఱకు ప్రజలను పీడించు రివిన్యూ పోలీసుశాఖలవారి యధికారములు మరింత హెచ్చెను. అందువలన వారు మరింత నిరంకుశులై ప్రజలను బాధింపసాగిరి.

భారత దేశమునందు ఇంగ్లీషువర్తక కుంపిణీవారు గొప్ప వ్యాపా రము చేయుచుండుటయేగాక రాజ్యాధిపత్యము కూడా వహించుట చూచి ఇంగ్లాండుదేశపు పార్లమెంటువారు భారతదేశమువలన కుంపిణీవారికి వచ్చు రాజ్యాదాయమునందు కొంతభాగము ఇంగ్లాండు ప్రభుత్వమునకు కూడా చెందవలెనని నిశ్చయించిరి అంతేగాక కుంపిణీవారి రాజ్య పరి పాలనమును క్రమబద్ధముచేసి దాని పైన ఇంగ్లీషు పార్లమెంటు వారికి కొంత అధికార ముద్రవలెననియు తలచిరి. అందుకొరకు తగిన కట్టుబాటులను చేయుచు 1773 లో రెగ్యులేటింగు ఆక్టు అని ప్రసిద్ధి చెందిన శాసనమును గావించిరి. దానినిబట్టి కంపెనీ డైరెక్ట రులను పార్లమెంటు సభ్యులనుగల బోర్డు ఆఫ్ కంట్రోల్ అనబడు నొక అధికార సంఘమును నియమించిరి భారతదేశమున కుంపిణీవారి రాజకీయ వ్యవహారములపైన నీ సంఘమువారిని సర్వాధికారము లొసగ బడెను. భారతదేశములో కుంపిణీవారి యధీనమునగల రాజ్యభాగముల నెల్ల కలిపి పరిపాలించుటకు ఒక కార్యాలోచన సభలో గవర్నరు జన రల్‌ను నియమించిరి. 1774లో వారన్ హేస్టింగ్సును మొదటి గవర్నరు జనరలుగా చేసిరి. అయితే త్వరలోనే ఆయన కార్యాలోచన సభలో అని

ప్రాయ భేదములు కలిగెను. అందువలన ప్రతి విషయమునుగూర్చియు దీర్ఘమైన చర్చలు జరుగుచు పక్షులు తగవులాడుకొనుచున్నందున వ్యవహారములు ఆలస్యముగ జరుగుచు అర్ధదిద్దపు నిర్ణయములు జరుగుచు దేశప్రభుత్వము చక్కగా జరుగకుండెను. ఈ పక్షులను గవర్నరు జనరలును ఒకరిపై నొకరు నిందలు మోపుకొని ఇంగ్లాండులోని బోర్డు వారికి వ్రాసికొనసాగిరి. ప్రభుత్వోద్యోగులకు భయభక్తులు నశించెను. స్వార్థపరులు బలవంతులై అన్యాయములు చేయసాగిరి. దేశీయులలో కొందఱు గవర్నరు జనరలుపైన నిందలుమోపి కార్యాలోచన సభకు ఫిర్యాదులు చేయుట ప్రారంభమయ్యెను. రెగ్యులేటింగు చట్టము ప్రకారము కలకత్తాలో సుప్రీముకోర్టు అనబడు పరమోన్నత న్యాయస్థానము స్థాపింపబడెను. అందలి ప్రధాన న్యాయమూర్తి సర్ ఎలిజాఇంపే వారన్ హేస్టింగ్సుకు స్నేహితుడుగ నుండెను. ఆయన సహాయముతో వారన్ హేస్టింగ్సు కొన్ని రాచకార్యములను చక్కబెట్ట గలిగెను. త్వరలోనే కార్యాలోచన సభకును సుప్రీము కోర్టుకును తగవులు కలిగెను. సుప్రీము కోర్టులో ఇంగ్లీషు న్యాయశాస్త్ర విధులే అమలు జరుపబడుచుండెను. అవి మన దేశీయులకు అలవాటులేని క్రొత్త పద్ధతికి చెందినవై యుండెను. కొన్ని మన ఆచారములకు విరుద్ధములై మనస్సులకు బాధ కలిగించునట్టివిగా నుండెను. సామాన్యు డెవ్వడైనను కోర్టులో నొక ప్రమాణ పత్రమును దాఖలు చేసినచో మర్యాదగల జమీందారుల నైనను పట్టితెచ్చి విచారణ జరుగువరకు ఖైదులో నుంచు చుండిరి. వారివలన జామీను పత్రములను వ్రాయించి పుచ్చుకొనుచుండిరి. ఇది మనవారికి అవమానకరముగా నుండెను దేశములో నేవ్యవహారమువంద్దైనను కలుగచేసికొనుచు వ్యక్తులపైననేగాక ఉద్యోగులపైన న్యాయాధిపతులపైన కూడా సుప్రీము కోర్టు వారు వారంటులు జారీ చేయుచుండిరి. దేశ మల్లకల్లోల మయ్యెను. ఈ సుప్రీము కోర్టులో నభియోగములు తెచ్చి చాలమంది తమ విరోధులపైన పగ సాధింపగలిగిరి. గవర్నరు జనరలుపైన ఫిర్యాదులు చేసినవారిలో ప్రముఖుడైన రాజా నందకుమారునిపైన కూటసృష్టి నేరమును మోపగా సుప్రీముకోర్టు వారాయన కురిశిక్ష విధించిరి. ఇట్టి శిక్షలు ఆ నేరమున కీ

దేశమున నెన్నడు విధింపబడలేదని ఎంత మొఱపెట్టినను వినక నందకుమారుని 1775 లో ఉరితీసిరి. ఇది ప్రజలలో భయోత్పాతమును కలిగించెను. ఈ కుంపిణీవారి గవర్నరు జనరలుపైన ఈయన యుద్యోగులపైన ఫిర్యాదులు చేసినవారందరికి నీగతియే పట్టునని ప్రజలు భయపడి దొరలెన్ని అన్యాయములు చేసినను ఫిర్యాదులు చేయుట మానిరి.

ఇట్లు 1757 మొదలు 1774 వఱకును ఆంగ్లేయాధికారము వంగదేశమునందు దినదినాభివృద్ధిని చెందుచుండగా దేశములో శాంతి భద్రతలు లేక అరాజకము అధర్మము ప్రబలి ప్రజల ధనమునకు మానమునకు ప్రాణములకు రక్షణలేక ఆలన పాలనలు లేక బాధలనుభవించుచుండిరి. దేశమున పాడిపంటలు నశించి కఱవులో వేలకొలది మరణించిరి. రైతులకు పారిశ్రామికులకు తినుటకు తిండి, కట్టబట్టలేక గ్రామములు వదలి కొందఱు భిక్షాటకులైరి. కొందఱు బందిపోటు దొంగలైరి. జమీందారులు నాశనమైరి. పూర్వము నవాబులకొలువులో నుండిన సైనికులు నిరుద్యోగులైరి. బీదజనులకు వృత్తులు వ్యాపారములు లేకుండ పోయెను. పూర్వపు నవాబుల కాలమునాటి ప్రభుత్వములందు మనదేశములోని వివిధ తరగతుల ప్రజలకుండిన సౌకర్యములు ఆంగ్లేయ పరిపాలనమున లేకుండపోయెను. ప్రజల మొఱలను దొరలు వినిపించుకొనరైరి. వారు దేశీయులకు దర్శనమే యొసగరైరి. దేశీయులను చూచిననే వారికి అసహ్యముగానుండెను. దేశపరిస్థితులు దుర్భరములయ్యెను. ఆ కాలమున అయోధ్య నవాబుగారి దర్బారులో నొక గొప్ప యుద్యోగిగా నుండి ఆంగ్లేయుల యనుగ్రహమునకు పాత్రుడైన గులాం హుస్సేన్‌ఖాన్ పారశీభాషలో వ్రాసిన 'సియర్‌ముతాఖరిన్' అను గ్రంథమునందు ఇంగ్లీషు వారి పరిపాలనలోని లోపములును, అందువలన ప్రజలకు కలుగుచున్న బాధలును కన్నులకు కట్టినట్లు వర్ణించినాడు. అంతట మతధర్మములలోనే గాక దేశముయొక్క సాంఘిక ఆర్థిక విషయములందు కూడా వంగదేశ ప్రజలతో సన్నిహిత సంబంధము కలిగి పైనజెప్పిన బాధ లనుభవించిన గోసాయీలును వివిధ సంప్రదాయములకు చెందిన సన్యాసులును ఏకమై ఈ అన్యాయములన్నిటికిని కారకులుగా నున్న పరంగిజాతివారైన ఆంగ్లే

యులను పారదోలి ధర్మసంస్థాపనము చేయబూని వారి యధికారమును ధిక్కరించి యుద్ధముచేయుట ప్రారంభించిరి.

ఇంగ్లీషు కుంపిణీవారి ఫ్యాక్టరీలపైనను, వారి ఖజానాలపైనను గ్రామములపైనను వారి యధికారము క్రింద నున్న ప్రాంతములపైనను సన్యాసులు చేసిన దండయాత్రలను గూర్చిన కొన్ని లిఖితాధారములు లభించినవి. ఢాకానగరములోని ఇంగ్లీషు ఫ్యాక్టరీపైన నీ సన్యాసులమూక యొకటి 1763 లో దండయాత్ర చేయగా అక్కడి "చీఫ్ అను ముఖ్యాధికారి "లెయిస్టర్" దొరగారు ఆ ఫ్యాక్టరీలోని సరుకులను అక్కడనున్న ఖజానాను వదలిపెట్టి పారిపోయి తన ప్రాణములను దక్కించుకొనెను. సన్యాసులు దానినెల్ల దోచుకొనిపోయిరి. అయితే కుంపిణీవారు సిపాయిల సహాయముతో ఆ ఫ్యాక్టరీని మరల నా సంవత్సరమే వశపరచుకొనిరి. అక్కడవారికి చిక్కిన కొందఱు సన్యాసులను కొందఱు ఆతతాయిలను పట్టుకొని సంకెళ్ళువేసి వారిచేతనే ఆ ఫ్యాక్టరీని మరమ్మతు చేయించిరని వారి రికార్డులలో వ్రాసిరి. అయితే పోయిన ఆస్తిమాత్రము మరల దొరకలేదు.

1767 ఏప్రిల్ నెలలో నైదువేలమంది సన్యాసులు సారన్ లేక ఛప్రాజిల్లాలో ప్రవేశించిరి అప్పుడు ఆ పరగణాయొక్క ఫౌజుదారు ఒక ఇంగ్లీషు సార్జెంటుక్రింద రెండుకంపెనీల సిపాయిల దళములను వారిపైకి పంపించెను కాని లాభము లేకపోయెను. సన్యాసులీ సైన్యము నోడించి వారిలో కొందఱిని వధించిరి. సిపాయిలకు మందుగుండు సామగ్రి చాలలేదు చచ్చిపోవగా మిగిలిన సిపాయిలు పారిపోయిరి. అప్పుడా ప్రాంతములందలి జనులు సన్యాసులకు భయపడి లొంగిపోయిరి. కుంపిణీవారి రివిన్యూశిస్తుల వసూలు నిలిచిపోయెను. అంతట పట్నా నగరములోని ఇంగ్లీషు 'చీఫ్' లేక ముఖ్యాధికారి ఆ సమయమున తాను ప్రోగుచేయగలిగినంత మంది సిపాయిలను చేర్చి కెప్టెన్‌వైల్డింగు కిచ్చి

* The Sannyasi Rebellion Bengal; based upon unpublished records. Brajendranath Banerji; Modern Review, 1926, September, October.

పంపెను. అప్పుడు వారు సన్యాసులను ప్రతిఘటింపగలిగిరి. అటు పిమ్మట ఈ సన్యాసులు ప్రతియేటను కుంపిణీవారి క్రిందనున్న దేశము పైన దండయాత్రలు చేయసాగినట్లు తెలియగల వివరములు కుంపిణీ వారి రికార్డులలో నున్నవి.

1769 లో సన్యాసుల మూకలు వంగదేశపు టుత్తరపుజిల్లాలపైన దండయాత్ర చేసెను. ఆ సంవత్సరములోనే దేశీయోద్యోగుల పైన కుంపిణీవారి దొరలను సూపర్‌వైజరు లను హోదాతో పై యధికారులుగా నియమించియుండిరి. వీరు జిల్లాలలోని రివిన్యూశిస్తుల వసూలుపైన తనిఖీలుచేయు అధికార్యులుగా నుండిరి. వీరేతరవాత కలెక్టరులైరి. అట్టి వారిలో రంగపూరులోని సూపర్వైజరు 1770 ఏప్రిలు 20 వ తేదీన నవాబుగారి దర్బారులోనున్న ఇంగ్లీషు రెసిడెంటుకు వ్రాయుచు "ఈ సన్యాసులు క్రిందటి సంవత్సరము చాలా దౌర్జన్యములు చేసి చాలా సొమ్ము లాగి కొని పోయినారనియు అందువలన వారు మరల నీయేడుకూడా రాగల రని ప్రజలను కొనుచున్నారనియు వ్రాసెను. అతడు చెప్పినమాటలు నిజమే యయ్యెను. ఆ నెలలోనే రెండు పెద్ద సన్యాసుల గుంపులు బయలుదేరి దినాజ్‌పూరుకు వచ్చెను. అందులో నొకగుంపు చెదిరి పోయెను. రెండవది పూర్ణియామార్గమును బట్టిపోయెను.

1771 ప్రారంభములో ఢాకా నగరములోని ఇంగ్లీషు సూపరు వైజరు మూర్షిదాబాదులోని ఇంగ్లీషు కవున్సిలువారికి వ్రాయుచు ఈ సన్యాసులు ఢాకాలోని ఉత్తర భాగమును, రాజషాహి పరిహద్దు ప్రాంతమును ఆక్రమించినారని చెప్పి రెండుమూడు కంపెనీల సిపాయిల దళమును వెంటనే పంపవలసినదని కోరెను. "ఈ రాష్ట్రము ఉత్తర భాగములోను దీనిదగ్గర రాజషాహి పరిహద్దులలోను సన్యాసులు చాలామంది నివసించుచున్నారు. వీరు ప్రతి సంవత్సరము వర్షములు నిలిచిపోయిన పిమ్మట తీర్థ స్థలములలో జరుగు ఉత్సవములకు పోవుచుందురు. మత సంబంధమైన యాత్రలకని పోవుచున్నను వీరు ఆయుధపాణులై పెద్దపెద్ద గుంపులుగా బయలుదేరుచుందురు. క్రిందటి సంవత్సరము వీరు వివిధ జిల్లాలలోని ప్రజలవలన చాలా సొమ్ము వసూలు చేసికొనిపోయిరి. ఇందులో

వారినెవ్వరు నాటంక పరుపలేదు. అందువలన వారు తప్పకుండా మరల వచ్చి తీసుదురు. వీరు పదునైదు వందలమంది ప్రోగై జఫర్‌షాహిలో మూడువేల రూపాయలను బలవంతముగా వసూలు పరచుకొనిరనియు, అలాపసింగు జమీందారులను ఐదువేల రూపాయ లివ్వవలసినదని బెదిరించినారనియు తెలియవచ్చినది" అని అతడు వ్రాసెను.

## 4

1770 సంవత్సరములో తటస్థించిన ఘోరమైన క్షామమునందు దేశములోని ప్రజలతోపాటు సన్యాసులుకూడా చాలాబాధ లనుభవించిరి. ఈదేశ దుఃస్థితికెల్ల ఈ యింగ్లీషువారే కారకులని సన్యాసులు వీరిని నిందింపసాగిరి. వారికి పాశ్చాత్యులపైన ద్వేషభావము కలిగెను. 1770 నాటి క్షామమునందు ఇండ్లు వాకిండ్లు గొడ్లును గోదలను కోల్పోయి జీవనములు లేక తిరుగువారును అతతాయి జనమును ఈ సన్యాసులలో చేరిరి. అంతట పదివేలమంది సన్యాసులు కలిసి వంగదేశముపైన దండయాత్ర చేయుటకు కృతనిశ్చయులై 1770 నవంబరు నెలలో కాశీనగరమునందు సమావేశమైరి అయితే ఇంగ్లీషు సైన్యముల సర్వసేనానియగు సర్ రాబర్టు బార్కర్‌గారికి ఈ విషయము తెలియగా బీహారు పరగణాలోనుండి ఈ సన్యాసులు రాకుండా వారిని అరికట్టుటకు అవసరమైన యేర్పాటుల నాయన చేసెను. అప్పుడు వంగదేశమునకు గవర్నరుగా నుండిన కార్టియరు, "ఆయుధ పాణులైన ఇంతమంది జనము నిజముగా తీర్థయాత్ర కొఱకుగాని వంగదేశపు సరుకులను కొనుటకుగాని బయలుదేరి వచ్చుచున్నారనుటకు వీలులేదనియు దీనివలన వంగదేశ ప్రజలకు బాధ కలిగి తీరుననియు పలికెను. అయితే ఈ సన్యాసుల నింక అపుట యెవ్వరికిని సాధ్యము కాలేదు. వారు మూడునాలుగు వేలమంది చొప్పున గుంపులు గుంపులుగా బయలుద్దేరి ఆకస్మికముగా పూర్ణియా జిల్లాపైన పడిరి. వారీ జిల్లాలోని వివిధ గ్రామములందు ప్రవేశించి దోపిడ్లుచేసి అక్కడ ప్రజల

నుండి చాలాసొమ్ము బలవంతముగా వసూలు చేసిరి. * అయితే వారు చాలాకాల మొక్కచోట నిలకడగా నుండరు. వీరిపైకి పంపబడిన ఇంగ్లీషు కెప్తాను సింక్లేరు వారయును రెండు కంపెనీల సిపాయిలును వారిని కలిసికొనలేకపోయిరి. పూర్ణియా కలెక్టరుకు వచ్చిన వార్తలనుబట్టి సన్యాసులు దినాజ్‌పూరు, రంగపూరు మార్గముద్వారా బ్రహ్మపుత్రానదికి పోయి అక్కడ తీర్థ స్నానమును చేయుదురని తెలిపెను. ఇది నిజమే యయ్యెను వారిలో నొక గుంపువారు దినాజ్‌పూరు ప్రవేశించి రంగపూరు జిల్లాలోని భవానీగంజిలోనున్న ఇంగ్లీషు కచ్చేరిని దోచుకొనిరి

1771 లో గోవిందగంజ్‌కి ఎనిమిది క్రోసుల దూరమున నున్న 'ముస్తాన్ గడ్' అనునొక కొండపైన నేదోయొక తిరునాళ్ల జరుగుచున్నదని చెప్పి సన్యాసు లక్కడకువచ్చి తిష్ఠ వేసిరి. రంగపూరు కలెక్టరు "పర్లింగు" కొంతమంది సిపాయిలను కెప్తానుథామస్ కిచ్చి పంపి అక్కడ ప్రజలను సన్యాసు లావంతయైన బాధించినట్లు తెలిసినచో వారిని శత్రువులుగా పరిగణించి చర్య తీసికొందుమని చెప్పి వారి నాయకులను గట్టిగా బెదిరించుటతో అప్పటి కెట్టి దౌర్జన్యములును జరుగకుండా ఆగిపోయెను. అయితే 1772 డిశంబరు నెలాఖరున మఱల మూడు పెద్దవియైన సన్యాసుల గుంపులు భవానీ గంజికి వచ్చి ఆపరిసర ప్రదేశములందు దోపిడి చేయుచున్నట్లు తెలియవచ్చెను. అంతట వారిపైకి సిపాయిలను పంపవలసినదని యుత్తరువులు వచ్చెను.

29-12-1772 తేదీ యుదయమున కెప్తానుథామసు కొంతమంది సిపాయిలతో రంగపూరునుండి బయలుదేరి జఫర్‌గంజికి వెళ్ళెను. అక్కడ సన్యాసుల నెదుర్కొనగా కొన్ని గంటలు యుద్ధము జరిగెను. సన్యాసులు అడవిలోనికి పారిపోయినట్లు పోయిరి. థామస్‌గారి సిపాయిలు వారిని తరిమికొని వెళ్ళి తుపాకులు పేల్చుచు తమ మందుగుండ సామాను వ్యర్థపరచుకొనిరి. వీరితోటాలు అయిపోయినవని సన్యాసులు గ్రహించి వీరిని చుట్టి ముట్టడించిరి. సన్యాసులను తుపాకీ సన్నీలతో పొడవవలసినదని థామసు తన సిపాయిలను హెచ్చరించినను వారట్లు

* Commitee of Circuit Proceedings 2.1· 1773

చేయరైరి. ఈ యుద్ధము సరూప్‌పూరు పరగణాలో సమజ్‌పూరులోని మైదానము పైన జరిగెను. సిపాయిలు సన్యాసుల ధాటికి నిలువలేక చెల్లాచెదరైరి. కొందరు అడవిలో దాగికొనిరి. కొందరు చుట్టుపట్ల గ్రామములలోనికి పారిపోయిరి. గ్రామరైతులు ఇంగ్లీషు కెప్టెను సైన్యమునకు సహాయము చేయకపోవుటయేగాక ఎత్తైన గడ్డిలోను చెట్లవెనుకను దాగికొనిన సిపాయిలను సన్యాసులకు చూపించి వధించుటకు తోడ్పడిరి. గ్రామములలోనికి సిపాయిలు పరుగెత్తికొని వచ్చినప్పుడు గ్రామస్థులు గోలచేసి సన్యాసుల నాకర్షించి సిపాయిలను వధించుటకు తోడ్పడిరి. ఇంతేకాదు, వీరు సిపాయిల తుపాకులను లాగికొని హరించిరి. "రాజషాహి జిల్లాలోని సరుప్‌పూరు పరగణాలో వెదకినచో సిపాయిల తుపాకులు గ్రామస్థుల దగ్గర దొరకగలవు" అని రంగపూరు కలెక్టరు వారన్‌హేస్టింగ్సుకు ఆ దినమునను ఆ మరునాడును వ్రాసిన లేఖలలో వివరించెను. ఈ వార్త తెలియగానే కలెక్టరు తన హర్కారాలను నలు ప్రక్కలకును పంపెను. అతడొక సన్యాసిని పట్టి తెప్పించగలిగెను.

రంగపూరు కలెక్టరైన పర్లింగు, పై సంగతులను తన లేఖలో వ్రాసి సన్యాసులను పట్టుకొనుటకు రైతు లెట్టి ఆచోకీయు నొసగి సహాయము చేయుటలేదనియు, అక్కడక్కడ రెండువందలమంది సన్యాసులింకను ఉన్నట్లు తనకు తెలిసినను వారు సులభముగా తప్పించుకొని పోయిరనియు వ్రాసెను.

"ఈ సన్యాసులు కెప్టెన్ థామసును వధించినందులకు వారిపైన మనము పగ దీర్చుకొనవలెను. వారి స్థావరములను నాశనము చేయవలెను. వారు మరల ఈ దేశములోనికి రాకుండా చేయవలెను. లేనిచో నిక్కడ రివెన్యూ శిస్తుల వసూలు అగుట దుస్తరము. వారికిప్పుడు హద్దు పద్దులు లేవు. కెప్టెన్ థామస్‌యొక్క ధన మెక్కడ మున్నదని సన్యాసు

---

* Extracts from Letters of Mr. Purling to Warren Hastings. 29-12-1772: 31-12-1772; Public Proceedings 11-1-1773. Pp. 20-23

లతని నౌకరును దండించి యడిగి వానిచేతిని నరికి బాధించిరి." అని అతడు వ్రాసెను.

అప్పటినుండి సన్యాసులు ధైర్యముతో విజృంభించిరి. వారి దండయాత్రలు మఱింత తీవ్రముగాను తరుచుగాను జరుగుచు ప్రజలకు బాధ కలిగింపసాగెను.

శిస్తులను నిర్ణయించుటకు నియమింపబడిన పర్యాటకమిటీవారు కలకత్తాలోని విలియంకోటలోని రివిన్యూ కౌన్సిలువారికి దినాజ్‌పూరునుండి 2-1-1773 తేదీన వ్రాయుచు ఈ సన్యాసులు చేసిన దోపిళ్ళవల్లను వారు ప్రజలనుండిబలవంతముగా సొమ్ము వసూలుచేయుటవల్లను కుంపిణీవారి రివెన్యూ శిస్తు వసూలు చాలా తగ్గిపోవునని భయపడుచున్నామనిరి.

జమీందారులును రివిన్యు అధికారులైన దివానులును ఈ సన్యాసుల చర్యలను కనిపెట్టియుండుగా కుంపిణీవారి కలెక్టరులకు తెలుపునట్లు వారిని నిర్బంధింపవలయు ననియుదేశములో నెవ్వరును ఆయుధములు ధరించి ప్రయాణము చేయరాదని నిషేధించి అట్లు పోవువారి ఆయుధములను ప్రతి చౌకీలోను తీసికొనవలెననియు ఇందులకు విరుద్ధముగా వర్తించువారిని శత్రువులుగా పరిగణించి వారిపైన చర్యజరుపవలయుననియు కుంపిణీవారు తీర్మానించిరి* అయితే ఈయుత్తరువులను అమలుజరిపినచో చాలాచిక్కులు తటస్థించగలవని కలెక్టరులే యనిరి. ఆ కాలములో దేశమునందు శాంతి భద్రతలను స్థాపించుటకు వంగదేశ ప్రభుత్వమువారికి శక్తి లేకుండెను. దేశములో బందిపోటులును దౌర్జన్యములును విచ్చలవిడిగా జరుగుచుండెను. అందువలన వర్తకులును షావుకారులును సరుకులను సొమ్మును రవాణా చేయుటలో ఆయుధపాణులను నియమించుచుండిరి. "ఒక మిద్నపూరు జిల్లానుండియే ప్రతియేటను మూడు నాలుగువేలమంది జగన్నాథ యాత్రకు పోవుచుందురు. ప్రతి వ్యక్తియు ఆత్మరక్షణ కొఱకొక కత్తి నుంచుకొనును. అందువలన ఏకొత్త యుత్తరవు ప్రజలలో అసంతృప్తిని వ్యాపింపచేయును. నిరపరాధులు నిష్కారణముగా బాధలుపడి ఆస్తిని

---

* Secret Proceedings. 10 March 1773- pp13-2-34

ప్రాణములను గోల్పోవుదురు." అని కలెక్టరుల చెప్పగా ఈ యుత్తరువు సన్యాసులకే వర్తించునట్లును సామాన్య యాత్రికులకును వర్తకులకును వర్తించకుండునట్లును దానిని మార్చిరి. అయితే ఎవ్వరు సన్యాసులు? ఎవరు కారు? అని నిర్ణయించుట చాలా కష్టమైన కార్యముగ నుండెను. అందువలన ఈ యుత్తరువులు నిష్ప్రయోజనములయ్యెను.

సన్యాసులకుగలిగినని జయములవలన వారు ధైర్యముతో విజృంభించిరి. నూరు గుఱ్ఱములతోను మందుగుండు సామానువేసిన 80 ఎడ్లతోను రెండువేలమంది ఆయుధపాణులైన సన్యాసులు 1773 జనవరి నెలలో బోగ్రా(సిల్బెరిస్)గ్రామములో ప్రత్యక్షమైరి. వారు దానిలోననేక గ్రామములను దోచుకొనిరి. గ్రామరైతులు ఇండ్లు వదలిపెట్టిపోయిరి అప్పుడు బోగ్రా కలెక్టరు ఖజానాలో శిస్తుల బాపతు 13 వేలరూపాయిలుండెను వ్యవహారము శృతిమించుచున్నదని అతడు తలచి ఒకవకీలును సన్యాసులవద్దకు రాయబారమంపి ఖజానాలోనుండి తాను వారికి 12 వందల రూపాయలిచ్చి సమాధానపరచి వారిని వెనుకకు పంపించెను. ఇట్లు చేయనిచో వారు తమ వ్యయములను భర్తీపరచుకొనువరకును దేశమును దోచుకునియుందురనియు తన ఖజానాకు రక్షణ లేదనియు అతడు సర్క్యూటు కమిటీవారికి వ్రాసెను. *

1773 ఫిబ్రవరి నెలలోకూడా సన్యాసులీప్రకారమేవచ్చి రంగపూరు జిల్లాలోని గోవిందగంజ్ దగ్గర ఇద్రకుపూరులోని సూపరింటెంటు వలన మూడువేల రూపాయలను పుచ్చుకొని వెళ్ళిరి. ఆసొమ్మును కుంపిణీవారి ఖజానా లెక్కలలో ఖర్చు వ్రాయనట్లు కుంపిణీ ప్రభుత్వము వారుత్తరువు చేసిరి.

14-7-1773 వ తేదీన దినాజ్‌పూరుకు వెళ్ళిన కెప్టెను ఎడ్వర్డ్సుకి క్రింది విషయము తెలిపెను. సన్యాసుల సైన్యములో నొక చిన్న దళము చిల్‌మరి గ్రామమునకు ముందుగా వచ్చి.అక్కడ జమీదారును ఇరువురు

---

• Secret Conpsultaions 21.1.1773-No 2

• R. B. P. 23-3-177› No 36-38. Bengal Govt. Records.

గ్రామస్తులను తీసుకొని నాలుగు క్రోసులలో మన్న పెద్ద సైన్యము దగ్గరకు వెళ్ళిరి. అక్కడ వీరివలన బలవంతముగా 1300 రూపాయలు పుచ్చుకొన్న పిమ్మట వీరిని వదలిరి. ఈ సన్యాసుల దళమువారు ఇతర గ్రామములలోకూడా బలవంతముగా సొమ్ము వసూలు చేసిరి. అటు పిమ్మట వారెట్లుపోయినారని అడిగినప్పటికి ఎవ్వరును ఈ కెప్టానుగారికి చెప్పరైరి *

సన్యాసుల సైన్యమును ప్రతిఘటించుటకు కుంపిణీవారు పరగణా సిపాయిల దళములను పంపిరి. వారికి ముగ్గురు ఇంగ్లీషు కెప్టానులు నాయకత్వము వహించిరి సన్యాసులు కూచ్‌బీహారు జిల్లాలోని సంతోష్ గంజ్ అను కోటను ఆక్రమించుకొనిరి. సన్యాసుల సైన్యము చాలా పెద్దదిగా నున్నందువలన వారు చాలా ధైర్యముతో విజృంభించు చుండిరి. వైకుంఠపురము జమీందారు గారు వీరికి తోడ్పడెను. ఒక సన్యాసుల దళము బ్రిటీషువారి నెదిరించెను కాని వారి తుపాకీ ఫిరంగి గుండ్లబారుకు నిలువలేకపోయిరనియు, వారు భూటాను రాజ్యము వైపునకు వెడలిపోయిరనియు సైనికాధికారి పైవారికివ్రాసెను దండయాత్ర చేయుచున్న సన్యాసులలో నొకదళమువారు వైకుంఠపురపు జమీందారుదైన దర్పదేవుగారిని కలిసికొనుటకు పోయిరి వీరిని తరుముకొని పోయిన కెప్టాను స్టూవార్టును వారు తుపాకులతోను అవాయి గొట్టములతోను కర్నాటక తుపాకులు (Match locks) తోను కొంత సేపు ఎదిరించి తరువాత చెదిరిపోయిరి. ‡

సన్యాసుల నోడించివేసితిమని ఇంగ్లీషు సైనికాధికారులు పైవారికి వ్రాయుచున్నను సన్యాసు లీయుత్తరకుమారుల నోడించి వాయువేగముతో తరలి పోవుచుండినట్లు స్పష్టమగుచుండెను.

1773 ఫిబ్రవరిలో నాలుగువేలమంది గల సన్యాసుల సేన సిల్బెరిస్ (బోగ్రా) జిల్లాలో ప్రవేశించి, అతియా, కగ్మరు, బారాబాజ,

---

* Committee of Circuit Proceedings · 26-1-1773 Bengal Government Receords.

‡ Secret Constitutions 15. 2.1773 No. 5.

పరగణాలలోని గ్రామములను దోచుకొనెను. వారు కగ్మారులోనికి వచ్చి రని తెలియగానే ఢాకానగరమునకు ఆ నగరవాసులు పారిపోయిరి ఈ సన్యాసుల సేనతో జరిగినయుద్ధమునందు కెప్తాను స్టూవార్టు తన ప్రాణము లను గోల్పోయెను. పరగణాసిపాయిల ప్రవర్తనము బాగాలేదని ఆంగ్లే యులనిరి. అప్పుడు సిపాయిల నాయకుడైన జిరంసుబేదారుని పట్టుకొని శిక్షించుటకు రాజధానికి పంపిరి.

1773 లో సన్యాసులు వంగదేశమునందెల్ల తమ దండయాత్ర లను సాగించిరి. ఆ రాష్ట్రమంతయు నొక యుద్ధభూమిగా పరిణ మించెను. ఢాకా కలెక్టరు చాలా వివరములను వ్రాసెను. అల్పసింగు మైమెన్‌సింగు అను పెద్ద పరగణాలలో సన్యాసులు ప్రవేశించి, ఢాకా నగరముపైన కూడా దండయాత్ర చేయుదుమని బెదిరించిరి. 5000 సన్యాసులు జఫర్‌షాహి పరగణాలో ప్రవేశించి జమీందారుగారి నాయ బును ఖైదుచేసి 1600 రూపాయలను పుచ్చుకొని వదలివేసిరి. వీరు వచ్చుచున్నారని తెలియగానే అల్పసింగు మైమెన్‌సింగు పరగణాల గ్రామస్థులు పారిపోయిరి. మోతీసింగు అనునొక నాయకుని క్రింద 6000 మంది సన్యాసులు దండయాత్ర సాగించుచుపోయిరి.

3500 మంది సన్యాసులు జమీందారుగారి గుమాస్తాయైన హిన్‌హర్ సర్కారును ఇద్దరు నాయబులను పట్టుకొనిరి. అంతట వారొక వకీలును రాయబారము పంపి మూడువేల రూపాయలను చెల్లించి వదలించుకొనిరి. ఈ సన్యాసులు మైమెనుసింగు జిల్లాకు పోవుదురనియు అక్కడనింకను ఏడువేల మంది సన్యాసులు వీరిని కలియుదురనియు వీరికివార్తవచ్చెను. చాలా మంది సన్యాసులు చిల్‌మరి గ్రామమున నుండిరి. వీరి నాయకులలో నొకడైన "జారవల్‌గిరి" పదునైదు పడవలతో తరలి వచ్చెను. అప్పుడు జమిందారుగారు కుటుంబముతో కలిసిపోయిరి గ్రామస్థులును పారిపోయిరి

---

• Hasigs to Samuel Lews Collector of Midnapur 22-6-1773

"ఢాకా పట్టణములోకూడా చాలామంది సన్యాసులున్నారు వారు వ్యాపారము చేయుచు జీవింతురు. వీరిలో చాలా మంది సన్యాసుల సైన్య ములకు గూఢచారులుగా నున్నారనుటకు సందేహము లేద"ని 23-1-1773 తేదీన ఢాకా కలెక్టరుగారే వ్రాసిరి.


"సన్యాసులు వచ్చుచున్నారని తెలియగనే ప్రజలు ఇండ్లు వదలి పోవుదురు. నేను మిమ్ములను రక్షింతునని నేను వారికి గట్టిగా చెప్పినను వారు వినుటలేదు. సన్యాసులు అల్పసింగు, చిల్మరి. అతియ. కగ్మను పరగణాలలో, చాలా మొత్తములను గ్రామస్థులవలన వసూలు చేసినార నియు. వర్తకులవలన కూడా చాలా సొమ్ము లాగికొన్నారనియు నాకు తెలియవచ్చినదని" అతడు 6-1-1773 వ తేదీన వ్రాసెను.

సన్యాసుల నాయకుడైన "హనుమంతగిరి" సకోల్సికి వచ్చెను. వారు చంద్రాలో నొక గుమాస్తాను పట్టుకొని 4200 రూపాయిలు వసూలు చేసిరి జమీందారుగారి వకీలును పట్టుకొని ఢాకానగరమునకు దారి చూపు నట్లు నిర్బంధించిరని 20-2-1773 తేదీన చిటాగాంగు ముఖ్యాధికారికి ఢాకా ముఖ్యాధికారి వ్రాసెను •


3-2-1773 వ తేదీన మిద్నపూరులో శిర్సయిదగ్గరకు ఏడెనిమిది వేల మంది సన్యాసులు వచ్చినట్లు తెలిసి సిపాయిలను తమ మందుగుండు సామాను వ్యర్థము చేయవలదనియు, సన్యాసులతో శుష్కప్రియములు పలుకుచు సంభాషింపవలదనియు క్రమశిక్షణముతో మెలగవలసినదనియు వారికి గట్టిగా చెప్పి పంపవలసినదని కలకత్తాలోని కుంపిణీ ప్రభుత్వము వారు మిద్నపూరు రెసిడెంటుకు రాహస్యలేఖ పంపిరి. •

• From the Acting chief of Dacca to the acting Chief of chittagong Bengal District recording Chittalong 774-5.


• From of stewart Secretary (Government) at Edward Baber Resident at Midnapur dated Fart William. 4 Febrary 1773 Secret proceedings. 10-3-1773 No 10-11.




డాలు: ఈటెలు



బల్లెములు



బాణములు



గండ్రగొడ్డళ్లు: చక్రము

ఈ చిత్రములు ఇనుము, ఉక్కు, పరిశ్రమలనుగూర్చి వంగరాష్ట్ర
ప్రభుత్వమువారు 1907 లో ప్రకటించిన "మోనోగ్రాఫు"లోనివి

ఇట్లే 1773 మార్చిలో సన్యాసులు 'కుమార ఖాలీ'కి పోయి పద్మావతినదిని దాటి గ్రామములను కొల్లగొట్టిరి. అగ్రదీపములో తిరునాళ్ళుజరుగు సమయమున నక్కడకు వారు ఆయుధ పాణులైపోయి దారిలో దోపిళ్ళు చేసితరువాత కటకమువైపునకు తరలిపోయిరి. మార్చి నెలలో వారు విష్ణుపూరుకుపోయి మిద్నపూరు అడవులలో ప్రవేశించిరి. వారొక వంకకు పోవుదురని ఇంగ్లీషువారనుకొనగా నింకొక వైపునకు పోయి తుదకు రాయిపూరులో ప్రత్యక్షమైరి. వారు వర్షకాలములో కొంతకాలము దండయాత్రలను విరమించి మరల దసరాపూజల సమయమున ప్రారంభించిరి. రెండుసన్యాసుల దళములు బయలుదేరి బాలసూరు లేక బాలేశ్వరము వైపునకుతరలిపోయిరి. ఈ సన్యాసులు మహారాష్ట్రి రాజ్యమునందు తమశిబిరమునునెలకొల్పి తరువాత కొండలపైకి పోయిరి ఈ సందర్భమునందు సన్యాసులు తమ స్త్రీ జనముతోను చాలామంది పిల్లలతోను కలిసి ప్రయాణమై అలహాబాదులో త్రివేణీ సంగమమునందు స్నానములుచేసి సుఖముగా తమదారిని తాము పోయిరి. ఆంగ్లేయ వీరులు వీరి నరికట్టలేకపోయిరి. 26-10-1773 వ తేదీన కటకమునుండి వచ్చిన యొక లేఖవలన 1700 మంది గోసాయీలును 300 మంది ఫకీరులును కటకమునుండి వంగదేశము వైపునకు బయలుదేరి వచ్చుచున్నారనియు, వారు దారిలో బిచ్చమెత్తుచు వీలైనప్పుడు దోపిళ్లు చేయుచున్నారనియు ఇంగ్లీషువారిప్రతినిధికి తెలిపెననివారు వ్రాసినారు. 25-11-1773 వ తేదీన రెండువేలమంది సన్యాసులు మూడు ఫిరంగులను ఒంటెలపై కెక్కించి. 'మాని' పరగణాలోనికి ఆకస్మికముగా వచ్చిరి. అయితే అక్కడి కాపేవారు వారికి దారి నివ్వలేదు. అప్పుడు వారు ప్రక్కకు తిరిగి ములాతికి పోయిరి. తరువాత వారు శివగంజికి పోయిరని టీర్నూమ్ అసిస్టెంటు కలెక్టరు దర్బారులోని రెసిడెంటుకు వ్రాసెను. మూడువేల మంది సన్యాసులు ఒక్కొక దొక్కొక తుపాకిని బల్లెమును అవ్వాయి గొట్టమును ధరించి, మందుగుండు సామగ్రి నెక్కించిన రెండు ఒంటెల

*Leatter Copy Books of the Resident of Darbar ii 193-Letter No 145.

తోను పది గుఱ్ఱములతోను పూర్ణియానుండి శివగంజికి వచ్చి బ్రహ్మపుత్రానది వైపునకు పోవుచున్నారని 'లష్కర్‌పూరు' కలెక్టరుగారి హర్కారా శివగంజినుండి యొక వార్తను దెచ్చెను. వీరు పెద్ద దోపిళ్లు జరిగించలేదనియు, జమీందారులనుండి బలవంతముగా కొన్ని మొత్తములను మాత్రము వసూలు చేసిరనియు, గ్రామస్థులవలన తమకు గావలసిన ఆహారపదార్థములు మొదలైనవానిని పుచ్చుకొనిరనియు అతడు చెప్పెను. ఈ సంగతులనెల్ల శివగంజిలోని ఒక గుమాస్తాకూడా వ్రాసినాడని ఆ కలెక్టరుగారు 5-12-1773 వ తేదీన వారన్‌హేస్టింగ్సుగారికి తెలియపరచెను. * 16-12-1773 వ తేదీన గవర్నరు వారన్‌హేస్టింగ్సు కాశీరాజైన చెయితుసింగుగారికి ఈ సన్యాసులను తరిమివేయుటలో తమకు తోడ్పడవలసినదనియు 500 మంది రౌతులను పంపవలసినదనియు వ్రాసెను.

పరగణాసిపాయిలు నమ్మకముగా పనిచేయుటలేదనియు వారివలన లాభము లేదనియు వారన్‌హేస్టింగ్సు గ్రహించి ఆ సిపాయిల దళములను బర్తరఫుచేసి వివిధ ప్రదేశములందు కుంపిణీవారి రెగ్యులరు సైన్యములోని సిపాయిలను నిలిపియుంచెను.

1773 సంవత్సరాంత మగునప్పటికి సన్యాసులను కుంపిణీ సిపాయిలొక చోటినుండిమరియొక చోటికి తరుమసాగిరి. సన్యాసుల బలము తగ్గుచుండెను. గాని వారు మరల మరల వచ్చి పడుచునేయుండిరి. 1774 లో వారి దండయాత్రలు పూర్వమువలె తీవ్రముగ లేకుండెను. అయినను అప్పుడప్పుడు కుంపిణీవారు సేనలకు చిక్కులు కలిగించుచునే యుండెను. 1775లో ఈ సన్యాసులు క్రొత్త పద్ధతుల నవలంబించిరి. వారు తీర్థయాత్రలకై బయలుదేరుచున్నామని చెప్పుచు అలహాబాదులో నొక గొప్ప సమావేశము నేర్పాటుచేసిరి. చునారులో నున్న కుంపిణీవారి మిలటరీ యధికారుల నేమరచుటకు ఒక్కొక్క ముఠాలో నేబదిమందిచొప్పున బయలుదేరి తూర్పుగా ప్రయాణము చేయసాగిరి. అక్కడనిరువదివేలమంది ప్రోగగుటచూచి కుంపిణీవారి సైనికోద్యోగి తన పై యధికారికి తెలియపరచెను. అయితే చెయితుసింగు రాజ్యమునం దాయన సహకారములేకుండా

* Secret Proceedings 9-12-1773. No 2

ఈ సన్యాసులపైన చర్య తీసుకొనుటకు సైనికాధికారికి ధైర్యము లేకపో యెను. అప్పుడు అతడు వారన్ హేస్టింగుకు వ్రాసి చెయిత్‌సింగుకుకూడా తెలియపరుపగా సరకీ సన్యాసుల దండయాత్రను అరికట్టెను. ఈలోపుగా సన్యాసుల సైన్యము అలహాబాదు దగ్గర గంగానదినిదాటి కొంతదూరము సాగెను అయితే చెయిత్‌సింగు ఒత్తిడివలన నా సైన్యము ఇంకొక వైపునకు తిరిగిపోయెనని 9-4-1775 వ తేదీన చునారులోని సైనికాధికారి వారన్ హేస్టింగ్సుకు తెలియపరచెను. * అటుపిమ్మట సన్యాసుల దండ యాత్రలను గూర్చిన వివరములు కుంపిణీవారి రికార్డులలో కనబడుట లేనందున అవి యంత లెక్కచేయతగినవి గాకుండెనని యెంచవచ్చును.

సన్యాసుల యుద్ధములవలన విజాతీయ ప్రభుత్వము తొలగక పోయినను అందులోని లోపములు వెల్లడియై దేశములో క్రమ పరిపాల నము స్థాపించి ప్రభుత్వవిధానము సంస్కరించుటకు కారణమయ్యెను.

# 5

## బంకించంద్ర చటర్జీ ఆనందమఠము

వంగదేశ సుప్రసిద్ధ గ్రంథ కర్తయైన బంకించంద్ర చటర్జీగారు "ఆనందమఠ" మను చరిత్రాత్మక నవలయందు సన్యాసుల యుద్ధము లనుగూర్చియు ఆనాటి పరిస్థితులను గూర్చియు వర్ణించి యున్నారు. ఆయన ప్రభుత్వోద్యోగిగా నుండినందున ఇంగ్లీషువారికి ఆగ్రహము రాకుండు టకును తన నవలలోని కథాపోషణ కొఱకును సన్యాసులయుద్ధమును గూర్చిన చరిత్రాంశములందు కొన్ని స్వల్పమైన మార్పులను చేసెను గాని ప్రధానాంశముల యందెట్టి మార్పులను చేయలేదు. ఆయన నవల చదివినచో ఆయన ఈ చరిత్రకు సంబంధించిన ప్రభుత్వ రికార్డులను చదివియున్నట్లు స్పష్టపడుచున్నది.

* Secret Proceedings 30 April 1775. No2.

బంకించంద్రుడు 1858 లో కలకత్తా విశ్వవిద్యాలయములో పట్టభద్రులైన ఇరువురు విద్యార్థులలో నొకడు. ఆయన సంస్కృతములోను బంగాళీ భాషలోను పాండిత్యమును సంపాదించి విద్యార్థిగా నుండగానే కవిత్వము నభ్యసించి ఒక వార్తాపత్రిక కార్యాలయము నం దనుభవమును సంపాదించెను. బహు గ్రంథములను పఠించెను.

ఆయన పట్టభద్రుడైన పిదప ఇంగ్లీషు దొరతనమువా రాయన నొక డిప్యూటీ మేజిస్ట్రేటుగా నియమించిరి. 1857 నాటి భారత స్వాతంత్ర్య విప్లవము తరువాత దేశము నింగ్లీషువారు కఠిన శాసనములతో పరిపాలించుచున్నకాలమది. ఆ కాలమున నింగ్లీషు దొరలు చాలా బలవంతులై యుండిరి. నీలిమందు తోటల యజమానులైన ఇంగ్లీషు దొరలు క్రూరులై భారతదేశ రైతులను కూలివారిని పారిశ్రామికులను బాధించుచు అన్యాయములు చేయుచుండిరి. ఆ సందర్భమున దొరలు చేసిన నేరములనుగూర్చిన కేసులు బంకించంద్రుని యెదుట విచారణకు రాగా నేరములచేసిన దొరలకాయన నిర్భయుడై కఠిన శిక్షలు విధింప సాగెను. నేరమునుచేసి అస్సాము రాష్ట్రమునకు పారిపోయిన దొరలను పట్టి తెప్పించిశిక్షించెను. అంతట ఇంగ్లీషు ప్రభుత్వాధికారు లాయన నా పదవినుండిమార్చి కలకత్తాలోసహాయ ప్రభుత్వకార్యదర్శిగా నియమించిరి. అక్కడి ఇంగ్లీషు కార్యదర్శికి ఆయన అణగి మణగి యుండనందున ఆయనను ఆల్లీపూరుకు బదిలీచేసిరి. ఆయన ప్రభుత్వ కార్యాలయమున నుండగా సన్యాసుల యుద్ధమును గూర్చిన చరిత్రాధారములను చదివి యుండెననుటకు సందేహములేదు. 1926 లో బ్రజేంద్రనాథ బెనర్జీగారు మోడరన్ రివ్యూపత్రికలో సన్యాసుల తిరుగుబాటు అను వ్యాసమునందు బయట పెట్టువరకును ప్రభుత్వమువారు ప్రకటింపని రికార్డులలోని ముఖ్యాంశములను పేర్లను బంకించంద్రు డుదహరించుటవలననే ఆయన ఆ రికార్డులను చదివెనని స్పష్టపడుచున్నది.

1857 నాటి భారత స్వాతంత్ర్య సమరము జరుగుచుండిన కాలము సందాయన పట్టపరీక్ష విద్యార్థిగా నుండినందువలన ఆ యుద్ధముయొక్క స్వరూప స్వభావములును, అది విఫలమైన కారణములును బంకించంద్రు

దెలుగును. అందువలననే ఆయన సన్యాసులనుగూర్చి వ్రాయుటలో వారైక మత్యము కలిగి కార్యదీక్షతో యుద్ధము చేసినందువలననే జయముగాంచి రని పలుమారు నొక్కి చెప్పెను; భారతజాతీయోద్ధరణమునకై కమత్య మత్యం తావశ్యకమనియు సూచించెను.

బంకించంద్రునికి వేదశాస్త్రపురాణము లందును వర్ణాశ్రమ ధర్మ మందును ఆర్యసంస్కృతి పైనను గౌరవము మెండు. ఆకాలమున వంగ దేశములో ప్రబలిన బ్రహ్మసమాజ సంఘ సంస్కార ఆంగ్లేయ నాగరి కతాభిమానుల యుద్యమములపైన ఆయనకుగౌరవములేదు. ఆయన గొప్ప దేశభక్తుడు. మత ధర్మములను నాశనముచేసి మ్లేచ్ఛులను ప్రతిఘటించిన హిందూవీరుల చరిత్రలనే ఆయన దుర్గేశనందని, రాజసింహ, ఆనంద మఠ అను గొప్ప నవలలందు చిత్రించెను. భారతదేశమునందేగాక పాశ్చాత్యదేశములందుకూడా ప్రఖ్యాతి చెందిన దుర్గేశనందని, 1864 లో ప్రకటింపబడెను.

బంకించంద్ర చటర్జీగారు 1872 లో 'వంగదర్శనియను' నొక బంగాళీ మాస పత్రికను స్థాపించి అందులో దేశాభివృద్ధికి తోడ్పడగల వ్యాసములను కథలను వ్రాయుటయేగాక తన గొప్ప నవలలను కొన్ని టిని వరుసగా ప్రకటించెను.

క్రీ. శ. 1757 లో జరిగిన ప్లాసీయుద్ధానంతరము వంగదేశనవాబుల నాంగ్లేయ వర్తక కంపెనీ దొరలు కీలుబొమ్మలుగాచేసి తెరవెనుక భాగవ తము నాడసాగిరి దేశపరిపాలనము అధ్వాన్నముగానుండి అధర్మము ప్రబలి ప్రజలెంత బాధపడుచున్నను ఆంగ్లేయులు జోక్యము కలిగించు కొనక తమ లాభములను చూచుకొనుచు అన్యాయములు చేయసాగిరి. ప్రజల ధనమునకు, మానములకు, ప్రాణములకు రక్షణ లేకుండెను. ఈ యరాజకమునందు వర్ణాశ్రమ ధర్మ మడుగంటెను. అందువలన సన్యాసులు ధర్మస్థాపనము చేయుటకై నడుముగట్టి జీవచ్ఛవములై యున్న మహమ్మదీయ రాజ్యముపైనను దాని నాశ్రయించియున్న పాశ్చాత్య పరంగి పిశాచములపైనను ధర్మయుద్ధము చేసిరని బంకించంద్రుడు కన్ను లకు కట్టినట్లు వివరించినాడు.

సన్యాసులు దేశసేవానిరతులనియు, వారు శత్రుసంహారముచేసి దేశము నుద్ధరింపగల మహా మాతయగు కాళికాశక్తిని, దశ ప్రహరధారిణి యగుదుర్గాదేవిగను,ప్రజలకు సకల సంపదల నొసగగల మహా లక్ష్మిగను, సకల విద్యాదాయినియగు మహా సరస్వతిగను ఆరాధించుచు, మాతృ సేవా వ్రతదీక్షను వహించిరనియు బంకించంద్రుడు వర్ణించెను.

ఈ మాతృసేవా వ్రతదీక్ష వహించినవారందరును ఆ మహాశక్తి సంతానములనియు తమలో బ్రాహ్మణ శూద్ర వర్ణభేదము లేదనియు, కార్య సాధనమగువఱకును దీనిలో చేరినవారందఱును భార్యలనుబిడ్డలను త్యజించి గృహస్థ ధర్మములను వర్జించి, ఇంద్రియములను నిర్జించి సనాతన ధర్మమునకై స్వయముగా యుద్ధము చేయుటకును తమ స్వంతమునకు ధనార్జనము చేయక, తాము సంపాదించిన ధనమెల్ల వైష్ణవ ధనాగారమున కొసగుటకును, సంతానమత ధర్మములయొక్క సకల నియమములను పాటించుటకును ప్రమాణములు చేయుచుండిరి. వీరు మాతృసేవా దీక్ష యందు వందేమాతర గీతము నొక మహా మంత్రముగా చేసి పాడు చుండిరి. ఇదియె తరువాత భారతజాతీయ గీతమైనది. వీరందరును సన్యాసులవలెనే కావిరంగు దుస్తులను ధరించిరి.

బంకించంద్ర చటర్జీగారీ సన్యాసుల యుద్ధ కారణములను వివ రించుటలో ఇంగ్లీషువారు దేశీయ పరిశ్రమలను వ్యవసాయమును నాశ నము చేసిన కథను వివరించియున్నారు. తరువాత రమేశ చంద్రదత్తుగారు వర్ణించిన భారతదేశ ఆర్థికస్థితిని కన్నులకు కట్టినట్లుగా వివరించినారు. 1768 లో ధాన్యము ధరపెరిగి దేశములోని ధాన్యమంతయు ఇతర ప్రాంతములకెగుమతియయ్యెను. దేశములో దుర్భిక్షము కలిగెను. 1770 లో కఱవు వచ్చెను. ప్రజలు అన్న వస్త్రములు లేక అల్లాడు చుండిరి. వేలకొలది ఇండ్లు వాకిండ్లు వదలిపోయి తిరుగుచు మార్గమున పడి మరణించు చుండిరి. అయినను ఇంగ్లీషువారు శిస్తులను కఠినముగ వసూలుచేయుచుండిరి. ఆ ప్రాంతముల నేలు మహమ్మదీయ నవాబులు జమీందారులు తమ యధికారులను నౌకరులను పిండి రైతులను బాధించి, శిస్తులను వసూలుచేసి ఆ ఖజానాను సిపాయిల కావలాతో ఇంగ్లీషువారి

పట్టణములకు తరలించుచుండిరి. ఇట్లీ ప్రజలు మరణించుచుండగా కుంపినీ వారి సైన్యమునకు కావలసిన ధాన్యమునుకూడా సిపాయిల కావలాతో తరలించుచుండిరి. ఇట్లు చేయుట అన్యాయమనియు ప్రజలను రక్షింప లేనివాడు రాజు కాదనియు ప్రజలవలన వసూలుచేయు ధనము ప్రజల క్షేమము కొరకు వినియోగింపవలెననియు సంతానులనిరి. ఆ దుర్భిక్ష కాలమునందు గ్రామరైతులు అన్నవస్త్రములు లేక దొంగతనములు చేయవలసినవారైరి. ఆంగ్లేయుల దుశ్చర్యలవలన జీవనములు పోయిన పారిశ్రామికులు చిల్లర వర్తకులు నిర్లే భికారులై దొంగతనములుచేసి జీవించవలసిన వారైరి. దేశములో నెక్కడ చూచినను దోపిళ్లు జరుగు చుండెను. సన్యాసులలోకూడ కొందఱు వేషధారులును దుర్మార్గులు నుండిరి. నిజమైన సన్యాసు లెప్పటివలెనే కాశీ మొదలగు పుణ్యక్షేత్రము లందు తీర్థయాత్రలందు కాలక్షేపము చేయుచుండిరి. ఆ కాలమున సన్యాసులకు భిక్షమే లభించకుండెను. రాకపోకలు దుస్తరములయ్యెను.

సంతానులను ప్రతిఘటింపలేక ఆ దేశములోని ప్రభువులు తమ ఇంగ్లీషుస్నేహితుల సహాయము నపేక్షించిరి. ఆంగ్లేయులు పంపిన సేనాధి పతులును, వారిక్రింది తెలింగీ హిందూస్తానీ సిపాయిలును జాతివారును సంతానులచే నిహతులగుచుండిరి. సంతానులకొక స్థావరములేదు. నిలు కడయైన సైన్యము లేదు. కోటలేదు, ఆదాయము లేదు. అయినను వారీ ఆంగ్లేయుల ప్రభుత్వమును ధిక్కరించి పోరాడుచుండిరి. దేశములోని రైతులు, పారిశ్రామికులు చిల్లర వర్తకులు జీవనములు జరుగక బిచ్చ గాండ్రై అన్న వస్త్రములు లేక అల్లాడుచుండగా దేశము దుర్భిక్షము నందు మునిగియుండగా మొగలుచక్రవర్తిగారి దివానుగిరీ అధికారములను చలాయించుచు వంగదేశ నవాబుగారి దుష్పరిపాలనకు మూలకందము లైయున్న ఆంగ్లేయు లీ యధర్మమున కంతకు కారణభూతులుగా నున్నా రని సంతానులనిరి. ఈ అన్యాయపు దుష్పరిపాలనమును కూల్చివేయ దలచిరి. ఇంగ్లీషు సిపాయిల సహాయముతో తరలింపబడుచున్న ఖజా నాను ధాన్యపుబండ్లను సంతానులటకాయించి పట్టుకొనిపోయి గ్రామ ములనుండి సొమ్ము వసూలు చేయసాగిరి. దీనివెల్ల సంతాన మతమున

చేరిన ప్రజల కన్నవస్త్రములిచ్చి పోషించుటకు వినియోగింప సాగిరి. ఈ సంతాన ధర్మము బాగున్నదని అందఱకును తోచెను. సంతానుల జనసంఖ్య వృద్ధియయ్యెను. సంతానులకు మొదట ఖడ్గములు బల్లెములు తప్ప వేరు ఆయుధములు లేవు. తరువాత వారు సిపాయిల తుపాకులను పట్టుకొని యుపయోగించిరి. అటుపిమ్మట తుపాకులు ఫిరంగులు చేయు ఆయుధాగారమును నెలకొల్పిరి మందుగుండు సామగ్రిని సంపాదించిరి. సంతానుల సైన్యము అభివృద్ధి చెందెను.

సంతానులసైన్యములను ప్రతిఘటింపలేక దేశమునేలు ప్రభువుల ఇంగ్లీషువారి సహాయము కోరగా ఆంగ్లేయ కుంపిణీవారు తమ కెప్టానులను సైనికాధికారులను సేనలను పంపసాగిరి. మొదట వివిధ పరగణాలలో ఫౌజుదారుల క్రింది హిందూస్థానీ సిపాయిలకు ఇంగ్లీషు కెప్టానులు నాయకత్వము వహించి సంతానులతో పోరాడిరి. కాని ఈ సైన్యములు వారిని ప్రతిఘటింపలేకపోయెను తమ కపజయము కలుగుచున్నను తామే జయించుచున్నామని వీరు అబద్ధపు సమాచారములు పంపగా ఇంగ్లీషు అధికారులు నమ్మిరి. అటుతరువాత ఇంగ్లీషు కెప్టానులును సిపాయిలును నిహతులుకాగా నిజము బయల్పడెను. సంతానులపైకి పంపబడిన కొన్ని పెద్ద సైన్యములనుకూడా వారు యుద్ధమునందు జయించిరి.

దేశములో అన్యాయములు చేయుచు అధర్మముగా పరిపాలించు చున్న మహమ్మదీయ ప్రభుత్వమునకు మీదు తోడ్పడుట న్యాయము కాదని సంతాన నాయకులు ఆంగ్లేయ సైనికాధికారులకు చెప్పిరని బంకిం చంద్రుడు వ్రాయుటలోనే ఆంగ్లేయులు అధర్మమునకు దోహదము చేయు చుండిరని సూచించెను.

ఇంగ్లీషువారు వంగదేశములోని ప్రభుత్వ విధానమును కాపాడు టకై సంతానులపైకి పెద్దసైన్యము పంపిరి. ముగ్గురు సైనికాధికారులు దానికి నాయకత్వము వహించిరి. సంతానులు వీరిని ప్రతిఘటించి దాగుడు మూత యాటవలె యుద్ధములు చేసిరి. సంతానుల శిబిరములను కనుగొని మాఘశుద్ధ పూర్ణిమనాడు జరుగు గొప్ప గోసాయీల పరిషత్తుకు చాలా

మంది పోయినప్పు డా శిబిరమును ముట్టడించి నాశనము చేయుటకు ఇంగ్లీషు సైనికాధికారు లాలోచించిరి. ఆరాత్రి ఘోరమైన యుద్ధముజరిగెను. ఆయుద్ధమునందు ఆంగ్లేయ సేనాధిపతులును వారిక్రింది సైనికులును చాలమంది చచ్చిరి. మహమ్మదీయ ప్రభుత్వ బలములకు పరాజయము కలిగెను. హిందూ ధర్మరాజ్యము స్థాపింపదలచిన సంతానుల కఖండ విజయము చేకూరెను. అయినను హిందూరాజ్యము స్థాపింపబడునను ఆశలేదు ఏలన కలకత్తాలోని ఇంగ్లీషువారు చాలా బలవంతులుగానుండిరి. వారి ప్రభుత్వమే స్థాపింపబడును. అది స్థాపింపబడుట ఈశ్వర సంకల్పమని సంతానుల కొక మహాత్ముడు బోధించినట్లు చెప్పి ఆంగ్లేయులు తెర వెనుక భాగవతమాడుట మాని ప్రభుత్వము వహింతురనియు, ఆధర్మము తొలగుననియు వారు న్యాయముగా పరిపాలింతురనియు బంకించంద్రుడు అన్యాపదేశముగా చెప్పి దేశాభిమానమును బోధించెను.

"ఆంగ్లేయులిప్పుడు వర్తకులు. అర్థ సంగ్రహణమునందే బుద్ధి కలవారైయున్నారు రాజ్యశాసనభారము వహించుట కిష్టములేదు. ఈ సంతాన విద్రోహ కారణముగా వారు రాజ్య శాసనభారము వహింపవలసి వచ్చును. ఆంగ్లేయులు రాజ్యాభిషిక్తులగుటకే సంతానవిద్రోహము సంఘటించినది " అని బంకించంద్రుడామహాత్ముని నోట పలికించెను.

బంకించంద్ర చటర్జీగారు ఆనందమఠము 1882 లో ప్రకటించెను. అప్పటికి ఆంగ్లేయులు భారతదేశమునందు చాల బలవంతులై సామ్రాజ్యాధీశులైయుండిరి. అందువలన నాంగ్లేయులను పారదోలుటకే సంతానులీ యుద్ధములు చేసిరని వ్రాసినచో నది రాజద్రోహముగ నెంచి ఈనవలనే నిషేధింతురని బంకించంద్రు డెరుగును అందువలన హిందూమత ధర్మములను నాశనముచేసిరను కారణముతో మహమ్మదీయ ప్రభుత్వము పైననే సన్యాసులైన సంతానులు యుద్ధముచేసిరనియు మహమ్మదీయ పరిపాలకులు కోరినందున వారి కాంగ్లేయులు సహాయము చేసిరనియు అందువలన సన్యాసులు అనవసరముగా ఇంగ్లీషువారితో యుద్ధము చేయవలసి వచ్చెననియుచెప్పి, ఆంగ్లేయరాజ్యము సుస్థిరముగా నెలకొల్పబడుననియు వారు న్యాయముగా పరిపాలింతురనియు వారి ప్రభుత్వమున

హిందువులు సుఖపడుదురనియు ధర్మము నాలుగు పాదముల జరుగునవియు బంకించంద్రుడు భరతవాక్యమును వ్రాసెను.

ఈ నవలయందాయన దేశాభిమానమును స్వాతంత్ర్యోద్యమావశ్యకతను అన్యాపదేశముగా బోధించెననుటకు సందేహము లేదు.

# 6

## లోకసంగ్రహము - సన్న్యాసము

దిలీపకుమారరాయిగారు వంగదేశములోని ఒక గొప్ప కుటుంబమున జన్మించి పాశ్చాత్య దేశములందు విద్యనభ్యసించి సంగీత సాహిత్యములందు వేదాంతమునందు ప్రతిభాశాలియని పేరుపొందినవాడు. ఈయన గాంధిమహాత్మునికి రవీంద్రనాదఠాకూరు గారికి రోమెయిన్ రోలా మొదలగు మహాపురుషులకు, స్నేహపాత్రుడై అరవిందయోగికి శిష్యుడై ఉద్గ్రంథము లనేకములు రచించెను. ఈయనయు, నీయన పుత్రికాసమురాలును విదుషీమణియునైన ఇందిరాదేవియు 1954 లో ప్రయాగలో మహాకుంభమేల తీర్థమును జూచి అక్కడకు వచ్చిన మహాత్ములను కొందఱను దర్శించి ఆవిశేషములనుగూర్చి యొక యుద్గ్రంథమును రచించియున్నారు. *

భారతదేశములో నలుమూలల దిరిగి, లక్షోపలక్షల ప్రజలు సమావేశమైన మహాసభలో నుపన్యసించిన శ్రీ జవహర్లాల్ నెహ్రూగారు కూడా ఈ మహాకుంభమేలలో చేరినంతమంది జనమును తానెక్కడను చూడలేదని చెప్పిరి. ఈ మహాతీర్థము భారతదేశ పురాణేతిహాసము లందు ప్రసిద్ధిగాంచినది. ఇది యెప్పుడు ప్రారంభమయ్యెనో ఎవ్వఱును చెప్పజాలరు క్రీ. శ. 644 లో మన దేశమునకు వచ్చిన హ్యూయన్‌త్సాంగు అను చీనాదేశపు బౌద్ధయాత్రికుడు త్రివేణీసంగమున జరిగిన కుంభ

* Kumbha-Indias' Ageless Festival•Dilip Kumar Roy and Indira Devi - Bharatiya Vidya Bhavan (1955).

మేలను వర్ణించియున్నారు. అప్పుడక్కడ కొన్ని లక్షలమంది జనులు చేరిరని అందన్ని వర్ణములవారు, అన్ని మతశాఖలవారు, బాలుర వృద్ధులు, స్త్రీలు, పురుషులు, సంసారులు, సన్యాసులు, పీఠాధిపతులు, యోగులు, భోగులు మొదలైనవార సంఖ్యాకులుగా నుండిరని భారతదేశ చక్రవర్తియైన హర్షవర్ధనుడు తన మంత్రులతోను సామంతులతోను వచ్చి ఆ తీర్థస్నానమాచరించి తన ధనమెల్ల దానముచేసెనని ఆ యాత్రికుడు వర్ణించెను

దేవదానవు లమృతముకొఱకు సముద్రమును మథించగా లభించిన అమృతకుంభము కొఱకై వారు దేవమానమునుబట్టి పండ్రెండు దినములకు సరియగు పండ్రెండేండ్లపాటు పోరాడిరనియు ఆ పెనగులాటలో నా యమృతకలశము హరిద్వారమునను ప్రయాగలోను ఉజ్జయిని లోను నాశికలోను మొత్తముమీద నాలుగుసారులు భూమిపైన పడెననియు ఆ పండ్రెండుదినములయనంతరము సూర్యుడు మేషరాశిలోను బృహస్పతి వృషభరాశిలోను ఉండగా శ్రీ మహావిష్ణువు అవతరించి అమృతము పొందుట కధికారముగల వారికి దానిని పంచియిచ్చి లోక సంగ్రహ మొనరించెననియు ఐతిహ్యమున్నది.

దేవమానము పండ్రెండుదినములకు సరియగు పండ్రెండేండ్లకొక మారీదివ్యము హూర్తము వచ్చుచుండును. అట్టి పుణ్యకాలమున గంగానదిలో స్నానము చేసినవారికి ఒక లక్షమారులు భూప్రదక్షిణము చేసినంత ఫలము కలుగునని విష్ణుపురాణము చెప్పుచున్నది. అందువలన నీ భారతదేశములో నలుమూలలనున్న సమస్తజనులును గంగానదీతీరమున గల ఆ మహాక్షేత్రమునకు పోయి స్నానము చేసి తరించుటకు ప్రయత్నించుచుందురు.

సర్వసంగ పరిత్యాగులగు మహాయోగులు బ్రహ్మజ్ఞాన సంపన్నులు మహాత్ములు నా పుణ్యకాలమున నా మహాక్షేత్రములకు వచ్చి స్నానముచేసి లోకసంగ్రహము చేయుచుందురు. సామాన్యజను లట్టి మహాత్ములను దర్శించి తరింపగలుగుచుండిరి.

అట్టి సమయములందు పుణ్యకథాశ్రవణము, వేదశాస్త్ర చర్చలు, ధర్మ విచారములు జరుగుచు లోకసంగ్రహము జరుగుటకు తోడ్పడు

చుండెను. అక్కడ చేరిన మహాయోగులు సాధకులు, బ్రహ్మజ్ఞాన సంపన్నులు, విద్వాంసులు నా సమయమున ఒండొరుల అనుభవములు చెప్పికొనుటకు సత్కాలక్షేపము చేయుటకు, జనసామాన్యమునకు మోక్ష మార్గమును చూపుటకు అవకాశము కలుగుచుండెను. క్రమక్రమముగా ఈ మహాకుంభమేల యొక్క ప్రధానోద్దేశమును విస్మరించి దానినొక తిరునాళ్ళుగా పరిగణించుట ఉత్సవముతో ఊరేగింపులతో వినోదములతో ప్రొద్దుపుచ్చుట పరిపాటియైనది. అందువలన దీనివలన పొందగలిగినంత ప్రయోజనమును ప్రజలు పొందలేకున్నారు.

భారతదేశ ప్రజలకు సన్యాసులపైన విరాగులపైన గల గౌరవమును బట్టి నిజమైన సన్యాసులైనను కాకపోయినను కావిరంగుబట్టలు ధరించిన జడధారులందరికిని ఇట్టి తీర్థములందు కావలసినంత భోజనము పెట్టి ధనమిచ్చుచుందురు. అందువలన నిట్టి మహాతీర్థములందు మహాత్ములైన బ్రహ్మజ్ఞానులు యోగులు మాత్రమేగాక అనేక విధములైన సన్యాసులు బైరాగులు జోగులు భిక్షగాండ్రు, వేషధారులు మోసగాండ్రును వచ్చి చేరుదురు. వీరిమధ్య నిజమైన మహాత్ములను కనిపెట్టుటయే యొక గొప్ప కార్యముగనుండును. ఇప్పటికిని మహామండలేశ్వరులును మహాపండితులును మహానుభావులును ఈ మహాకుంభమేలకు వచ్చి ధర్మసంస్థాపనముచేసి లోకసంగ్రహ మొనరించుటకు కృషిచేయుచుందురు.*

మహాకుంభమేలలో సమావేశమైన అసంఖ్యాకులగు సన్యాసుల జీవితవిధానము విచిత్రమైనది. వారికి నిలువనీడగాని అన్నవస్త్రములుగాని లభించు ఆధారములు లేవు. వానినిగూర్చిన చింత యావంతయైనలేకుండా వారు జీవింపగలుగుట చూచియే ప్రజలకు వారియందు అపారమైన భక్తి గౌరవము లేర్పడినవి.

కుంభమేలలో అనేక విధములైన సన్యాసులు కనబడుదురు. లక్షమంది సాధువులు చేరినప్పుడు అందులో మహానుభావులెవ్వరో కేవలము వేషధారులెవ్వరో తెలిసికొనుట సులభముకాదు. దిలీపకుమారరాయిగా

* Hindu Fasts and Festivals - Sri Sivananda Pp. 132-139.

రును ఇందిరాదేవియు అలహాబాదు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తియు కలిసి ఆ మహాజనములో తిరుగుచుండగా వారికనేక విధములైన సన్యాసులు కనబడిరి కొందఱు ఊర్ధ్వబాహువులై ఉపవాసములతో శుష్కించిన శరీరములు గలిగి ఒకచేతిని పైకెత్తి అది యెండిపోవునట్లు చేసి తపస్సు చేయువారు, కొందఱు గంటలకొలది శరీరము కొంకరలు పోవు శీతల గంగాజలమునందు నిలచి తప మాచరించువారు. రెప్పవాల్పక తదేక ధ్యానముతో సూర్యబింబమును చూచు త్రాటకమను యోగసాధన చేయువారును, దిగంబరులై యోగమును బట్టుచుండువారును, దిగంబరులుగనే తిరుగు నాగసన్యాసులును చిరుగంటలను మ్రోగించుచు రాత్రింబవళ్లు తిరుగు పరివ్రాజకులు ఏండ్ల తరబడి మౌనముద్రను వహించు మౌనులు ఇరువది నాలుగుగంటల పొడవున తలక్రిందులుగా కాళ్ళు పైకిపెట్టి యుండు శీర్షాసనులు, రాత్రింబవళ్ళు నిలిచియేయుండి ఒక ఊతకర్రకు తగిలించిన చిన్న పలకపైన తలపెట్టి నిద్రించు నియమములో నున్నవారు, ప్రత్యేక నియమములేవియు లేని అవధూతలు, అష్టైశ్వర్యము లనుభవించి ఏనుగులెక్కియూరేగు మహంతులును మహామండలేశ్వరులును పల్లకీలలో నూరేగు పీఠాధిపతులు, వేదశాస్త్రచర్చలందు వేదాంత చర్చలందు ప్రొద్దుపుచ్చు దాంభికులగు సన్యాసులు, నిజమైన విద్వాంసులు, పండితులు మొదలైనవారును అసంఖ్యాకు లక్కడ కనపడిరి.

అవయవములను శుష్కింప జేసికొని శరీరమును బాధించు హింసాత్మకములగు కఠోరవ్రతములను చేయువారి నిజోద్దేశము ఇంద్రియములను స్వాధీన పరచుకొని బ్రహ్మజ్ఞానము సంపాదింపవలెననియె. అట్టివారిలో సిద్ధిని పొందినవారు బ్రహ్మజ్ఞానులు నున్నను ఆ దివ్యపథమును చేరలేనివారు చాలామంది యుండిరి. కొంత సాధనచేసి తాము సంపాదించిన స్వల్పపు శక్తి సామర్థ్యములకే తృప్తిచెంది తమ గొప్పదనమును గూర్చి తమచుట్టు చేరిన శిష్యకోటిచేయు స్తోత్రములకు సంతోషించుచు కాలక్షేపము చేయువారు నుండిరి. ఇదిగాక చాలా స్వల్పమైన శక్తిసామర్థ్యములు సిద్ధులు సంపాదించి వాని నుపయోగించి ధనార్జనము చేయు

సాధు వేషధారులు నుండిరి. ఇంక వీరుగాక నేవిధముగను సన్యాసులని యనుటకు వీలులేని మోసగాండ్రను వీరి మాయలకులోబడు అమాయకులు నుండిరి. అయితే ఈ కుంభమేలలోని గొప్ప విశేషమేమనగా ఇతర క్షేత్రములకుగాని తీర్థములకుగాని మరెక్కడికిగాని కదలి రాని నిజమైన బ్రహ్మజ్ఞాన సంపన్నులు యోగసిద్ధులనగు మహాత్ములు కొందరిక్కడికి వచ్చుచుండుటయే. దీనికి కారణము మన సనాతన ధర్మము ప్రకారము లోక సంగ్రహముకొఱకై అక్కడకు పోవలసిన బాధ్యత యొకటి వారికి విధింపబడినది. ఎవ్వరైన అదృష్టవంతులు వారిని గుర్తించి వారి దర్శనముచేసి తరింపవచ్చును. వీరి మత ధర్మములను గూర్చి తమకుగల ధర్మ సందేహములను దీర్చికొని తరింపవచ్చును; అంతేగాని తమంతట తామే వారు తమశక్తి సామర్థ్యములను యోగసిద్ధులను ప్రకటింపరు. ధర్మమును బోధింపరు.

ఏ జాతియొక్క గొప్పదనమునుగాని ఆ జాతిలోని అధమ తరగతులవారి చిత్తవృత్తులను బట్టి నిర్ణయింపరాదు. అందులోని ఉత్తమ తరగతివారి గుణ శీలములనుబట్టియు సంస్కృతి సంప్రదాయములను బట్టియు నిర్ణయింపవలెను. అందువలన సన్యాసాశ్రమముయొక్క గొప్పదనమును కూడ అందలి మహానుభావులను బట్టియే నిర్ణయింపవలెను. సన్యాసుల పద్ధతులు విచిత్రములుగ నుండును. వారి మాహాత్మ్యమును కనిపెట్టుట చాలా కష్టము.

అదృష్టవంతులకు మహానుభావులును బ్రహ్మజ్ఞానులునగు సాధువుల దర్శనము లభించును. కుంభమేలలోని విశేషములను తమ అనుభవములను వర్ణించుచు శ్రీదిలీప కుమారరాయిగారు, అక్కడకు వచ్చిన సాధు పుంగవులలో నుత్తముడైన శ్రీజయకృష్ణగిరిని గూర్చి వివరించి వారి దివ్య బోధనలను కొన్నిటిని గ్రంథస్థము చేసిరి * ఆయనసందర్శించి తాను ధన్యుడనైతినని దిలీపకుమారరాయిగారు స్పష్టముగా వ్రాసిరి.

* Kumbha-India's Ageless Festival P. p. 71 - 72.
* P. p 85, 94 - 98, 100 - 103.

ఆయన పంజాబులోని చంబసంస్థానములో పదివేల అడుగుల యెత్తున గల భార్మోరు అను గ్రామమున నొక కుటీరములో నివసించు నిరాడంబరుడగు గొప్ప సాధువు. మహాతేజస్వి. ఆయన శ్రీరామగిరియను యోగికి శిష్యుడై ఇరువదియొక్క సంవత్సరములు కఠోరమైన నియమములతో సాధన మాచరించి గురువు అనుగ్రహము సంపాదించి బ్రహ్మజ్ఞానసంపన్నుడై లోక సంగ్రహము కొఱకే కుంభమేలకువచ్చి యొక చిన్న కుటీరమున నుండెను. అదృష్టవశమున దిలీపకుమారరాయి గారాయనను కనుగొనిరి.

భారతదేశమున వర్ణాశ్రమ ధర్మముల నుద్ధరించి అద్వైత మతమును స్థాపించిన శ్రీమదాది శంకరభగవత్పాదా చార్యులవారు ఉత్తరమున జ్యోతిర్మఠమును. దక్షిణమున శృంగేరిమఠమును. తూర్పున గోవర్ధన మఠమును పడమర శారదామఠమును స్థాపించి. ఈ మఠములకుచెందిన పరివ్రాజకులను సరస్వతి. పురి. వన. తీర్థ. గిరి. పర్వత భారతి. అరణ్య. ఆశ్రమ. సాగర. అను పది సంప్రదాయములవారిగా విభజించి ఆమఠముల కొక్కొక పీఠాధిపతిని నియమించి అక్కడి సాధువుల కధ్యక్షునిగా చేసిరి.భారత దేశములోని ఇతర సంప్రదాయములకు చెందిన సన్యాసులను కలసికొని మతధర్మములను గూర్చి చర్చించుటకును ఆస్తికులకు మత ధర్మములను బోధించి లోక సంగ్రహము చేయుటకును ఆయామఠములకు చెందిన సన్యాసులందఱును కుంభమేల మహాపుణ్యకాలమున త్రివేణీ సంగమ తీర్థమునకు పోవలయునని శ్రీ శంకరాచార్యులవారు శాసించిరని యొక యైతిహ్యమున్నది. అందువలననే సన్యాసాశ్రమమును స్వీకరించిన వారు విధిగా కుంభ మేలకు పోవుచుందురు.*

హరిద్వారమునందొకయోగి పుంగవుడు దిలీపకుమార్‌రాయి గారికి కొన్ని విశేషములను చెప్పెను. "జితేంద్రియులును. మహానుభావులైన సాధువులు అనాదికాలమునుండియు జన సామాన్యమునందు ఈశ్వరభక్తిని ఆధ్యాత్మిక చింతను కలిగించుటయెగాక. ప్రజల నీతి మత ధర్మములకు

* Kumbha: India's Ageless Festival Dilip kumar Roy and Indira Devi Pp. xxii - xxiii

వరవడిదిద్దు మార్గదర్శకులుగాను ప్రజలను ధర్మమునకు బద్ధులుగాచేయు ధర్మశాసకులుగాను ఉన్నారు. నిత్యనైమిత్తికాచార వ్యవహారములందు ప్రజల కేకాగ్రత కలిగించి, కర్మయోగము ద్వారాపురుషార్థములుసాధించు మార్గమునుజూపి, భగవద్గీతలో చెప్పబడిన లోక సంగ్రహమును గావించుటకై వీరు పాటుపడుచుందురు.

దుర్గమారణ్యములతోను కొండలతోను మహానదీ ప్రవాహములతోను రాకపోకలు సులభసాధ్యము కాని కాలమున దేశములో నొకరికొకరు దూరముగా నుండు సాధువులు లోక సంగ్రహముకొఱకు అప్పుడప్పుడు సమావేశమై తత్కాల పరిస్థితులను గూర్చి విచారించి దేశకాలపాత్రముల నాలోచించి తగు సంస్కరణలను గావించుట తమ కర్తవ్యముగా నెంచిరి. అందువలన వారు అప్పుడప్పుడు మహాక్షేత్రములందును పుణ్యతీర్థములందును ముఖ్యముగా మహాకుంభమేలయందును సమావేశమై లోక సంగ్రహము చేయుచుందురు.

ఇటీవల ప్రజారాజ్యములందలి ప్రజా ప్రతినిధుల శాసనసభలు చేయు కార్యములనే ఈ సాధువుల పరిషత్తులు చేయుచుండెను. అయితే నేటి పార్లమెంటు శాసనసభల యధికారము ఆధిభౌతిక మైనది. సాధుజన పరిషత్తుల అధికారము ఆధ్యాత్మికమైనది. ఈ సాధువులు పరతత్వజ్యోతియొక్క కింకరులని యెంచియె ప్రజలు వారి నిర్ణయములను శిరసావహించిరి గాని వారికి తమ ప్రతినిధులనిగాని తమపైన లౌకికాధికారము గల వారనిగాని కాదు. భారతీయులు ధర్మమునకు కట్టుపడిన ప్రజలు. అందువలననే వారు సాధువుల నిర్ణయములను శిరసావహించిరి.

కేవలము ఐహిక సుఖానుభవములకు తోడ్పడు లౌకిక విద్యయందుగాక ఆముష్మిక లాభమును చేకూర్పగల పరవిద్యయందే భారతీయులకు హెచ్చు గౌరవము. అందువలననే వారు రాజకీయ నాయకులను న్యాయశాస్త్రజ్ఞులను గాక బ్రహ్మజ్ఞాన సంపన్నులను త్యాగులు నగు సన్యాసులనే ధర్మశాసకులుగా చేసికొని గౌరవించుచున్నారు.

ఇటీవల భారతదేశములోను ప్రపంచములోను కలిగిన మార్పుల వలన భారతీయులందఱు పూర్వమువలె ధర్మవిరతికలిగి వర్తింపజాలక

పోయినను, ఈ మహాకుంభమేల చూచినవానికి మాత్రమీ భారతీయుల కింకను ధర్మనిరతి కలదనియు ధర్మశాసకులగు సాధువులపైన భక్తి విశ్వాసములు కలవనియు స్పష్టపడినది.

మానవ జన్మయొక్క లక్ష్యము పురుషార్థ సాధనమన్నను "ధర్మోధారయతే ప్రజాః" అనగా ప్రజాజీవనము ధర్మముపై నాధారపడి యున్నదని చెప్పినను నవ నాగరకులకు రుచింపకపోవచ్చును గాని, ఈ మహాతీర్థమును దర్శించినవారికిది నిజమని తోచితీరును. నిరాధారులగు నీ సాధువు లింతమంది యెట్లు నిర్విచారముగా జీవింపగలుగుచున్నారు? అను ప్రశ్న ప్రతియాత్రికునకును దీర్ఘాలోచనము కలిగించును దేశములో నన్ని ప్రక్కలను దీర్ఘతమస్సు వ్యాపించియుండగా కేవలము ఉదరపోషణ కొఱకు ప్రజలు ప్రాకులాడుచు సంసార సాగరమునందు రాజకీయ వ్యవహారములందు మునిగి తేలుచుండగా దేశము కల్లోలములో మునిగియుండగా నీసాధువులు నిర్లిప్తతో అన్నము దొరికినచో తినుచు లేనిచో నుపవసించుచు, ఇతరులు తిట్టినను కొట్టినను సహించుచు ఐహిక విషయములను విడనాడి ఆధ్యాత్మిక చింతతో నెట్లు కాలక్షేపము చేయుచున్నారు? వీరి చిత్తవృత్తులెట్టివి? ఆగంభీర హృదయములందేమి ఇమిడియున్నవి? ఈసాధువులు పూర్వమువలె ధర్మనిర్ణయములైన చేయుటలేదు. కాని కుంభమేలకు వచ్చుట మానలేదు. ఎవ్వరేమి చేయుచున్నను చూచుచు నూరకొందురు. ఎవ్వరిని నిందింపరు.

అసంఖ్యాకులగు నీసాధువుల సమావేశము ఇందులో బ్రహ్మజ్ఞానులగు వారి దర్శనము నేటికిని భారతీయుల హృదయములను కదలించుచున్నది కుంభమేలకుపోయిన స్త్రీ పురుషులందు ధర్మనిరతిని ప్రేరేపించుచున్నదని శ్రీ దిలీపకుమారరాయిగారు వ్రాసిరి *

"ధర్మోధారయతే ప్రజాః" ధర్మముచేతనే ప్రజలందఱు బద్ధులు. దేనిచే సమస్త ప్రజల ధారణయగునో అదియే ధర్మమని నిశ్చితమగునని శ్రీకృష్ణభగవానుడు చెప్పెను.

ధారణాద్ధర్మ మిత్యాహుర్ధర్మో ధారయతే ప్రజాః
యత్స్యాద్ధారణ సంయుక్తం సధర్మయతి నిశ్చయః॥

* Ibid p xxiv - v.

(మహాభారతము కర్ణపర్వము ౬౯. అధ్యా. ౫౯ శ్లో.) కావుననే యీధర్మము వదలిపోయిన యెడల సమాజ బంధనములు కట్టుబాటులు చెడిపోయినవని యెఱుంగవలెను సమాజము కట్టుబాటులు చెడి యది నశింపకుండ చేయుటకే సనాతన ధర్మమేర్పడినది. అందువలననే సాధువులు తమ ధర్మమును నిర్వర్తించుచున్నారు. భగవద్గీత ప్రవృత్తి మార్గమునే బోధించుచున్నదనియు, అందు చెప్పబడిన ప్రధానయోగము కర్మయోగమనియు, జ్ఞానానంతరమున జగత్తునందలి వ్యవహారములన్నియు కేవలము కర్తవ్యములేయని లోక కల్యాణార్థము చేయువాడే కర్మయోగి యనియు శ్రీలోకమాన్య బాల గంగాధరతిలక్‌గారు గీతారహస్యమునందు వ్రాసి, శ్రీమదాద్యి శంకర భగవత్పాదులవారును. శివాజీగురువగు సమర్థ రామదాసస్వామివారును, జ్ఞానప్రసారముచే జగదుద్ధారకములగు కర్మలను చేయుట నుదాహరణముగా చెప్పిరి. •

సచేతనమగు ప్రాణి కేవిధమగు పీడను కలిగింపక పోవుటయే అహింస. అది పరమధర్మమని వైదిక ధర్మమునందు చెప్పబడినది. అయితే మన ప్రాణముదీయుటకైనను, భార్య, కొమార్తె, వీరిని బలత్కార సలుపుటకైనను మనయింటికి నిప్పంటించుటకైనను, మన స్థిర చరాత్మక సర్వధన హరణము చేయుటకైనను ఎవ్వడైన దుష్టుడు కత్తిచేఁబూని సన్నద్ధుడుకాగా, సమీపమున నింకొకడు లేనప్పుడిట్టి ఆతతాయిని అహింసాపరమో ధర్మఃయని కన్నులు మూసికొని యుపేక్షింపరాదనియు ఆదుష్టుని సామోపాయముల చేతను, లేక విననియెడల దండోపాయముల చేతనైన యథాశక్తిగా శాసింపవలెనని ఇట్టి సమయములలో హింసా సంబంధమగు పాపము హింసకునికి దగులదనియు, ఆతతాయి, తన యధర్మముచేతనే చంపబడుచున్నాడనియు మనుస్మృతికర్త చెప్పినాడు. •

---

• గీతారహస్యము పుటలు ౪౧౪ - ౪౧౮.

• మనుస్మృతి. అధ్యాయము ౮. శ్లోకము ౩౫౦.

మనుపేకాక యితరులగు నవీన దండశాస్త్రకర్తలుకూడా ఆత్మ సంరక్షణము కొఱకు హింస బలప్రయోగము. చేయుటకు గంపూర్తిగా అంగీకరించిరి. అహింసాధర్మము ననుసరించియే క్షమ, శాంతి, దయ యను గుణములు శాస్త్రమునందు చెప్పబడినవి అయితే పైనచెప్పబడిన సందర్భములో వీని కపవాదము చెప్పబడినది. అందువలననే కర్తవ్యాకర్తవ్యముల నాలోచించి, ధర్మమునకు హానికలిగినప్పుడు అవసరమును బట్టి కత్తికూడా చేఁబూని. ధర్మ సంరక్షణము చేయుట వర్ణాశ్రమ ధర్మ పరులకు కర్తవ్యమైనది.

ఉన్మర్యాదే ప్రవృత్తేతు । దస్యుభిఃసంకరేకృతే ।
సర్వేవర్ణా నదుష్యేయుః శస్త్రవంతోయుధిష్ఠిర॥

అని మహాభారతమునందు చెప్పబడినది. § అనగా మర్యాద తప్పి పోగా దోపిడిగాండ్రు సంఘమును సంకరముచేయగా, అన్ని వర్ణముల వారు నాయుధములు ధరించి పోరాడినను దోషములుకారని తాత్పర్యము. ఈధర్మమునుబట్టి లోకసంగ్రహము కొఱకు ధర్మసంస్థాపనము కొఱకు సన్యాసులు కత్తిచేఁబూని యుద్ధముచేయుట ధర్మమని తేలుచున్నది. సంస్కృతమున విద్వాంసుడును పురాణేతిహాసములను ధర్మశాస్త్రములను ఎఱిగినవారగు శ్రీ బంకించంద్ర చటర్జీగారు 1767-1775 మధ్య సన్యాసులు చేసిన యుద్ధమును కథావస్తువుగా గైకొని రచించిన ఆనందమఠ యను తన నవలలో నీసంగతులను చక్కగా వివరించి.

"మ్లేచ్ఛనివహనిధనే కలయసి కరవాలం
దూమకేతు మివకిమపి కరాళం
కేశవ ధృత కల్కి శరీర
జయజగదీశ హరే॥"

అను జయదేవుని గీతగోవిందములోని శ్లోకమును తన సన్యాసి వీరులలో నొకరిచేత పాడించినారు.

కలియుగాంతమునందు దుర్మార్గులు మ్లేచ్ఛులు ప్రబలి లోకమునకు బాధ కలిగించగా, వారినందఱను ఖడ్గమున జంపుటకై, ప్రజానాశమును

§ శాంతిపర్వము. 78 అధ్యాయము. 18వ శ్లోకము

సూచించు శోకచక్కవంటి కరవాలము ధరించి కలికి రూపమున నవత రించు హరిని కీర్తించు శ్లోకమిది.

ఆకాలమునాటి యదార్థ చరిత్రలను చదివినచో సన్యాసులు చేసినది, ధర్మయుద్ధమేయని తెలియగలదు. ఆంగ్లేయోద్యోగులు ఆకాలమున పైయధికారులకు వ్రాసిన లేఖలలోను ఆంగ్ల చరిత్రకారులు వ్రాసిన గ్రంథములలోను యదార్థ చరిత్రమును మఱుగుపఱచుట కెన్నివిధములుగా ప్రయత్నించినను సత్యము దాగక బయటపడుచునే యుండెను. తూర్పు ఇండియా వర్తక కుంపినీవారి కచేరిలందు అనేక రహస్య లేఖలు వివరములు కైఫీయతులు నిప్పటికిని ప్రకటింపబడలేదు. ప్రకటితములైన చరిత్ర సామగ్రిని బట్టియె యదార్థ చరిత్ర కొంతవరకు తెలియుచున్నది. అట్టి గ్రంధములలో వారన్‌హేస్టింగ్సు జీవితమును గూర్చి గ్లెయిగ్‌దొర వ్రాసిన పెద్ద గ్రంధమును కలకత్తాలోని కుంఫిణీ రికార్డులలో కొన్ని భాగములను ప్రకటించుచు 1926 సంవత్సరము సెప్టెంబరు అక్టోబరు మోడరన్ రివ్యూ పత్రికలో శ్రీ బ్రజేంద్రనాధబెనర్జీగారు వ్రాసిన వ్యాసములును ముఖ్యమైనవి.

ఇంగ్లీషు తూర్పు ఇండియావర్తక కుంపిణీవారి కలకత్తా ఫ్యాక్టరీలోని కార్యాలోచన సంఘము లేక కవున్సిలువారు 1773 లో నిట్లు వ్రాసిరి.

"ఎట్టి హద్దుపద్దు లేని గడేకారి దోపిడిగాండ్రు కొందఱు సన్యాసులను పేరుతో తీర్థయాత్రలు చేయు నెపమున సంచరించుచు చిరకాలము నుండి వంగరాష్ట్రములోని ప్రధాన భాగములందు భిక్షాటనముచేయుట, వీలైనప్పుడు దొంగతనములు దోపిడీలు చేయుట పరిపాటియైయున్నది.

"వంగదేశమున సంభవించిన ఘోరమైన దుర్భిక్షము కవి విని సౌఖ్యగని కఱవువలన 1770 మొదలు ఆకటికి మాడిచచ్చుచు వ్యవసాయము చేయుటకు పరికరములుగాని విత్తనములుగాని లేక దిక్కులేక తిరుగుచున్న అసంఖ్యాక గ్రామజను లీ సన్యాసుల మూకలలో చేరుట వలన వీరి సంఖ్య విపరీతముగా పెరిగినది.

"1772 వ సంవత్సరము శీతకాలములో సన్యాసులమూక యేబది వేల జనము చొప్పున బయలుదేరి, వంగదేశములోని దిగువ ప్రాంతము లందు పొలములలో పండిన పంటలపైనబడి దోచుకొనుచు, కొల్ల కొట్టుచు నాశనము చేయుట ప్రారంభించిరి

"కుంపినీవారి కలెక్టరులు సైన్యములను తెప్పించి వీరిని అణచి వేయవలెనని ప్రయత్నించిరి. కుంపినీవారి సిపాయిలకు మొదట కొంత జయము కలిగెనుగాని తరువాతవారికి పూర్తిగా అపజయమే కలిగినది. వారి సేనానాయకుడైన కెప్తానుథామస్‌తోకూడా వారందరు సన్యాసుల చేతిలో చచ్చిరి.

"అంతటసన్యాసులపైకి అనుభవజ్ఞుడైనసేనానాయకుని పంపించితి మనియు అతనికి జయము చేకూరినదనియు ఆ శీతకాలము చివరలో కవున్సిలువారు కుంపిణీవారి పై యధికారులకు వ్రాసిరి ఒక నెల గడిచిన తరువాత చూడగా వీరు వ్రాసిన సంగతి దూరమాలోచింపకుండా వ్రాసి నట్లు తెలిసిపోయెను. ఏలనగా 1773 సంవత్సరము మార్చి 31 తేదీన కవున్సిలు అధ్యక్షుడును గవర్నరునైన వారన్ హేస్టింగ్సు కుంపిణీ యధికారులకు వ్రాయుచు కెప్తాను థామసు తరువాత సైన్యాధిపత్యము వహించిన సేనాధిపతికికూడా అతని దుర్గతియె పట్టినదనియు అప్పుడు సన్యాసులతో కుంపిణీవారి పటాలములు నాలుగు యుద్ధము చేయుచున్న వనియు, చుట్టుప్రక్కలనున్న జమీందారులవలనకూడా ఆయుధపాణులైన సిబ్బందిని తెప్పించితిమనియు వీరందరు కలిసిచేసిన ప్రయత్నముకూడా విఫలమైనదనియు బయల్పరచెను. "ఆ ప్రాంతములందు కుంపిణీవారు శిస్తులను వసూలు చేయజాలకపోయిరి ఆ ప్రాంతములందలి గ్రామప్రజ లందరు సన్యాసులతో చేరి కుంపిణీవారి కెదురు తిరిగిరి ఆ ప్రాంతము లందలి పరిపాలనా విధానము భగ్నమైనది వంగదేశము చాలా ప్రశాంత ముగా నున్నదని కొందరు చెప్పుచుండినను ఈ సన్యాసుల దండ యాత్రఏటేటను జరుగుచుండెను " అని వంగదేశపు గ్రామజీవన చరి త్రమునందు హంటరుగారు వ్రాసిరి.

---

• Annals of Rural Bengal- Hunter- pp 70-72

1 Lettes of Warren Hastings to Colebrooke dated 2nd February 1773 Gleig's Memoris Vol 1. p. 282.

2. Letter of Warren Hast ngs to TobiasDupve, 9th March and letter to purting dated 3 st Mareh 1773, para 4.,

Gleigs Memoirs of Warren Hastings Vol I p. 294

3 Letter of Warren Hastings to sir George Colebrooke dated 31st March 1773.

4 Letter of Warren Hastings to Lawrence dated 20th March 1774

5. History of Sannavasi Rebellion, Annals of Rural Bengal - Hunter, pp 73-74.

6. History of India - Hindu and Mahamadan periods, Mount stuart Elph nstone (1841) pp56-61

7. A Digest of Hindu Law West and Buhler pp 552 - 573

8 The Sanyasi Rebellion in Bengal based on un published records-Brijendranath Banerjee Modern Review 1926. September and October.

9. Rise and Fulf llment of British Rule in India Edward Thmpson and G T Garratt Macmillan(1935)

10. Anand Matt Bunkimchandra chaterjee

11. Kumba Indias Ageless Festival Dilipkumar Roy and Indira Devi Bharatiya Vidya Bhavan.

# అభిప్రాయములు

# బ్రిటిష్ ఇండియా చరిత్ర

## (భారతదేశమున బ్రిటిష్ రాజ్యతంత్రము)

* ఎన్నో గ్రంథాలు చదివి, ఎన్నో వళ్ళు కృషి చేస్తేనేగాని ఇలాంటి వాస్తవచరిత్ర వ్రాయడం దుర్లభము.

ప్రతిభ, అక్టోబరు 1938.

★

* "శాశ్వతంగా వుంచాలనే దృష్టితో సత్యాన్ని కప్పిపుచ్చి కల్పనలుచేసి వ్రాయబడ్డ హిందూదేశ చరిత్రలే నేటి విద్యావిధానంలో ఉపయోగింప బడుతున్నాయి. కాని గ్రంథకర్తగారు శ్రమించి అనేక విషయాల్ని సేకరించి యథార్థ హిందూదేశ చరిత్రని యీ పుస్తకంలో పొందు పరచారు. అయోమయంగాను, అసత్య భూయిష్ఠంగాను వున్న గడచిన భారతదేశంయొక్క నిజచరిత్ర తెలిసికొనవలెనంటే యిది చదివితీరాలి.

"ఇట్టి అత్యుత్తమ విషయాల్ని చేకూర్చి వ్రాసిన శ్రీ దిగవల్లి వేంకటశివరావుగారికి మా ధన్యవాదాలు."

—గృహలక్ష్మి, జూన్ 1939.

* "శివరావుగారు న్యాయవాద వృత్తిలో వుండికూడా అవకాశం చూసుకుంటూ దేశానికి వుపకరించే గ్రంథాలు చాలా వ్రాశారు. వీరు మనదేశంలో Publicists లో ప్రముఖులు. విషయములను బాగా చర్చించి నిష్పాక్షిక సమాధానం చెప్పగలశక్తి వీరికి బాగావుంది. ఒట్టిమాటలుకాక, చెప్పిన ప్రతి సందర్భాన్నీ ప్రమాణాలతో అంకెల పట్టికలతో సమర్థిస్తారు..

"బ్రిటీషువారి రాజ్యతంత్రము ఏవిధంగా మనదేశంలో పరిణమించిందో, అభివృద్ధి నిజంగా అభివృద్ధి అవునో కాదో, నూతన ఇండియా రాజ్యాంగచట్టము ఎటువంటిదో చాలా బాగా వివరించారు...

"అనేక అపూర్వ గ్రంథములు, రిపోర్టులు, రికార్డులు పరిశీలనచేసి ఈ గ్రంథము వ్రాసినారు."

ప్రతిభ. ఏప్రిల్ 1938.

★

* "తెలుగుదేశంలో తెలుగువారికి సమస్తవిషయాలు తెలిపే గ్రంథాలు తెనుగుననే ఉండాలని నమ్మి అందుకొరకు శక్తివంచన చేయక పాటుపడుచున్న గ్రంథకర్తలలో శివరావుగారు ఒకరు......విషయాలన్నీ లెక్కలతోసహా చక్కగా వ్రాసి ఆంధ్రసేవ చేశారు."

—ప్రజామిత్ర 12-6-38.

★

# కథలు - గాథలు

[మొదటి భాగము]

భారతి పత్రికాభిప్రాయము

"భారతి, ఆంధ్ర వారపత్రికా పాఠకులకు చిరపరిచితి మైన దిగవల్లి వారి గసవచ్చరిత్ర రచనలు అలతి అలతి మార్పులతో ప్రస్తుత గ్రంథరూపము దాల్చినవి. 'చక్రవర్తికి శిక్ష విధించిన దివానులు' 'తురకల దశావతారములు' 'సీతారాముల శాపం', 'కాశీ మశీదులో శివలింగం' మొదలైన వింత వింత శీర్షికలతో శివరావుగారు తాము పాతపురాణములను, పాత కవిలె కట్టలను, అనన్యసామాన్యమైన ఓర్పుతో చక్కని కథల రూపమున ఈ గ్రంథమున చిత్రించియున్నారు. నిజమునకిది చరిత్ర గ్రంథమైనను కథల సంపుటివలె జనసామాన్యమునకు పయిలతము చదువ నింపుగా నున్నది. ఈ గ్రంథమందు ప్రతిపుటలోను శివరావుగారి పరిశోధన ప్రావీణ్యము, సత్యాన్వేషణ తత్పరత ద్యోతక మగుచున్నది."

— భారతి. తారణ సం॥ కార్తీకము.

★

## శ్రీ మాడపాటి హనుమంతరావు పంతులుగారు

## హై ద రా బా దు.

* ఈ పుస్తకములు (వ్యవహారకోశము, శాస్త్రపరిభాష) మన మాతృభాషకు అమూల్యాంకారములని చెప్పనొప్పును. 30-3-1935.

* ఇటీవల తము హిందూదేశ చరిత్రముయొక్క బ్రిటిషు మహాయుగమును గురించి వ్రాసిన యుద్గ్రంథమును మన్మిత్రులు శ్రీ సురవరము ప్రతాపరెడ్డి బి. ఏ, బి. ఎల్ గారి వద్ద నుండగా అచ్చటచ్చట చదివితిని. తమ యితర గ్రంథములవలెనే యిదియు అమూల్యమును సప్రమాణమునై బ్రిటిష్ మహాయుగమును గూర్చిన ఉత్తమ గ్రంథము లేని కొరతను చాలావరకు తీర్చినట్లు గ్రహించితిని.'' 25-1-1943.

★

## బ్రహ్మశ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారు, తిరుపతి.

* ''మీ వాఙ్మయ సేవాతత్పరతకు జోహారులు''

11-3-1943.

మీ గ్రంథములు (కథలు - గాథలు) సర్వాంధ్ర జనులు కుతూహలముతో అపూర్వ విషయ సంగ్రహణోత్సాహము తొందర పరచుచుండగా వడిగా చదివి తనియగలరు.

10-2-1947.

శ్రీ చిరంత నానందస్వామివారు రామకృష్ణమఠము,

మ ద్రా సు.

"మీ రచనలను చదివి బ్రహ్మానందమునందు వారిలో నేనొకడను. దేశభక్తియు, మతభక్తియు, మీ రచనలందు వెల్లివిరియుచుండును పాఠకులందు వానిని బురికొల్పుచుండును. ఇట్టి రచనలే దేశమున కిప్పుడత్యంతావశ్యకములు.
26-7-1944.

★

శ్రీ పోపూరి నరశింహముగారు ఆంధ్రోపాధ్యాయులు,

మార్కాపురము.

"తాము రచించిన బ్రిటిష్ రాజ్యతంత్రము చదివి యానందించితిని. తమ యపూర్వకృషియే నన్ను మీసందర్శ నోత్సుకునిగ జేసినది. అపరచితుడిట్లు వ్రాసెనని యన్యథా భావింపవలదు." 13-7-1944.

★

శ్రీ దేవరాజు వేంకటకృష్ణారావుగారు, విశాలాంధ్రవాణి

బ రం పు రం.

"మీరు రచించిన ఆయా గ్రంథములే లేకున్న యెడల మరి దేశచరిత్రే లేదు. ఇది నాయభిప్రాయము" 12-9-1951.

అత్యంతోప యుక్తముగా నీగ్రంథము (దక్షిణాఫ్రికా చరిత్ర)ను రచించి ఆంధ్ర మహాజనుల కృతజ్ఞతకు పాత్రులైనారు. భారతి, మార్చి 1928.

★

శివరావుగారి ఆంధ్రభాషాసేవా ఫలితమే యీ పరిభాషా నిఘంటువు. కృష్ణాపత్రిక 21-8-35.

★

దిగవల్లి వేంకట శివరావు రచనలు

అమ్మకమునకు సిద్ధముగానున్నవి.

కథలు - గాథలు, ఒకటి రెండు భాగములు కలిపిన సంపుటము

(రెండవకూర్పు) రు 3-8-0.

మూడు నాలుగు భాగములు ఒక్కొక్కటి రూ. 2-0-0.



ప్రయాగ-కుంభమేలలో సన్యాసులు.
(శ్రీ సుందరానంద విద్యావినోదగారి సౌజన్యముతో)